ఓమ్

కేనోపనిషత్తు

శాంతిమంత్రము

ఓమ్ సహ నా వవతు, సహ నౌ భునక్తు, సహ వీర్యం కరవావహై
తేజస్వినా వధీత మస్తు, మా విద్విషావహై

ఓం శాంతిః శాంతిః శాంతిః

అర్థము :- నౌ = మమ్మును, సహ = కూడ, అవతు = రక్షించుగాత ! నౌ = మమ్మును, సహ = కూడ, భునక్తు = పాలించునుగాత ! సహ = కూడ, వీర్యమ్ = విద్యావిషయకోత్సాహమును, కరవావహై = చేయుదుముగాత ! నౌ = మాయొక్క, అధీతమ్ = అధ్యయనము, తేజస్వి = ప్రభావవిశిష్టమైనది, అస్తు = అగుగాత ! మా విద్విషావహై = పరస్పరము ద్వేషింపకుందుముగాత !

తాత్పర్యము :- పరమేశ్వరుడు మమ్మునిద్దరను రక్షించునుగాత! మమ్ము నిద్దరను పాలించునుగాత! ఇద్దరమును కలిసి విద్యావిషయకోత్సాహమును చేయుదుముగాత! మేము గావించిన యధ్యయనము ప్రభావవిశిష్ట మగుగాత! మేము పరస్పరము ద్వేషింపకుందుముగాత!

అంతరింద్రియజయము గలుగుగాత!

వివరణము

ప్రతిఉపనిషత్తునందును గ్రంథారంభమునకు ముందు శాంతిమంత్రము పఠించుట సంప్రదాయము. శిష్టసంప్రదాయావిచ్ఛేదముకొఱకీయుపనిషదారంభమునను శాంతిపఠనము గావింపబడుచున్నది. కావ్యారంభమునందు మంగళాచరణమువలె నుపనిషదారంభమునందు శాంతిమంత్రము ప్రధానస్థాన మాక్రమించుచున్నది.

ఈశాంతిమంత్రమునందు గురుశిష్యు లిద్దరును పరమేశ్వరుని ప్రార్థించుట ప్రతిపాదింపబడినది. తద్ద్వారా పరమేశ్వరానుగ్రహము పొంది వారియధ్యయనము వీర్యవత్తర మగుటయు నాకాంక్షింపబడినది. ఇంతియే గాదు, పరస్పర ద్వేషాభావముకూడ ప్రార్థింపబడినది.

సహ నా వవతు — మమ్మునిద్దరను కూడ రక్షించునుగాత మని వాక్యార్థము.

నౌ సహ — మమ్ము నిద్దఱను కూడనని యర్థము. అయిన నీయిద్ద రెవరు ?

ఉపనిషత్తులు ముముక్షువుల నుద్దేశించి పరమేశ్వరునిచే ననుగ్రహింపబడినవిగాన నిం దొకడు ముముక్షువు. ఈశాంతిమంత్రమునం దధ్యయనము ప్రస్తావింపబడినదిగాన ముముక్షువే యధ్యేత. అధ్యయనము రెండువిధములుగా గావింపవచ్చును. స్వయముగా లిఖిత గ్రంథములు చూచి చదువుకొనుట యొకవిధము. గురుముఖతః అధ్యయనము చేయుట రెండవది. శిక్షయందు లిఖితపాఠకుడు పాఠకాధము లలో పరిగణింపబడుటచేతను, ఉదాత్తాదిస్వరములు గురుముఖతః శ్రవణపూర్వకముగా నధ్యయనము గావించిననే యలవడుట కవకాశ ముండుటచేతను, సాంప్రదాయికవిశేషములు గురుద్వారానే తెలిసి కొనవలసిన వగుటచేతను నధ్యయనమున నధ్యాపయితావశ్యకత యున్నది. కావున నిద్దరిలో రెండవవాడు గురువు. కావున నౌ అనగా మమ్మునిద్దర నని అనగా గురుశిష్యుల నిద్దరను నని యర్థము.

సహ అను నవ్యయమునకు కూడ నని యర్థము. నౌ సహ అనగా మమ్ము నిద్దరను కూడనని యర్థము. సహసంబంధము లేక నౌ మమ్ము నిద్దర ననిన గురుశిష్యులను వ్యస్తముగా రక్షించినను రక్షించుట కవకాశ మున్నది. సహ యనుటచే నావిధముగ వ్యస్తముగ గాక సమష్టిగ నేకప్రయత్నమున నేకకాలమున రక్షించుట సూచింపబడుచున్నది.

అవతు — రక్షించుగాత మని యర్థము. కాని యీవాక్యము నందు కర్తృపదము లేదు. అయిన నవనకర్త యెవరు ?

రక్షణము దేనినుండి? అధ్యాపయితృధ్యేత లేదియే నొకపరమ ప్రయోజనము నాకాంక్షించి యధ్యయనము గావించుచు రక్షణము గోరుచున్నారు. ఈమంత్రమునందలి అధీతమ్ అనుపదముచే వారి ప్రయత్న మధ్యయనమని సూచింపబడుచున్నది. అధ్యయనసంపూర్తికి రక్షణ మవసరమే. అధ్యయనము కేవలాధ్యయనమాత్రపర్యవసాయిగా నుద్దేశింపబడలేదు. అధ్యయనప్రయోజనము ముముక్షువునకు విషయ పరిజ్ఞానము గలుగుట. ముముక్షు వనగా మోక్తు మిచ్ఛుః=విడివడుటకు గోరినవాడు. దేనినుండి? మృత్యువునుండి యని

త్రియంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్
ఉర్వారుక మివ బంధనా న్మృత్యో ర్ముక్షీయ మాఽమృతాత్

త్రియంబకమంత్రము బోధించుచున్నది. మఱియును

ఆ వో రాజాన మధ్వరస్య రుద్రగ్ం
హోతారగ్ం సత్యయజగ్ం రోదస్యోః
అగ్నిం పురా తనయిత్నో రచిత్తా
ద్ధిరణ్యరూప మవసే కృణుధ్వమ్

ఈమంత్రము మృత్యువునుండి రక్షణముకొఱకు రుద్రు నారాధించుడని బోధించుచున్నది. కావున శాంతిమంత్రమునందలి అవతు=రక్షించు గాత మనుపదమునకు మృత్యువునుండి రక్షించుగాత మని యర్థము. మఱియును విషయపరిజ్ఞానము గలిగించునది యధ్యయనముగాన దానికి గలుగబోవు విఘ్నములనుండి రక్షించుగాత మని యర్థము. పైమంత్రములయందు రుద్రారాధనము విధింపబడుటచే అవతు అనుక్రియాపదమునకు కర్త రుద్రుడని తేలుచున్నది. ఇంతియే గాదు. ప్రకృతమున నధ్యేత ముముక్షువైనను అధ్యాపయితయగు గురువును ముముక్షువయియే యధ్యయనము గావించి యధ్యాపయిత యగుటచే నాతనికిని రక్షణ మావశ్యకముగాననే మంత్రమునందలి నౌ సహ అనుపదము

లన్వర్థము లగుచున్నవి. ఉపాసనామార్గమున గురువు కొంతదూర మేగినాడు. శిష్యు డిప్పుడే పదప్రవేశము చేయనున్నాడు. ఇంతియే తేడా. కాని అధ్యయనమున నిర్ధరిసంకల్పములును నేకోద్దేశములే.

నౌ అధీతం తేజస్వి అస్తు — మాయధ్యయనము ప్రభావవిశిష్ట మగుగాత మని వాక్యార్థము.

శిష్యు డధ్యయనము చేయుచున్నాడు, గురువు శిష్యునిచే నధ్యయనము చేయించుచున్నాడు. ఈయధ్యయనము తేజస్వి గావలయునని వారిప్రార్థన. తేజస్వి యనగా ప్రభావవిశిష్టమైనది. అధ్యయనప్రభావమువలన వారి కభిమతార్థసిద్ధి గావలయును. అధ్యయనపరమప్రయోజనము మృత్యుమోక్షము. అధ్యయనము సక్రమముగా నెరవేరుచు తత్పరమప్రయోజనమైన మృత్యుమోక్షమునకు చక్కని యవకాశ మేర్పడవలయును. అప్పటికిగాని వారి కభిమతార్థసిద్ధి గాదు. అభిమతార్థసిద్ధిహేతువగుటయే యధ్యయనముయొక్క ప్రభావవైశిష్ట్యము.

మా విద్విషావహై — పరస్పరము ద్వేషించుకొనకుందుముగాత మని వాక్యార్థము.

ద్వేషము అనగా శతృత్వము — పగ. శతృత్వమున కనేక కారణము లుండవచ్చును. తనకన్న నధికులగువారివిషయమున శతృత్వము వహించి వారి నాస్థితినుండి తొలగించి తా మాస్థానము నాక్రమించుటకై ప్రయత్నించుట లోకమున ననుభవములో నున్నది. ఒకొక్కప్పుడు సములవిషయముసను పగబూనుట కలదు. దీని ఫలితము మనశ్శాంతిని గోల్పోవుట. మనశ్శాంతిని గోల్పోయిన వ్యక్తి యకార్యములకు పాల్పడును. తత్ఫలిత మధోగతియే.

ద్వేషమునకు మూల మసూయ — పరశ్రేయస్సహనము లేకపోవుట. ఇతరులు తమకన్న నధికస్థితిలో నున్నారని యసూయపడుట

కంటె తా మాస్థితియందు లేకపోవుటకు కారణములు పరికించి యేమైన నభ్యంతరము లున్న వాసిని తొలగించికొనుచు నాస్థితికి వచ్చుటకై ప్రయత్నించుట సజ్జనలక్షణము.

ప్రకృతప్రకరణమున గురుశిష్యులలో గురువు విద్యాధికుడు. మఱియును సర్వవికారములను నశింపజేసికొని పరమేశ్వరారాధనము గావించుచు నపునరావృత్తముగ హార్దబ్రహ్మయందు సాయుజ్యము నందగోరుచున్నవాడు. మఱి శిష్యుడో ఆస్థితికి రావలసినవాడు. కాని యిప్పుడిప్పుడే యుపాసనామార్గమున నడుగిడుచున్నవాడు. ఇప్పటివఱకును నైహికజీవనమున, సర్వవికారాస్పదమైన జీవనమున తన్మయుడై కాలక్షేపము చేసినవాడు. మఱియును

పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేద మాయాత్

కర్మలంపటతను వీడి నిర్విణ్ణుడు, విరాగియైనాడు, కాని పూర్వవాసనాబలమున నెప్పుడైనను నాతడు అసూయాద్వేషాదులకు గురి కావచ్చును. కావుననే మా విద్విషావహై = పరస్పరము ద్వేషించుకొనకుందుము గాత మని ప్రార్థనము గావింపబడినది.

మా విద్విషావహై అను ద్వివచనము గురుశిష్యుల నుద్దేశించి ప్రయోగింపబడినదైనను ప్రధానముగా శిష్యుడే యుద్దేశింపబడినాడు. గురు వుపాసనామార్గమున చాలవఱకు పయనించినవాడుగాన నాతనిని వికారము లేమియును చేయజాలవు. శిష్యునివిషయమున వికారమున కవకాశ మున్నదని యెంచియే యీప్రార్థనము గావింపబడినది.

శాంతిపాఠద్వితీయమంత్రము

ఓమ్ ఆప్యాయంతు మ మాంగాని వా క్ప్రాణ శ్చక్షుః శ్రోత్ర మథో బల మింద్రియాణి చ సర్వాణి సర్వం బ్రహ్మోపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోత్ అనిరాకరణ

మ స్త్వనిరాకరణం మేఽస్తు తదాత్మని నిరతే య ఉపనిషత్సు
ధర్మా స్తే మయి సంతు తే మయి సంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

అర్థము :- మమ = నాయొక్క, అంగాని = కరచరణాద్యవయవములును, వాక్ = వాగింద్రియమును, ప్రాణః = ప్రాణవాయువును, చక్షుః = చక్షురింద్రియమును, శ్రోత్రమ్ = శ్రోత్రేంద్రియమును అను మొదలైన, సర్వాణి = సమస్తములైన ఇంద్రియాణి చ = ఇంద్రియములను, అథో = పిమ్మట, బలమ్ = ఓజస్సును, ఆప్యాయంతు = తృప్తములై స్వకార్యనిర్వహణసమర్థము లగుగాత! సర్వమ్ = సమస్తమును, ఔపనిషదమ్ = ఉపనిషత్ప్రతిపాదితమగు, బ్రహ్మ = పరమేశ్వరుడే. అహమ్ = నేను, బ్రహ్మ = పరమేశ్వరుని, మా నిరాకుర్యామ్ = అనాదరము చేయకుందును గాత! అనిరాకరణమ్ = అనాదరము చేయకుండుట, అస్తు = అగుగాత! మే = నాకు అనగా నావిషయమై, అనిరాకరణమ్ = అనాదరము చేయకుండుట, అస్తు = అగుగాత! తదాత్మని = ఆపరమేశ్వరునియందు, నిరతే = ఆసక్తుడనైన, మయి = నాయందు, ఉపనిషత్సు = ఉపనిషత్తులయందు, యే = ఏ, ధర్మాః = ధర్మములు ప్రతిపాదింపబడినవో, తే = ఆధర్మములు, సంతు = సుస్థితములై యుండుగాత! తే = ఆధర్మములు, మయి = నాయందు, సంతు = సుస్థితములై యుండుగాత!

తాత్పర్యము :- నాకరచరణాద్యవయవములును, వాగాదికర్మేంద్రియములును, చక్షురాదిజ్ఞానేంద్రియములును, ప్రాణవాయువును, ఓజస్సును తృప్తములై స్వకార్యనిర్వహణసమర్థము లగుగాత! ఈపరిదృశ్యమానము సమస్తమును పరమేశ్వరుడే. పరమేశ్వరుని నేను నిరాకరించకుందునుగాత! పరమేశ్వరుడు నన్ను నిరాకరించకుండునుగాత! నావిషయమున నిరాకరణమునకు సంబంధము లేకపోవుగాత! పరమేశ్వరారాధకుడనైన నాయందు దుపనిషత్తులయందు ప్రతిపాదింపబడిన ధర్మములు స్థిరముగా నుండునుగాత! స్థిరముగా నుండునుగాత!

అంతరింద్రియజయము గలుగుగాత!

వివరణము

పూర్వమంత్రమునందు గురుశిష్యులు పరమేశ్వరుని ప్రార్థించుట ప్రతిపాదింపబడినది. ఈమంత్రమునందు కార్యనిర్వహణసామర్థ్యమును, ధర్మాసక్తియు ప్రతిపాదింపబడుచున్నవి.

ఆప్యాయంతు మమాంగాని . . . ఇంద్రియాణి చ సర్వాణి :– నాకరచరణాద్యవయవములును, వాగాదికర్మేంద్రియములును, చక్షురాదిజ్ఞానేంద్రియములును, ప్రాణవాయువును, ఓజస్సును తృప్తములై స్వకార్యనిర్వహణసమర్థము లగుగాత మని యర్థము.

జన్మకు సార్థక్యము గలిగించు దేవయానమార్గమున పయనించుచున్నాడు గురువు. పయనింపనున్నాడు శిష్యుడు. ఈపయనమునకు కావలసిన పూర్వరంగ మీవాక్యమున వర్ణింపబడినది. లోకమున నేపని నిర్వహింపవలసినను దానికి గావలసిన సామర్థ్య ముండవలయును. శరీరము సమర్థముగా నున్నగాని యేపనియును నెరవేరదు. కావుననే కార్యనిర్వహణసామర్థ్యము ప్రార్థింపబడుచున్నది.

కార్యనిర్వహణమునకు కర్మజ్ఞానేంద్రియములు పటిష్ఠములై యుండవలయును. సర్వమునకును – యావత్ శరీరసుస్థికిన్ని – ప్రాణవాయువు మూలాధారము. ప్రాణవాయువు యథావిధిగ స్వకార్యనిర్వహణము గావించుచున్న జీర్ణాదిక్రియలు సక్రమముగా నిర్వహింపబడుచు శరీరము పటిష్ఠమై యుండును. రసరక్తాదిధాతువులు స్వస్థితిలో నున్న శరీరమున నోజస్సు అనునది యేర్పడును. దీనికే బల మని పేరు. ఓజస్సనగా శుక్రము సమృద్ధిగా నున్నపుడుగలుగు సామర్థ్యము. కావుననే మంత్రమునందు అంగేంద్రియసామర్థ్యమును ప్రార్థించుటతో పాటు ప్రాణౌజఃప్రార్థనమును గావింపబడినది.

సర్వం బ్రహ్మౌపనిషదమ్ :– పరిదృశ్యమానమగు సమస్తమును నుపనిషత్ప్రతిపాదితమగు బ్రహ్మపదార్థమే యని వాక్యార్థము.

ఇప్పటివఱకును శిష్యుని కనుభవములో నున్నది విశ్వమే. సర్వమ్ = ఈవిశ్వమంతయును బ్రహ్మమే. అహమ్ = నేను అను పదమునకు జీవుడును, శరీరమును నర్థమైనట్లు శివజగత్తులసమిష్టికే బ్రహ్మ మను వ్యవహారము. ఈవిషయము

శక్తిః శివ శ్చ సచ్ఛబ్దప్రకృతిప్రత్యయోదితౌ
తౌ బ్రహ్మ సామరస్యేన సమస్తజగదాత్మకౌ

అను శివపురాణవాయవీయసంహితావచనముచే వివరింపబడినది. కావున నే మంత్రమునందు సర్వమును బ్రహ్మమని నిర్వచింపబడినది.

శక్త్యాది చ పృథివ్యంతం జగ దేత చ్చరాచరమ్
విగ్రహం దేవదేవస్య పరమేశస్య శూలినః

జీవునకు శరీర మధిష్ఠాన మైనట్లు చరాచరాత్మకమైన జగత్తు పరమేశ్వరునిశరీరము. కావుననే పరమేశ్వరు ననుగ్రహింపజేసికొనవలయు నన్న తచ్ఛరీరమగు జగత్తు నారాధింపవలయును. శరీరమునకు గావింపబడిన స్రక్చందనాద్యలంకారములవలన జీవుడు సుఖించునట్లు జగదారాధనమువలన పరమేశ్వరుడు సంతుష్టుడై యనుగ్రహించును. విశ్వారాధన మనగా విశ్వాంతఃపాతిప్రాణ్యారాధనము. ఈవిషయము

వృక్షస్య మూలసేకేన శాఖాః పుష్యంతి వై యథా
భక్తస్య జిహ్వయా తద్వ త్ప్రసీదతి మహేశ్వరః

అను పౌరాణికవచనముచే వివరింపబడినది.

మాఽహం బ్రహ్మ నిరాకుర్యామ్ :— నేను బ్రహ్మ ననాదరింపకుందునుగాత మని యర్థము.

ఐహికజీవనమున జగత్తు ప్రధానస్థాన మాక్రమించుచున్నది. శరీరపోషణమునకు భౌతికపదార్థము లావశ్యకములు. కావున నిప్పటివఱకును తత్సమృద్ధికై వెంపరలాడినాడు. తనపోషణము వచ్చునప్పటికి సర్వమును ననాదరించి పోషణమున కావశ్యకములైన పదార్థముల సంపాదనమునకై యత్నించుట లోకానుభవమున నున్నవిషయమే. కావున స్వపోషణమున జగత్తునం దాదర మత్యుత్కటమని తెలుచున్నది.

ముముక్షు వగుటచే మృత్యుమోక్షమును కోరినవాడుగావునను, కేవలైహికభోగలంపటతవలననే సంసరణబంధమున తగుల్కొనుట

చేతను, నిది యంతయును జగదాదరమువలన సంభవించుచున్నదని తేలుటచేతను నం దాసక్తి తగ్గుచు పరమేశ్వరానుగ్రహము లేనిది మృత్యుమోక్షము సంభవింపదుగాన పరమేశ్వరునియం దాదర మనగా భక్తి హెచ్చుచున్నది. కావున నియ్యది స్థిరముగా నుండవలయునను నుద్దేశముతో మాఽహం బ్రహ్మ నిరాకుర్యామ్ అను నిశ్చయమునకు వచ్చినాడు.

మా మా బ్రహ్మ నిరాకరోత్ :– నన్ను బ్రహ్మ నిరాకరింపకుండునుగాత మని యర్థము.

యదా చర్మవ దాకాశం వేష్టయిష్యంతి మానవాః
తదా శివ మవిజ్ఞాయ దుఃఖ స్యాంతో భవిష్యతి

శివు నారాధింపక దుఃఖాంతము లేదని శ్వేతాశ్వతరము ప్రతిపాదించుచున్నది.

జుష్ట స్తత స్తే నామృతత్వ మేతి

తతః = ఆకారణమువలన, తేన = పరమేశ్వరునిచేత, జుష్టః = అనుగ్రహింపబడినవాడై, అమృతత్వమ్ = మరణరాహిత్యమును, ఏతి = పొందుచున్నాడను నిశ్చయమునకు వచ్చి

తగ్ం హ దేవ మాత్మబుద్ధిప్రకాశం
ముముక్షు ర్వై శరణ మహం ప్రపద్యే

ఆత్మబుద్ధిప్రకాశకుడగు నాపరమేశ్వరుని శరణుపొందిన నన్ను మా మా బ్రహ్మ నిరాకరోత్ = పరమేశ్వరుడు నిరాకరింపకుండునుగాత మని ప్రార్థించుచున్నాడు.

అనిరాకరణ మ స్త్వనిరాకరణం మేఽస్తు — నేను బ్రహ్మను నిరాకరింపకుందునుగాత! నన్ను బ్రహ్మ నిరాకరింపకుండునుగాత! మని యర్థము.

విషయమునందలి యాదరాతిశయమును సూచించుటకై పూర్వ ప్రతిపాదితార్థము మఱల ననువదింపబడినది. ఇయ్యది యాదరాతిశయ మును సూచించుటయందలి వీప్స.

తదాత్మని నిర తే ... తే మయి సంతు — పరమేశ్వరునియం దాసక్తిగల నాయం దుపనిషత్ప్రతిపాదితములైన ధర్మములు స్థిరత నందుగాత మని యర్థము.

'క్రియావంతః శ్రోత్రియా బ్రహ్మనిష్ఠాః
స్వయం జుహ్వత ఏకర్షిం శ్రద్ధయంతః'
'ఆత్మా వాఽరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః'
'తస్మిన్ య దంత స్త దుపాసితవ్యమ్'

సంధ్యావందనాదివిహితకర్మలును, రుద్రహోమాదులును, శ్రవణ మనననిదిధ్యాసములును, హార్దబ్రహ్మోపాసనమును మొదలైనవి ఉపని షత్ప్రతిపాదితములైన ధర్మములు. సాయుజ్యము నాకాంక్షించిన నాయం దీధర్మములు సుస్థిరములై యుండునుగాత మని ప్రార్థనము. అనగా ధర్మములను యథావిధిగ ననుష్ఠించుచు జీవితపరమప్రయోజన మగు సాయుజ్యము నందుటకు దగిన మహావకాశము గలుగుగాత మని పరమార్థము.

ఓమ్

కేనోపనిషత్తు

ప్రథమఖండము - ప్రథమమంత్రము

కే నేషితం పతతి ప్రేషితం మనః
కేన ప్రాణః ప్రథమః ప్రైతి యుక్తః
కే నేషితాం వాచ మిమాం వదంతి
చక్షుఃశ్రోత్రం క ఉ దేవో యునక్తి

అర్థము :- కేన = ఏదేవునిచేత, ఈరితమ్ = ప్రేరింపబడినదై, మనః = మనస్సు, ప్రేషితమ్ = అభిలషితవిషయమునుగూర్చి, పతతి = ప్రసరించుచున్నదో, కేన = ఏదేవునిచే, యుక్తః = కూడుకొనినదై, ప్రాణః = ప్రాణవాయువు, ప్రథమః = మొదటిదై, ప్రైతి = చలించుచున్నదో, కేన = ఏదేవునిచేత, ఈషితామ్ = ప్రేరింపబడిన, ఇమామ్ = ఈ, వాచమ్ = వాక్కును, వదంతి = పలుకుచున్నారో, క ఉ దేవః = ఏదేవుడు, చక్షుఃశ్రోత్రమ్ = నేత్రశ్రవణేంద్రియములను, యునక్తి = ప్రేరించుచున్నాడో,

ద్వితీయమంత్రము

శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో య
ద్వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః
చ్చక్షుష శ్చక్షు. రతిముచ్య ధీరాః
ప్రేత్యాస్మా ల్లోకా దమృతా భవంతి

అర్థము :- యత్ = ఏతత్త్వము, శ్రోత్రస్య = శ్రవణేంద్రియమునకు, శ్రోత్రమ్ = శ్రోత్రేంద్రియమైయున్నదో, మనసః = మనస్సునకు, మనః = మనస్సై యున్నదో, వాచో హ = వాగింద్రియమునకు, వాచమ్ = వాగింద్రియమై యున్నదో, సః ఉ = ఆతత్త్వము (పరమేశ్వరుడు), ప్రాణస్య = ప్రాణవాయువునకు, ప్రాణః = ప్రాణవాయువుగా నున్నది, చక్షుషః నేత్రేంద్రియమునకు, చక్షుః = నేత్రేంద్రియముగా నున్నది. ధీరాః = ధీరులు, అతిముచ్య = మనఆదులను విడిచి, అస్మాత్ = ఈ, లోకాత్ = లోకమునుండి, ప్రేత్య = ప్రకృష్టదశను పొంది, అమృతాః = మరణరహితులు, భవంతి = అగుచున్నారు.

తాత్పర్యము :- ఏదేవునిచే ప్రేరింపబడినదై మన స్సఖిలషితవిషయ మునుగూర్చి ప్రసరించుచున్నదో, ఏదేవునితో కూడుకొనినదై ప్రాణవాయువు మొదటిదై చలించుచున్నదో, ఏదేవునిచేత ప్రేరింపబడినవాక్కును పలుకుచున్నాడో, ఏదేవుడు నేత్రశ్రోత్రేంద్రియములను ప్రేరించుచున్నాడో,

ఏదేవుడు శ్రోత్రమునకు శ్రోత్రమును, మనస్సుకు మనస్సును, వాక్కునకు వాక్కునై యున్నాడో ఆదేవుడే ప్రాణవాయువునకు ప్రాణవాయువుగాను, నేత్రమునకు నేత్రముగాను నున్నాడు. ధీరు లీలోకమును విడిచి ప్రకృష్టదశను పొంది అమృతు లగుచున్నారు.

ప్రథమమంత్రవివరణము

కేనోపనిషత్తు శిష్యప్రశ్నతో నారంభింపబడినది. జీవితమున మానవుడు స్వతంత్రుడై కర్మలయందు ప్రవర్తించుచున్నాడా? లేక కర్మానుష్ఠానమున నన్యప్రేరణావశ్యకత యున్నదా? అయిన నాయన్యు లెవరు? ప్రయత్నవైఫల్యము జీవులకు స్వాతంత్ర్యము లేదని సూచించుచున్నది. ఏవ్యక్తియును ప్రయత్నవైఫల్యము నాకాంక్షింపడుగదా? అవశముగ, తనయిచ్ఛకు వ్యతిరేకముగగలుగు వైఫల్యమునకు కారకు లెవరు? ఈపరిస్థితి తనకుమాత్రమే గాదు, తనకు పరిచయ మున్నంత వఱకును సర్వత్ర గోచరించుచునేయున్నది. ఈవిశ్వమంతయును నెవని యాజ్ఞకు లోబడి ప్రవర్తించుచున్నది? ఇప్పటివఱకును తనకున్న యనుభవమును పురస్కరించికొని పర్యాలోచించినను నేసమాధానమును గన్పించకపోవుటచే ముముక్షువు గురువును సమీపించి ప్రశ్నించుచున్నాడు :

కే నేషితం పతతి ప్రేషితం మనః — ఏదేవునిచేత ప్రేరింపబడినదై మనస్సు అభిలషితవిషయమునుగూర్చి ప్రసరించుచున్నది? అని వాక్యార్థము.

'అన్నమయం హి సోమ్య! మనః' అనుశ్రుతివలన మనస్సు భౌమమని తేలుచున్నది. జడములకు కర్తృత్వము లేదనుట సర్వసమ్మత

సిద్ధాంతము. కావున మనస్సు ప్రసరించుచున్నదనుట అనుభవమునకు విరుద్ధము. మనస్సు ఇతర ప్రేరణ మున్నగాని ప్రసరించుట కవకాశము లేదు. అయిన నా ప్రేరకు డెవరు ? శరీరాధిష్ఠానమం దుండి సుఖదుఃఖ ముల ననుభవించు జీవుడు తత్ప్రేరకు డగునా ? ఇష్ట మున్నను జీవు డేయవయవమును కదలింపజాలనిస్థితి యనుభవమున నున్నది. కావున జీవుడు మనఃప్రేరకు డనుట యసంగతము.

కేన ప్రాణః ప్రథమః ప్రైతి యుక్తః — ఎవనితో కూడుకొని నదై ప్రాణవాయువు చలించుచున్నదని వాక్యార్థము.

ప్రాణ మనగా ప్రాణవాయువు. ప్రాణవాయువు మహావాయువు యొక్క భాగము. వాయువు జడపదార్థము. తత్త్వములలో జీవేశ్వ రులుదప్ప మిగిలినవన్నియును జడపదార్థములే. పృథివ్యప్తేజోవాయు వులు జడములే. కావున ప్రాణవాయువు చలించుచున్న దనుట యసం గతము. అయిన వాగతిగంధనయోః అను ధాతువువలన నిష్పన్నమైన వాయుశబ్దమునకు వీచుచున్నదని యర్థము. సదా గతి ర్యస్య సదా గతిః = ఎల్లప్పుడును గమనముగలది. ఆశు గచ్ఛతీ త్యాశుగః = శీఘ్రముగా పోవునది. వాయువు జడమన్న వాయుసదాగత్యాశుగాది శబ్దము లనుపపన్నము లగునుగదా యన్న విచారెంతము.

సదాగతి యను శబ్దమున కెల్లప్పుడును గమనము=చలనము గలదియని యర్థము. కాని వాయు వెల్లప్పుడును చలించుచున్నదా ? ఒకప్పుడు స్తబ్ధముగా నున్నది. ఒకప్పుడు మందముగా వీచుచున్నది. ఒకప్పుడు తీవ్రముగా, తీవ్రతరముగా, తీవ్రతమముగా వీచుచున్నది. సదాగతిశబ్దమున కీమూడుస్థితులును సర్థ మనుటకు వీలులేదు. వాయువు చలనవిశిష్ట మనుట యనుభవమునకును విరుద్ధమే. వాయువునకు చల నములేనిస్థితియందు, అమితముగ చెమట పోయుచున్నపుడు విసన కఱ్ఱతో గాలిని కదల్చి యాబాధనుండి తప్పుకొనుచున్నాము. కావున

వాయువునకు చలనగుణము సహజముగా దనియును, నారోపితమని యును తేలుచున్నది.

ఎండకాలమున సూర్యుడు భూమధ్యరేఖకు దగ్గఱగా నున్నపుడు భూమ్యుపరితలము సూర్యకిరణసంపర్కముచే బాగుగా వేడియెక్కి నపుడు తదుపరితలముననున్న వాయువునం దుష్ణమధిక మగుటచే నది పైకి పోవుటయు, నాస్థానమునకు సాంద్రత యెక్కువగానున్న సముద్ర పవనము వీచుటయు ననుభవమున నున్నవిషయమే. ఈయుదాహర ణమువలనను వాయువునకు చలన మారోపిత మనియే తేలుచున్నది.

ప్రాణులు మేలుకొనియున్నపుడువలెనే నిద్రయందును శ్వాస క్రియ జరుగుచునేయున్నది. ఇయ్యది యప్రయత్నముగనే జరుగు చున్నది శ్వాసక్రియయందు ప్రాణులప్రయత్న మేమియును లేదని శారీరశాస్త్రజ్ఞులును వచించుచున్నారు. కావున వాయువునకు చలన గుణము సహజమని తేలుటలేదా యన్న విచారింతము.

యోగశాస్త్రమున ప్రాణాయామమను నొకప్రక్రియ యున్నది. ఇందు వాయువునకు రేచకపూరకకుంభకములను మూడుస్థితు లున్నవి. ఊపిరితిత్తులలోనికి వాయువును నింపుట పూరకము. నింపబడినవాయు వును కొంతకాలము విడువకుండ నుంచుట కుంభకము. తరువాత వాయువును వెలువరించుట రేచకము. ఈమూడింటియందును జీవుని ప్రయత్నము స్పష్టముగనే గోచరించుచున్నది. కావున వాయువునకు చలనగుణ మారోపిత మనియే తేలుచున్నది.

ఇక శ్వాసక్రియవిషయము గాంతము. కండరములలో నిచ్ఛా కండరము లనియును, ననిచ్ఛాకండరము లనియును రెండురకముల కండరము లున్నవి. శ్వాసక్రియ అనిచ్ఛాకండరములకు సంబంధించినది. అనిచ్ఛాకండరములు ప్రాణులప్రయత్నము లేకయే సంకోచించుచు వ్యాకోచించుచుండును. అందువలన శ్వాసక్రియ యాగకుండ జరుగు

చుండును. ఇందువలనను వాయువుయొక్క చలన మారోపితమనియే తేలుచున్నది.

అయిన వాయువు జడ మనుపక్షమున శ్వాసక్రియ యెట్లు జరగుచున్నది? దీనిని జరపువా రెవరు? అనునది మంత్రమునందలి ప్రశ్న కర్థము.

కే నేషితాం వాచ మిమాం వదంతి — ఎవనిచేత ప్రేరింపబడిన వాక్కును పలుకుచున్నా రని వాక్యార్థము.

నాభియొద్దనున్న వాయువునకు సమానవాయు వని పేరు. ఈవాయువు కదలింపబడినదై హృదయముద్వారా కంఠప్రదేశమును చేరి యటనున్న వాగింద్రియమును కదల్చుటచే నావాగింద్రియము తాల్వాదిస్థానములయందు చేరి భిన్నభిన్నములైన వర్ణములను కల్పించుచున్నది. అవియే అకారాదివర్ణములు. భిన్నభిన్న వర్ణములు కలియుటచే పదములును, పదములు కలియుటచే వాక్యములును నేర్పడుచున్నవి.

అయిన నెవరిప్రేరణచే నీవాక్యము లుచ్చరింపబడుచున్నవి?

చక్షుః శ్రోత్రం క ఉ దేవో యునక్తి :— నేత్రశ్రోత్రేంద్రియముల నెవరు ప్రేరించుచున్నా రని వాక్యార్థము.

మనకు గన్పడు కన్ను కన్న, చెవికన్న నేత్రశ్రోత్రేంద్రియములు భిన్నములుగా నున్నవి. నేత్రశ్రోత్రేంద్రియములు దర్శనశ్రవణముల యందుపయోగపడుచున్నవి.

ఆత్మా మనసా, మన ఇంద్రియేణ, ఇంద్రియ మర్థేన, తతః ప్రత్యక్షమ్

జీవుని సంకల్పము గలిగి మనస్సును ప్రేరింప మనస్సు ఇంద్రియములను ప్రేరింప నాయింద్రియములు బహిఃప్రపంచమునకు సంబంధించిన విషయములను గ్రహించును. ఈవిధముగా జీవునకు బహిఃప్రపంచమునకు సంబంధించిన జ్ఞానము కలుగుచున్నది. ప్రతివిషయము

నందును జీవుడు సంకల్పపూర్వకముగ బహిఃప్రపంచమునకు సంబంధిం
చిన జ్ఞానము కలిగించుకొనుచున్నాడు. చక్షుఃశ్రోత్రములవిషయము
నను ఇంతియే.

అయిన చక్షుఃశ్రోత్రము లెవని ప్రేరణచే కార్యోన్ముఖము
లగుచున్నవి ?

ఈ యంత్రమునందు మనః ప్రాణవాక్చక్షుఃశ్రోత్రము లెవని ప్రేర
ణచే స్వకృత్యములు నిర్వహించుచున్న వనునది ప్రధానప్రశ్న.
ప్రశ్నార్థ మేమో గాంతము.

జీవుడు - కర్తృత్వభోక్తృత్వములు

మనఆదులన్నియును శరీరమునకు సంబంధించినవి. శరీరము
జీవున కధిష్ఠానము. శరీరము నధిష్ఠించియే జీవుడు తద్ద్వారా సుఖదుఃఖ
ముల ననుభవించుచున్నాడు. సుఖదుఃఖము లనగా నేమి ? తదను
భవము జీవున కెట్లు గలుగుచున్నది ? ఇంతియే గాదు, ఈయనుభవము
శరీరమునకు సంబంధించినదా ? లేక జీవునకు సంబంధించినదా ?

ఒకసంప్రదాయమువారు సుఖదుఃఖములు శరీరమునకు గాని
యాత్మకు లేవని సిద్ధాంతీకరించుచున్నారు. ఇయ్యది యెంతవఱకు విమర్శ
సహమో, ప్రామాణికమో గాంతము.

మరణమునకు పూర్వముననుు, పరమునను శరీర మున్నది. పూర్వ
మిష్టవస్తుసంబంధమున సంతోషచిహ్నములును, అనిష్టవస్తుసంబంధ
మున దుఃఖచిహ్నములును ప్రస్ఫుటముగా గాన్పించుట యనుభవమున
నున్నదే. కాని మరణానంతర మావిధముగ గాన్పించుటలేదు. మరణా
నంతర మేవిధమగు చలనముగాని గాన్పించుటలేదు. కావున కర్తృత్వ
భోక్తృత్వములు శరీరమునకు సంబంధించినవి గావని తేలుచున్నది.

అయిన కర్తృత్వభోక్తృత్వము లెవరికి సంబంధించినవి? జీవించి యున్నంతవఱకును శరీరము చలనవిశిష్టమును, మరణానంతరము చలన రహితము నగుచున్నది. అయిన జీవించుట యన నేమి? మరణించుట యన నేమి? మరణమునకు పూర్వమున్న శరీరము మరణానంతరము నున్నది. కాని మరణమునకుపూర్వము శరీరము నధిష్ఠించియున్న వస్తు వేదో శరీరమును విడిచిపోవుటచేతనే శరీరము చలనరహిత మగు చున్నది. ఆవస్తు వున్నంతవఱకును శరీరము సర్వకార్యములు నిర్వ హించుచున్నది.

పాశ్చాత్యవైజ్ఞానికులు రక్తమునందలి జీవకణములచేతనే మానవుడు జీవింపగలుగుచున్నాడనియును, అవి జీవరహితములైనప్పుడు మరణించుచున్నాడనియును, మరణ మన నీస్థితియే యనియును ప్రతి పాదించుచున్నారు. కాని కేవలము జీవకణములచేతనే సర్వవిధానుభవ ములును గలుగుటలేదు. నిద్రించుచున్నపుడును, మూర్ఛాదులయం దును జీవకణములు స్వస్థితియందే యున్నను శబ్దాదులయనుభవము గలుగుటలేదు. కావున ననుభవమునకు వేఱేదైన కారణ ముండ వలయునని తేలుచున్నది. మఱియును కణములు జీవించియుండుటకు గావలసిన పరిస్థితి యేమనునది మఱియొకప్రశ్న యున్నది.

శరీరముయొక్క జీవత్‌స్థితి కుష్ణము ప్రధానవిషయము. ఉష్ణము సర్వశరీరమునందును వ్యాపించియున్నగాని శరీరము జీవత్‌స్థితియం దుండదు. అయిన నీయుష్ణమునకు స్థాన మేది? ఎచటనుండి బయలు దేరి యుష్ణము స్వకృత్యము నిర్వహించుచున్నది? మరణమున నుష్ణము హస్తాగ్రములనుండియును, పాదతలములనుండియును క్రమముగ వెను కకు బోవును. ఎంతవఱకు వెనుకకు బోవునో యంతవఱకును నాభాగము చైతన్యరహిత మగును. ఈ విధముగ నన్నిభాగముల నుండియును నుష్ణము వెనుకకు బోవుచు శ్లేష్మ మాస్థానము నాక్రమించుచుండును. చివరకు కంఠము శ్లేష్మపూరిత మగును. కంఠాధఃప్రదేశమును శ్లేష్మ

పూరిత మగుచు చివరకు హృదయప్రదేశమున నుష్ణ ముండు
ఆస్థానముకూడ నుష్ణరహితమైనపుడు ఆస్థితియే మరణ మని వ్యవహ
పబడుచున్నది. కావున జీవత్స్థితి కుష్ణము ప్రధానకారణమని తే
చున్నది. అయిన నుష్ణము స్వయముగనే సర్వశరీరమునందు వ్యాపి
చున్నదా? లేక యన్యప్రేరణ మావశ్యకమా?

ఉష్ణము స్వయముగ వ్యాపించుశక్తిగలది కాదు. దాని క
ప్రేరణ కావలయును. ఉత్పత్తికేంద్రమునం దెప్పటికప్పు డుత్ప
యగుచున్ననే, యావిధముగ నుత్పన్నమైన యుష్ణపువత్తి నివల
యుష్ణము వ్యాపించుచుండును. కేంద్రమున నుత్పత్తి యాగినపు డ
వ్యాపనమును నాగిపోవును. అయిన శరీరమున నుత్పత్తికేంద్ర మే
ఉష్ణము క్రమముగ కొనలనుండి వెనుకకు బోవుచు హృదయప్ర
మున చేరుటచే నదియే యుత్పత్తికేంద్రము కావలయును కేంద్ర
నందును నుష్ణము స్వయముగ నుత్పన్న మగుటలేదు. చేతను డ
డావశ్యకపరికరములను సమకూర్చికొని యుష్ణము నుత్పత్తిచేయు
న్నాడు. అయిన శరీరమున నుష్ణము నుత్పత్తిచేయువారెవరు ?

భుజించినయాహారమునందు పిండిపదార్థము, క్రొవ్వుపదార్థ
గల పదార్థములవలన నెప్పటికప్పు డుష్ణ ముత్పన్న మగుచుండు
ఆవిధముగ నుత్పన్నమగుచున్నంతకాలము శరీరమునం దుష్ణము స
మముగ నుత్పన్నమై స్వకృత్యనిర్వాహణము గావించుచుండును. వి
దుత్పత్తికేంద్రమున నుత్పత్తిచేయువా డున్నట్లు శరీరమున నుత్ప
చేయువా డొక డుండవలయును. అయిన నాత డెవరు? ఆతని కే జీవు
వ్యవహారము.

కావున జీవు డున్నంతవఱకును శరీరము చైతన్యవంతము
ఆతడు వీడినతరువాత తద్రహితమును నగును. కావున జీవుడే స
దుఃఖభోక్త యని తెలుచున్నది. సుఖదుఃఖభోక్తృత్వములో శరీర

సాధనముమాత్రమే. శరీరమున నుష్ణ మధికమైనపుడు శీతోపచారము వలనను, శైత్య మధికమైనపు డుష్ణోపచారమువలనను దానికి సమస్థితి కలిగించుచు సుఖించుచున్నాము. కావున జీవుడే సుఖదుఃఖభోక్తయు, కర్తయు నని తేలుచున్నది.

కాని కొన్నిసమయములం దవశుడై తనపని తాను నిర్వహించి కొనజాలకున్నాడు. తనకు తెలియకుండ జన్మించినాడు. పరులమీద నాధారపడి పెరిగినాడు. తనస్థితి తనకు తెలియునప్పటికి వయస్సులో కొంత గడిచిపోయినది. అవశములైన వ్యాధులు. తనదియని చెప్పు కొనదగిన దేమియును లేదు. తాను నివసించుచున్న పృథివి తనది కాదు. తనశరీరపోషణమున కావశ్యకములైన పదార్థములు తనవి కావు. వాయువు తనది కాదు. సర్వము పరులదైనను తనయిష్టము వచ్చిన ట్లుపయోగించికొనజాలకున్నాడు. తనయిచ్ఛకు వ్యతిరేకముగ నెన్నిపనులు జరుగుటలేదు! ఇట్టియవశతలో తాను స్వతంత్రుడ నను కొనుట కవకాశ మేది? ఇదియే కేనోపనిషత్ప్రథమమంత్రసారాంశము. ఈవిషయమునుగురించియే — ఏ దేవునియొక్క ప్రేరణమువలన మనః ప్రాణవాక్చక్షుఃశ్రోత్రములు స్వకృత్యనిర్వహణము గావించుచున్న వనువిషయమునుగురించియే — శిష్యుడు ప్రశ్నించినాడు.

ద్వితీయమంత్ర వివరణము

శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో య ద్వాచో హ వాచమ్— ఏది శ్రోత్రమునకు శ్రోత్రమో, మనస్సునకు మనస్సో, వాక్కునకు వాక్కో అని వాక్యార్థము.

శ్రోత్ర మనగా శ్రవణము = వినుటకు సాధనమైన యింద్రియము. వాక్కనగా సంకల్పానుగుణముగ భావమును వ్యక్తీకరించుట కనువగు ధ్వనిరూపములగు వర్ణముల నుచ్చరించు నింద్రియము. మనస్సనగా జీవేంద్రియములకు మధ్యవర్తి యగు నింద్రియము — ఇంద్రియ

ములకు గలిగిన యనుభవమును జీవునకు చేర్చుసాధనము. శ్రోత్ర వాఙ్మనస్సు లన్నియును జడములు. జడములకు కర్తృత్వము లేదు. శ్రోత్రమునకు శ్రవణసామర్థ్యమును, మనస్సునకు ప్రతిఫలనసామర్థ్యమును, వాక్కునకు ధ్వన్యుత్పాదకసామర్థ్యమును గలిగించు తత్త్వమేది గలదో,

స ఉ ప్రాణస్య ప్రాణ శ్చక్షుష చక్షుః – ఆతత్త్వమే ప్రాణ వాయువునకు ప్రాణశక్తి నిచ్చినది. అదియే చక్షురింద్రియమునకు దర్శనసామర్థ్యము నిచ్చినది యని వాక్యార్థము,

శిష్యుః ప్రశ్నయందు మనఃప్రాణవాక్చక్షుఃశ్రోత్రములకు స్వకృత్యనిర్వాహణాసామర్థ్యము నిచ్చిన దెవ రనునది ముఖ్యవిషయము. ఇది ప్రథమమంత్రమునందు ప్రతిపాదింపబడినది. రెండవమంత్రమునందు మనఆదుల కాసామర్థ్యము నిచ్చినది ఒకేతత్త్వమని సమాధానింపబడినది. కాని యాతత్త్వ మిది యని నామకరణము చేయబడలేదు. ఆతత్త్వనాము మనంతరగ్రంథమున నిర్ణయింపబడును. కాని యీమంత్రమునం దొకవిశేష మున్నది. ప్రశ్న మనఆదులకు స్వకృత్యనిర్వాహణాసామర్థ్య మిచ్చిన దెవరని? సమాధానమునం దాతత్త్వము మనస్సుకు మనస్సనియు, శ్రోత్రాదులకు శ్రోత్రాదు లనియు ప్రతిపాదింపబడినది.

శ్రోత్రమునకు శ్రోత్ర మనగా నేమి? శ్రోత్రము శ్రవణసాధనము. శ్రవణసాధనమునకు శ్రవణసాధన మనగా నర్థ మేమి? చెవిచేత మనము ధ్వనులు వినగలుగుచున్నాము. చెవియందు చాలపలుచనిపొర యొకటి యున్నది. అదియే ధ్వనిగ్రాహకవస్తువు. దానియందు ధ్వనులు ప్రతిధ్వనించుచుండును. ఆప్రతిధ్వని శబ్దవహనాడీద్వారా జీవునకు చేరి శబ్దజ్ఞానము కలుగుచున్నది. ఏకారణముచేతనైన నాపొర చెడిపోవుట తటస్థించెనేని చెవుడు సంభవించును.

గ్రామఫోను చూడనివా రుండరు. అందు ప్లేట్ల నేర్పాటుచేసి పాటలు వినుచున్నాము. ఆప్లేట్లు రబ్బరులో కొన్నిరసాయనికపదార్థ

ములు గలిపి తయారుచేయబడుచున్నవి. గాయకుని పాటయందలి ధ్వనుల ననుసరించి యాప్లేటునందు హెచ్చుపల్లము లేర్పడును. యంత్రముద్వారా ఆప్లేటును తిరుగునట్లు చేసి దానిమీద నొకసూది నుంతురు. ఆసూది ప్లేటునందలి హెచ్చుపల్లములయందు తిరుగుచు నాయాధ్వనులను గలిగించును. ఆసూది నానుకొని శబ్దగ్రాహకభాగము (Sound box) ఉండును. ఆధ్వనులు శబ్దగ్రాహకభాగమునందు ప్రతిధ్వనించి పాటలు వినబడుచుండును.

శ్రవణనిర్మాణము ననుసరించియే యీనిర్మాణము గావింపబడినది. విజ్ఞానశాస్త్రజ్ఞులచే నీయంత్రము నిర్మింపబడుచున్నది. ఈయంత్రమునం దన్ని భాగములును జడములే. జడములగు నీభాగములకు పాటలను వినిపించుసామర్థ్యము చేతనులచే కల్పింపబడినది. అయిన శ్రవణనిర్మాణము గావించిన దెవరు? జీవు డందమా, ఆతనికి తెలియకముందే యీశరీర మాతనికొఱకై పరునిచే నిర్మింపబడినది. తలిదండ్రు లందమా వారికిని గర్భోత్పత్తివిషయము తెలియదు. కావున నీనిర్మాణము వారిది గాదు. శ్రోత్రమునకు శబ్దగ్రాహకసామర్థ్యము కల్పించినవాడుగాన ఆదేవుడు శ్రోత్రమునకు శ్రోత్రముగా వర్ణింపబడినాడు.

మనసో మనః — మనస్సునకు మన స్సైనవాడని యర్థము.

అన్నమయం హి సోమ్య మనః అనుశ్రుతిచే మనస్సు భౌమము. అట్టిజడమగు మనస్సునకు శబ్దస్పర్శరూపరసగంధములను దహరాంతర్వర్తిజీవునకు చేరవేయుసామర్థ్య మెట్లు గలిగినది? విచిత్రవిశ్వనిర్మాతయగు నాపరమేశ్వరునిశక్తి వర్ణనాతీతము, అనూహ్యము. మనస్సున కట్టిసామర్థ్య మాపరమేశ్వరునిచేత కల్పింపబడినది.

వాచో హ వాచమ్ — వాగింద్రియమునకు వాక్కైనవాడని యర్థము.

ప్రాణస్య ప్రాణః — ప్రాణమునకు ప్రాణమైనవాడని యర్థము.

చక్షుషః చక్షుః — నేత్రేంద్రియమునకు నేత్రమైనవాడని యర్థము.

ఇంద్రియములన్నియును భౌతికములే. ప్రాణవాయువును మహావాయుభాగమే. ఇంద్రియములు జడములు వాని కనగా వాగింద్రియమునకు మాటలాడుటకుగాని. ప్రాణవాయువున కుచ్ఛ్వాసనిశ్శ్వాసరూపమున చలించుటకుగాని, నేత్రమునకు చూచుటకుగాని సామర్థ్యము లేదు. అట్టిసామర్థ్య మావిచిత్రవిశ్వనిర్మాత యొసంగినదే. చక్షుర్విషయము కొద్దిగా విపులీకరించి ప్రకృత మనుసరింతము.

దర్పణము చూడనివా రుండరు. సిలికా యను నొకవిధమగు నిసుకయందు రసాయనికపదార్థములు కలిపి కొంతపరిమాణమువఱకును వేడియందుంచిన నయ్యది కరిగి ద్రవరూపము నందును. ఆద్రవమును మూసలో పోసి అద్దములు తయారుచేయుచున్నారు. దీనిముందున్న వస్తువుయొక్క ప్రతిబింబము నిది గ్రహించును. ప్రతిబింబమును గ్రహించినంతమాత్రమున దీనికి గ్రహణకర్తృత్వము లేదు. కారణము దర్పణనిర్మాణమునందు వినియుక్తములైన ద్రవ్యము లన్నియును జడము లగుటయే. జడపదార్థములందు కర్తృత్వ మనుపపన్న మనునది సర్వసమ్మతమగు సిద్ధాంతము. ఇక చక్షుర్విషయము గాంతము. చక్షురింద్రియము తేజఃపరమాణువు. స్థూలముగా మనకు గన్పడుచున్న కన్ను పృథివీజలభాగములతో నిర్మింపబడినది. తెల్లగ్రుడ్డుమధ్యభాగమున నల్లగ్రుడ్డును, దానిమధ్యభాగమున నింద్రియపరమాణువును నున్నవి. ఇదియే దర్శనోపయోగియగు నింద్రియము. ఎదుటనున్న వస్తువుయొక్క బింబము దీనియందు ప్రతిబింబించి మనోద్వారా జీవునకు చేరి వస్తుజ్ఞానము కలుగుచున్నది. ప్రతిబింబమును గ్రహించుటలో నద్దము చేతనము గానట్లు నేత్రమును చేతనము గాదు. నిర్మాత సిలిక మొదలైనద్రవ్యములకు దర్పణరూప మిచ్చుటవలనను, బింబము దర్పణపురోభాగమునకు వచ్చుటవలనను ప్రతిబింబమున కవకాశ

మేర్పడుచున్నది. అటులే తైజసపరమాణువున కారూప మిచ్చి కన్ను నం దుంచుటవలనను, వస్తువునెదుటకు కన్ను వచ్చుటయో, లేక కంటి యెదుటకు వస్తువు వచ్చుటయో తటస్థించిననే నేత్రేంద్రియము రూపమును గ్రహించుచున్నది. కావుననే చక్షురింద్రియమునకు దర్శన సామర్థ్యము నిచ్చినవాడుగనుకనే యీదేవుడు చక్షువునకు చక్షువుగా ప్రతిపాదింపబడినాడు.

అతిముచ్య ధీరాః ప్రేత్యాస్మా ల్లోకా దమృతా భవంతి - ధీరులగువారీలోకమును విడిచి ప్రకృష్టదశను పొంది అమృతులు = మరణరహితు లగుచున్నారని వాక్యార్థము.

ధీరాః – ధియం ప్రశస్తాం మోక్షవిషయాం బుద్ధిం రాంతి గృహ్ణంతీతి ధీరాః = మోక్షవిషయకమైన ప్రశస్తబుద్ధి గలవారు ధీరులు.

బ్రహ్మవిద్యయం దధికారులు ముముక్షువులు = మరణమునుండి విడివడవలయునను నిచ్ఛగలవారు. ఈమోక్షేచ్ఛయే ప్రశస్తమైన బుద్ధి యని వ్యవహరింపబడుచున్నది. ఇట్టిముముక్షువులు అస్మా ల్లోకా దతి ముచ్య = ఈలోకమును విడిచి, ప్రేత్య = ప్రకృష్టదశను పొంది, అమృతాః = మరణరహితు లగుచున్నారు.

అస్మాత్ లోకా దతిముచ్య = ఈలోకమును విడిచి యని యర్థము.

ఏలోకమును విడిచి ? మనఃప్రాణవాక్చక్షుశ్శ్రోత్రరూపమైన లోకమును విడిచియని సమాధానము. చక్షుఃశ్రోత్రములు జ్ఞానేంద్రియములు. వాక్కు కర్మేంద్రియము. మనస్సు అంతరింద్రియము. ప్రాణవాయువు జీవనాధారమైనది. జీవించుచున్నస్థితిలో జీవునకు బహిః ప్రపంచసంబంధము కలిగించుటలో అంతరింద్రియమగు మనస్సును, బహిరింద్రియములగు చక్షురాదులును సాధనములు. జీవికానిర్వహణ సౌలభ్యమునకై వాక్కు ప్రధానమైనది. ఈమనఆదులసంబంధము వదలినగాని యమృతత్వమున కవకాశములేదు. హార్దబ్రహ్మయం దపున

రావృత్తముగ శుద్ధోదకద్వయసంయోగమువలె సాయుజ్యము నందిన గాని యమృతత్వము లభింపదు. కావున నమృతత్వమున కీలోకసంబంధ మనగా మనఃప్రాణాదిసంబంధము వదలుట పూర్వాంగమని తెలుచున్నది. లోకాత్ అనునది కర్మార్థమునందపాదానపంచమి.

ప్రేత్యపదార్థము

ప్రేత్య = ప్రకృష్టదశను పొందియని ప్రాకరణికార్థము. కాని ప్రేత్యపదమునకు కొందరాచార్యులు మరణించియని యర్థమును ప్రతిపాదించినారు. ఈపదమున కీయర్థము లేకపోలేదు. కాని యీయర్థము ప్రకరణవిరుద్ధము. ప్రేత్య అమృతా భవంతి = మరణించి యమృతు లగుదురని యాసంప్రదాయముప్రకార మర్థము ప్రతిపాదింపవలయును. ప్రేత్య అనుపదమునకు మరణించియని యర్థము చెప్పుటకు సరళమైన యర్థమును వీడి అధ్యాహారపదములను చేర్చి మంత్రార్థమును ప్రతిపాదించినారు. దానిని వివరించుచు కాలమును వ్యర్థము చేయక ప్రకృత మనుసరింతము.

ఆసంప్రదాయముప్రకార మమృతీభవనమునకు మరణము పూర్వభావిగా నంగీకరింపబడినది. కాని యియ్యది ఉపనిషత్సంప్రదాయ విరుద్ధము. మరణానంతరమే యమృతీభవనమున కవకాశము గలుగునా? మరణమునకు పూర్వ మీయవకాశము లేదా? మనఆదిసంబంధము వదలుటవలన నమృతత్వము లభించును. అనగా మరణసంబంధము వదలును.

ప్రాకృతాప్రాకృతమరణములు

మరణ మనగా నేమి? మరణ మనగా ప్రాణత్యాగమని నైఘంటుకార్థము. ప్రాణత్యాగ మనగా ప్రాణవాయుత్యాగము. ప్రాణవాయువు స్థూలశరీరమునకు సంబంధించినది. ఈప్రకరణమున ప్రాణశబ్దముచే స్థూలశరీర ముపలక్షింపబడుచున్నది. కావున ప్రాణ

త్యాగ మనగా స్థూలశరీరత్యాగమని యర్థము. ప్రాణత్యాగ మైన వెంటనే, ప్రాణవాయువు శరీరమునుండి నిష్క్రమించినవెంటనే శరీరము చైతన్యరహిత మగును. జీవుడు శరీరమునుండి యుత్క్రమించినవెంటనే ప్రాణవాయుప్రసరణ మాగిపోవును. వీనిపౌర్వాపర్యము నిర్ణయించుట కష్టము. వాస్తవము వచింపవలయునన్న నీరెండును నొకేపర్యాయము సంభవించును. దీనికే ప్రాకృతమరణ మని వ్యవహారము.

ఇక నప్రాకృతమరణవిషయము గాంతము. ఈమరణమునకే ప్రాయణ మని వేదాంతములయందు వ్యవహారము. ప్రాయణ మనగా నేమియో గాంతము. ప్రాకృతమరణమున స్థూలశరీరత్యాగము మరణ మని వ్యవహరింపబడుచున్నది. కాని సూక్ష్మశరీరముమాత్రము జీవుని వెంటనంటియే యుండును. సూక్ష్మశరీర మున్నంతవరకును జన్మ తప్పదు. అది యున్నంతవఱకును నపునర్భవస్థితి ప్రాప్తింపదు. పునర్భవము వెంట మరణము తప్పదు. వేదాంతములపరమప్రయోజనము మరణరాహిత్యపూర్వకమగు నపునర్భవస్థితి. జీవునిపరమాశయమును నిదియే. కావుననే జీవుడు ముముక్షు వని వ్యవహరింపబడుచున్నాడు. మరణమునుండి విడివడుట యనగా స్థూలశరీరసంబంధత్యాగము. అపునర్భవ మనగా పునర్భవాపాదకమైన సూక్ష్మశరీరత్యాగము. స్థూలసూక్ష్మశరీరత్యాగ మైనగాని సంసరణబంధము — మరణజననములు — వదలవు. స్థూలశరీరత్యాగము నియతవిషయము. ప్రారబ్ధభోగాంతమున దానియంతట నదియే వదలిపోవును.

ఇక సూక్ష్మశరీరత్యాగవిషయము గాంతము. సూక్ష్మశరీ మనగా మనస్సు, త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు, వాక్పాణిపాదపాయూపస్థలును. వీనిద్వారానే జీవునకు బహిఃప్రపంచసంబంధ మేర్పడుచున్నది. ఈసంబంధమే యాతని విషయానుభవమున ముఖ్యసాధనము. శబ్దస్పర్శరూపరసగంధములు విషయములు. ఈవిషయానుభవముకొఱకే

కార్యాకార్యములు గావింపబడుచున్నవి. ఇందు సత్కార్యములకు స్వర్గమును, దుష్కార్యములకు నరకమును ననుభవస్థానములు. అనుభవాంతమున మఱల జన్మ. పునర్జన్మప్రాప్తికి పరంపరలో నాదికారణము సూక్ష్మశరీరము. కావున సూక్ష్మశరీరసంబంధము వదలించికొనిన పునర్జన్మ యుండదు.

అయిన పునర్భవకారణమైన సూక్ష్మశరీరసంబంధము వదలించికొనుట యెట్లు? బహిఃప్రపంచమునకు సన్నిహితములైనవి త్యాగాదులు. జీవునకు సన్నిహితమైనది మనస్సు. కావున మనస్సంబంధము వదల్చికొనిన త్యాగాదిసంబంధము వదలినట్లే. జీవునకు సంకల్పము గలిగినగాని మనస్సంబంధమును, తద్ద్వారా త్యాగాదిసంబంధమును గలుగవు. కావున సంకల్పమునశించిన మనస్సంబంధము వదలును. కావున సంకల్పత్యాగము ప్రధానకర్తవ్యమని తేలుచున్నది.

యదా సర్వే ప్రముచ్యంతే కామా యేఽస్య హృది శ్రితాః
అథ మర్త్యోఽమృతో భవ త్యత్ర బ్రహ్మ సమశ్నుతే

క్రమముగ సంకల్పములన్నియును నశించిన మర్త్యుడు=మరణశీలియగు జీవుడు, అత్ర = ఈజన్మయందే యనగా మరణమునకు పూర్వమే అమృతః = మరణములేనివా డగుచున్నాడు. బ్రహ్మను పొందుచున్నాడు. దీనికే ప్రాయణము = ప్రకృష్టదశాప్రాప్తి యని వేదాంతములందు వ్యవహారము. కావున నీచర్చవలన మరణ మనగా ప్రారబ్ధభోగావసానమున స్థూలశరీరత్యాగ మనియును, ప్రాయణ మనగా మరణమునకుపూర్వమే సూక్ష్మశరీరసంబంధమును వదల్చికొనుట యనియును తేలుచున్నది. కావున మంత్రములందలి ప్రేత్య అనుపదమునకు ప్రకృష్టదశను పొందియని యర్థమని తేలుచున్నది. మనఆదిసంబంధత్యాగమే ప్రకృష్టదశాప్రాప్తి.

తృతీయమంత్రము

న తత్ర చక్షు ర్గచ్ఛతి న వా గ్గచ్ఛతి నో మనో
న విద్మో న విజానీమో య థైత దనుశిష్యాత్
అన్య దేవ త ద్విదితా దథో అవిదితా దధి
ఇతి శుశ్రుమ పూర్వేషాం యే న స్త ద్వ్యాచచక్షిరే

అర్థము :- తత్ర = ఆబ్రహ్మతత్త్వము నందు, చక్షుః = నేత్రము, న గచ్ఛతి = ప్రసరించదు. వాక్ = వాక్కు, న గచ్ఛతి = ప్రసరించదు. మనః = మనస్సు, న గచ్ఛతి = ప్రసరించదు. తత్ = ఆబ్రహ్మతత్త్వమును, న విద్మః = తెలిసికొనలేము. యథా = ఏప్రకారముగా, ఏతత్ = దీనిని, అనుశిష్యాత్ = గురువు బోధించునో, తథా = ఆప్రకారముగా, నవిజానీమః = విశేషముగా తెలిసికొనలేము. తత్ = అది, విదితాత్ = తెలిసికొనబడినదానికంటె, అన్య దేవ = ఇతరముగానే యున్నది. అథో = పిమ్మట, అవిదితాత్ = తెలియబడనిదానికంటెను, అధి = అధికముగా నున్నది. యే = పూర్వులు, నః = మాకు, తత్ = ఆతత్త్వమునుగూర్చి, వ్యాచచక్షిరే = వివరించి చెప్పిరో, పూర్వేషామ్ = అట్టిపూర్వులయొక్క, ఇతి = అనువచనమును, శుశ్రుమ = వినుచున్నాము.

తాత్పర్యము :- అబ్రహ్మతత్త్వమును నేత్రము చూడలేదు. వాక్కు వర్ణించలేదు. మనస్సు మననము చేయలేదు. అతత్త్వము నేవిధముగను తెలిసికొనలేము. గురువు వివరించినను తెలిసికొనుట దుష్కరము. ఈవిషయము పూర్వులవలన తెలియుచున్నది.

వివరణము

ప్రథమమంత్రమునందు ధీప్రేరకు డెవ రనువిషయమున శిష్య ప్రశ్న ప్రతిపాదింపబడినది. ద్వితీయమంత్రమునందు పరమేశ్వరుడే సర్వేంద్రియ ప్రేరకు డనియును, ఇంద్రియసంబంధము వదలుకొని ధీరులగు ముముక్షువులు ప్రకృష్టదశను పొంది మరణరహితు లగుచున్నా రనియును ప్రతిపాదింపబడినది. ఈమంత్రమునందు పరమేశ్వరుడు సర్వేంద్రియనిష్పద్యమానజ్ఞానబహిర్భూతు డనువిషయము ప్రతిపాదింపబడుచున్నది.

న తత్ర...నో మనః —చక్షుర్వాఙ్మనస్సులకు బ్రహ్మవిషయపరిజ్ఞానమున సామర్థ్యము లేదని వాక్యార్థము.

చక్షుస్సు త్వక్శ్రోత్రజిహ్వాఘ్రాణములకును, వాక్కు పాణిపాదపాయూపస్థలకును నుపలక్షకము. ఇవియన్నియును బహిఃకరణములు. మనస్సంతఃకరణము. ఇవియన్నియును భౌతికములు, జడములు. వీనికి జ్ఞాతృత్వరూపకర్తృత్వము లేదనునది సర్వసమ్మతమగు సిద్ధాంతము. జడములవిషయమున నారోపితకర్తృత్వమేగాని స్వాభావికకర్తృత్వము లేదు. చేతనప్రేరితములైన కందుకాదులయం దారోపితకర్తృత్వ మనుభవసిద్ధము. అయినను బంతి కదలుచున్న దనుచున్నాము. అట్లే అన్యప్రేరితములైన చక్షురాదులయందును దర్శనాదు లుపపన్నములగుచున్నవి. అయినను నవ్వాని తమప్రసరణపరిధియం దున్నవానిని మాత్రమే తెలిసికొనగలవు. తద్బహిర్భూతములగువానిజ్ఞానము వానికి గలుగదు. ఉదాహరణమునకు చక్షుర్విషయము గాంతము. నేత్రము తనప్రసరణపరిధిలో (Perview) నున్నదానినిమాత్రమే చూడగలదు. తద్బహిర్భూతములగువానిని దూరదర్శినిసాయముతో చూడవచ్చును. ఆపరిధియును దూరదర్శినిశక్తి ననుసరించియుండును. అంతకు పైగా నున్నవస్తువులను చూచుట కవకాశము లేనేలేదు. అట్లే సూక్ష్మవస్తువులవిషయమున సూక్ష్మదర్శిని యావశ్యకత యున్నది.

ఇక వాగ్విషయము గాంతము. కలిగినయనుభవములను వివరించుటలోనే వాక్కుయొక్క ప్రయోజనము. భావప్రకటనమునందే గాక యధ్యయనమునందును వాక్కుయొక్క సాయ మవసరము. బాల్యమున తలిదండ్రులనుండి తొక్కుపలుకులు నేర్చుకొనుటనుండి గురుకులమున సాంగవేదాధ్యయనమువఱకును దీనిసాయ మవసరము. ఇంకొకవిశేషము. వాక్కనగా వర్ణధ్వనిరూపమైనదని యీప్రకరణమున నర్థము. కాని కేవలధ్వని యర్థము కాదు. కారణము మూగవారధ్యయనము గావింపలేకపోవుటయే. మూగవారిలో కొందఱు

వ్రాయుట చేతనైనవా రున్నారు. వారు తమ భావములను వ్రాత మూలమున ప్రకటించుచున్నారు. కాని యుదాత్తాదిస్వరోచ్చారణ వాగింద్రియ మున్నంతమాత్రమున సాధ్యపడదు. వాక్కునకును అన నుభూతవిషయములను, అజ్ఞాతవిషయములను వర్ణించుసామర్థ్యము లేదు.

ఇంతియే గాదు. ఈవర్ణనమును వాస్తవమును వచింపవలయు నన్న వాగింద్రియమునకు సంబంధించినది గాదు. వాగింద్రియము గ్రామోఫోనువంటిది. గ్రామోఫోను మనముపెట్టిన రికార్డులలోని పాటనుమాత్రము వినిపించగలదు. అట్లే వాక్కును సంకల్పానుగుణ ముగ ప్రేరింపబడి తదనుకూలములైన ధ్వనులనుమాత్రమే వివరించును. కావున బ్రహ్మాత్మత్వవర్ణనమున వాగింద్రియమునకు సామర్థ్యము లేద నుట యుపపన్నమే యగుచున్నది. కారణ మాత్మత్వ మనుభూతమును, జ్ఞాతమును గాకపోవుటయే.

ఇకమనోవిషయము గాంతము. మనస్సు భౌమ మనియును, నంత రింద్రియ మనియును వివరించినాము. భౌమముగాన జడమని యంగీక రింపకతప్పదు. అయిన మనఅవబోధనే యను ధాతువునుండిసిద్ధమైన మనశ్శబ్దమునకు వైయర్థ్య మాపాదింపబా యన్న గాంతము. మన్యతే అనే నేతి మనః అని మనశ్శబ్దవ్యుత్పత్తి. అనేన అనునది కరణతృతీయ. మనఇంద్రియము మననములో సాధనముమాత్రమే. కర్త చేతనుడును, కరణము జడమును ననువిషయ మనుభవసిద్ధము. అటుల గాక, మనస్సు జడము గాక చేతనమేయై స్వాభావికకర్తృత్వవిశిష్టమేయైన మంతృశబ్ద వ్యవహారమును నుండవలయును. భాషయందంతటకరణమునకు మంతృ శబ్దవ్యవహారము లేదు. కావున మనశ్చేతశ్చిత్తాదిశబ్దములు లాక్షణికము లని చెప్పకతప్పదు.

ఈవిమర్శచే చక్షుర్వాఙ్మనస్సులకు బ్రహ్మాత్మత్వదర్శనవర్ణ

మననములయందు సామర్థ్యము లేదని తెలుచున్నది. ఈవిషయ మీ క్రింది మంత్రముచే ప్రతిపాదింపబడినది.

యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ
ఆనందం బ్రహ్మణో విద్వా న్న బిభేతి కుతశ్చ నేతి

న విద్మః — ఆతత్త్వమును తెలిసికొనలేమని వాక్యార్థము.

జ్ఞానసాధనములు జ్ఞానేంద్రియములు. ఇవియన్నియును జడములు. ఇయ్యవి యన్యప్రేరణమువలననే స్వకృత్యనిర్వహణసమర్థము లగుచున్నవని వివరించినాము. ఐనను నియ్యవి భౌతికములగు శబ్దస్పర్శరూపరసగంధాదిజ్ఞానములందుమాత్రమే యుపయోగపడుచున్నవి. మనస్సును త్వగాదులను స్పర్శాదిజ్ఞానవిషయమున నున్ముఖములనుగా జేయుటలోమాత్రమే వినియోగించుచున్నది. అంతకన్న దానివలన వేరుప్రయోజనము లేదు. కావున నిప్పటివఱకును భౌతికానుభవసాధనములగు జ్ఞానేంద్రియములద్వారా అప్రత్యక్షమగు వస్తుజ్ఞానము కలుగుట కవకాశము లేదని తెలియుచున్నది.

న విజానీమో య థైత దనుశిష్యాత్ — గురువు బోధించినను నధికముగా తెలిసికొనుటకు వీలు లేదని వాక్యార్థము.

తెలియనివిషయముల నాచార్యులయొద్దనుండి తెలిసికొనుచున్నాము. వారైనను తమ కనుభూతములును, జ్ఞాతములునగు విషయములనుమాత్రమే బోధించగలుగుచున్నారు. కాని యనుభవమునకు మించినవిషయములను వారును బోధింపలేరు. కారణము వారి వాక్కును నాతత్త్వవర్ణనవిషయమున నిరుపయోగ మగుటయే. అయిన నధ్యయనశ్రవణములవలన ప్రయోజన మేమన్న విచారింతము.

అధ్యయన శ్రవణ ప్రయోజనము

రస మనగా రుచి యని యర్థము. ఇయ్యది పృథివీభూతమునకు సంబంధించినది. కాని యిది జలమునకు సంబంధించినదని శాస్త్రము

ప్రతిపాదించుచున్నది. దీని కొక కారణ మున్నది. చవిటిపఱ్ఱలయందు ప్రవహించిన జల ముప్పగా నుండును. రేగడినేలయందు ప్రవహించిన జలము తియ్యగా నుండును. కారణము చవిటిపఱ్ఱలయందు లవణాణువు లున్నవిగాన నాజల ముప్పగా నుండును. అట్లే నేలవేమునకు సంబంధించిన యణువులు చేరిన జలము చేదుగా నుండును. కావున రసము పృథవీభూతమునకు సంబంధించిన దని తెలుచున్నది.

అయిన శాస్త్రీయప్రతిపాదనవిషయ మేమి? అన్న విచారింతము. రుచిని గ్రహించునది రసన = నాలుక. జిహ్వేంద్రియాణువు నాలుకయం దున్నది. తడిగానున్నంతవరకే నాలుక రుచిని గ్రహించగలుగుచున్నది. తడి యారినచో నాలుకకు రుచిని గ్రహించుశక్తి తొలగిపోవును. శక్తిమాత్రము తొలగునుగాని యింద్రియముమాత్ర మట్లే యుండును. మఱల నాలుకయందు తడి చేరిన రసగ్రహణశక్తి గలుగును. కావుననే రుచిగ్రహణమున ఆర్ద్రత — జలావశ్యకత యుండుటచేతనే యాపచారికముగా రసము జలమునకు సంబంధించినదని ప్రతిపాదింపబడినది.

ఒక్క రసవిషయమే గాదు. శబ్దవిషయమును నింతియే. శబ్దమాకాశమునకు సంబంధించినదని శాస్త్రసంప్రదాయము. కాని శబ్దము రెండువిధములుగా నుత్పన్న మగుచున్నది. దూరస్థవస్తువులయొక్క సంయోగమువలనను, ఒకవస్తువు రెండుగా చీలుటవలనను శబ్ద మేర్పడుచున్నది. ఉదా. రాళ్లు తగులుకొనుటవలన ధ్వని కలుగుచున్నది. వెదురు చీల్చుటవలన ధ్వని కలుగుచున్నది. మొదటిది సంయోగజ మనియును, రెండవది విభాగజ మనియును వ్యవహారము. కాని సంయోగవియోగముల కాకాశ మవసరము. ఆకాశము లేనిచో సంయోగవియోగములు సంభవింపవు. కావుననే శబ్ద మాకాశగుణమని యాపచారికముగా వ్యవహరింపబడుచున్నది.

రసవిషయము బోధింపవలయు నన్న కేవలము వాక్కుతో బోధింపలేము. అయ్యది యనుభవపూర్వకముగా బోధింపవలసిన దే. బెల్లము తియ్యగా నుండునని చెప్పినంతమాత్రమునను, బెల్లము చూపించినంతమాత్రమునను తీపి యన నేమో తెలియదు. బెల్లము నాలుకయం దుంచి రసానుభవము గలిగినంతనే యారుచికి తీపి యని పేరని చెప్పిన తెలియును.

భౌతికములగు వస్తువులవిషయము నీవిధముగ బోధించవచ్చును. కాని యభౌతికమగు బ్రహ్మతత్త్వవిషయము బోధించుట యెట్లు? ఇంద్రియములు భౌతికపదార్థములవిషయముననే సమర్థములుగాని బ్రహ్మతత్త్వవిషయమున నసమర్థము లనుట నిర్వివాదము. ఈవిషయము ఛాందోగ్యమున చక్కగా ప్రతిపాదింపబడినది. శ్వేతకేతువు తండ్రియగు నుద్దాలకుని బ్రహ్మతత్త్వవిషయమును బోధింపుమని యడిగినపుడయ్యది సర్వేంద్రియాతీతమని ప్రతిపాదించుసందర్భమున సోదాహరణముగా ప్రతిపాదించినాడు.

లవణ మేత దుదకేఽవధా యాథ మా ప్రాత రుపసీదథా ఇతి స హ
తథా చకార తగ్ం హోవాచ యద్దోషా లవణ ముదకేఽవాధా అంగ
తదాహరేతి తద్ధావమృశ్య న వివేద యథా విలీన మేవాంగాస్యాంతా
దాచామేతి కథ మితి లవణ మితి మధ్యా దాచా మేతి కథ మితి
లవణ మిత్యంతా దాచా మేతి కథ మితి లవణ మిత్యభిప్రాస్యైత
దథ మోపసీదథా ఇతి తద్ధ తథా చకార తచ్ఛశ్వ త్సంవర్తతే
తగ్ం హోవాచాత్ర వావ కిల సత్సోమ్య న నిభాలయసేఽత్రైవ
కిలేతి స య ఏషోఽణి మైతదాత్మ్య మిదగ్ంసర్వం తత్సత్యం స
ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో!

ఉద్దాలకుడు పుత్రుడగు శ్వేతకేతునకు బ్రహ్మతత్త్వవిషయము ఋజువుచేయగోరి యప్పటివఱకు కొడుకున్న యనుభవమును పురస్కరించికొని లవణము నుదకమునం దుంచి యుదయమున రమ్మనెను.

మరునాడు వచ్చిన కొడుకును గాంచి నీవు నిన్న రాత్రి యుదకమున నుంచిన యుప్పుగల్లును వెలుపలికి తీయు మనెను. కొడుకు నీటియందు వెదకెను. కాని యుప్పుగల్లు చేతికి తగులలేదు. అంత తండ్రి యానీటి నీచివర, మధ్య, ఆచివర నాచమించు మనెను. ఆచమించి పిమ్మట నీ రెట్లున్నదని యడిగెను. ఉప్పగా నున్నదని సమాధానమిచ్చెను. కంటికి కనపడని, చేతికి తగులని యుప్పు నీటియందే యున్నది. అట్లే జగత్తు నందు సర్వత్ర సర్వదా అంతర్యామిగానున్న బ్రహ్మతత్త్వమును గాంచుటలో నీయైదింద్రియములును సమర్థములు గావు. అయ్యది యతి సూక్ష్మముగా జగత్తునందును, నీయందును నంతర్యామిగా నున్నదని చెప్పెను. కావున నీయుదాహరణముచే బ్రహ్మతత్త్వము సర్వజగదంతర్యామి యనియును, దాని నీభౌతికేంద్రియములతో సాక్షాత్కరింప జేసికొనుటకు వీలు లేదనియును తెలుచున్నది. ఇదియే యధ్యయన శ్రవణ ప్రయోజనము.

అన్యదేవ తద్విదితాత్ – ఆబ్రహ్మతత్త్వము తెలిసికొనబడినదానికంటె నన్య మని యర్థము.

విదితాత్ = తెలియబడినదని యర్థము. విదిత మనగా పంచేంద్రియములద్వారా ననుభూతమని యర్థము. శబ్దస్పర్శరూపరసగంధములు విషయములు. ఇంద్రియములద్వారా వీనియనుభవము గలుగుచున్నది. ఈయనుభవమును చాలపరిమితము. అందును కలిగినయావదనుభవము స్మృతిపథమున నుండదు. బ్రహ్మతత్త్వము యావదనుభవదృష్ట్యాగూడ తద్బహిర్భూతమే. ప్రతివస్తువునందును నిగూఢముగా నున్న యగ్నిని ప్రయత్నపూర్వకముగ వెలువరించవచ్చును. కాని జగత్తునందు నిగూఢముగా ప్రత్యణువునందును నంతర్యామిగానున్న యీశ్వరతత్త్వము నేయుపాయముననను కనుగొనుటకు వీలు లేదు. ఉదకమునందున్న లవణమును, దారువులందున్న యగ్నిని ఉపాయాంతరములచే కనుగొనుటకు వీలున్నట్లు అంతర్యామిని జగత్తునుండి భిన్నముగా తెలిసికొనుటకు వీలు లేదు.

భూతములు పరస్పరభిన్నములు, అసంకీర్ణములు. కావున విడదీయుట కవకాశ మున్నది. అటులే కలుపుటకును నవకాశ మున్నది. లవణము నుదకమున గలుపవచ్చును. మఱల నాయుదకమును కాచి యుప్పును విడదీయవచ్చును. అయఃపిండమునం దగ్నిని ప్రవేశపెట్టవచ్చును. మఱల నాపిండమును చల్లబర్చి యగ్నిని తొలగింపవచ్చును. కాని జగత్తునుండి పరమేశ్వరునిగాని, పరమేశ్వరునినుండి జగత్తునుగాని విడదీయుట కవకాశము లేదు. కారణము పరమేశ్వరతత్త్వము భౌతికము గాకపోవుటయే. ఈచర్చవలన పరమేశ్వరతత్త్వమును తెలిసికొనుట కీయైదింద్రియములును నిరుపయోగము లేయని తెలియుచున్నది. కావున పరమేశ్వరతత్త్వము విదితముఃకంటె = జ్ఞాతముఃకంటె, అనుభూతముఃకంటె అన్యత్ = ఇతరముగా నున్నదని తేలుచున్నది.

అవిదితా దధి — తెలియబడనిదానికంటె నధికముగా నున్నదని యర్థము.

జగత్తునందు మన కనుభవములో నున్నది చాలస్వల్పము. ఏవ్యక్తికిని యావజ్జగదనుభవము లేదు. అనుభూతమగు నీస్వల్పజగద్భాగము నాధారముగా చేసికొని మిగిలినజగద్భావన చేయగలిగినాడు. కాని తదనుభవము లేదు. భావించినదాని పరిమాణము నిదమిత్థ మనుటకు శక్తి చాలదు. ఇట్టియీజగ త్తేకపాదము=పరమేశ్వరునిలో నొకవంతు. ఈయేకపాదమును త్రిపాత్తగు పరమేశ్వరునియందు మాతృగర్భమున శిశువువలె నిమిడియున్నది. శిశువునకు గర్భపరిమాణముగాని, గర్భవతిపరిమాణముగాని తెలియనట్లు విశ్వాంతఃపాతియగు జీవునకు విశ్వాతీతునివిషయము తెలియదు. అనుభూతమగు స్వల్పజగద్భాగముఃకంటెను నధికముగా నున్న జగద్భాగముయొక్క జ్ఞానము లేని జీవునకు దానినిగూడ తనకుక్షియం దిముడ్చుకొనిన యామనంతునికి సంబంధించిన జ్ఞాన ముండకపోవుటలో నాశ్చర్య మేమియును లేదు. అవిదితాత్ అనగా ననుభూతజగద్భాగముకన్న నధికముగానున్న

జగత్తు అవిదితము. దానికన్నను పరమేశ్వరు డధికముగా నున్నాడని సారాంశము.

ఇతి శుశ్రుమ పూర్వేషాం యే న స్త ద్వ్యాచచక్షిరే — ఇత్యాది పూర్వాచార్యులయొద్ది కేగి శ్రవణము గావించుటవలన తేలిన సారాంశమని యర్థము.

అనగా గురుపరంపరలో గావించిన శ్రవణమువలన తేలిన సారాంశమని తాత్పర్యము. అయిన నాదిగురు వెవరు? పరమేశ్వరుడే యాదిగురు వనువిషయము

యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యో వై వేదాం శ్చ ప్రహిణోతి తస్మై
తగ్ం హ దేవ మాత్మబుద్ధిప్రకాశం
ముముక్షు ర్వై శరణ మహం ప్రపద్యే

అను శ్వేతాశ్వరమంత్రముచే ప్రతిపాదింపబడినది. మఱియును నీవిషయము పాతంజలసూత్రములలో

క్లేశకర్మవిపాకాశయై రపరామృష్టః పురుషవిశేష ఈశ్వరః
తస్య వాచకః ప్రణవః, తజ్జప స్తదర్థానుసంధానమ్
స పూర్వేషా మపి గురుః కాలే నానవచ్ఛేదాత్

అనుసూత్రములచే ప్రతిపాదింపబడినది.

చతుర్థమంత్రము

య ద్వాచాఽనభ్యుదితం యేన వా గభ్యుద్యతే
త దేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం య దిద ముపాసతే

అర్థము :— యత్ = ఏయాత్మతత్త్వము, వాచా = వాక్కుచేత, అనభ్యుదితమ్ = వర్ణింపబడనిదో, యేన = ఏపరమేశ్వరునిచే ప్రేరింపబడిన, వాక్ = వాక్కు, అభ్యుద్యతే = ఉచ్చరింపబడుచున్నదో, త్వమ్ = నీవు, తదేవ = ఆతత్త్వ

మునే, బ్రహ్మ = బ్రహ్మనుగా, విద్ధి = తెలిసికొనుము. యదిదమ్ = ఏయీప్రతీక మును, ఉపాసతే = ఉపాసించుచున్నారో, ఇదమ్ = ఈప్రతీకము, న = బ్రహ్మ తత్త్వము కాదు.

తాత్పర్యము:— ఏతత్త్వము వాక్కుచేత వర్ణించుటకు వీలుపడదో, ఏపరమే శ్వరునిప్రేరణచే వాక్కు ఉచ్చారణసామర్థ్యముగల దగుచున్నదో అతత్త్వమునే బ్రహ్మతత్త్వమునుగా తెలిసికొనుము. భక్తు లుపాసించు ప్రతీకము పరమేశ్వర తత్త్వము గాదు.

పంచమమంత్రము

య న్మనసా న మనుతే యే నాహు ర్మనో మతమ్
త దేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం య దిద ముపాసతే

అర్థము:— యత్ = దేనిని (ఏతత్త్వమును), మనసా = మనస్సుచేత, న మనుతే = మననముచేయలేడో, యేన = దేనిచేత, మనః = మనస్సును, మతమ్ = మననసామర్థ్య ముగలదానినిగా, ఆహుః = చెప్పుచున్నారో, త్వమ్ = నీవు, తదేవ = అతత్త్వమునే, బ్రహ్మ = బ్రహ్మనుగా, విద్ధి = తెలిసికొనుము. యదిదమ్ = ఏయీప్రతీకమును, ఉపాసతే = ఉపాసించుచున్నారో, ఇదమ్ = ఈప్రతీకము, న = బ్రహ్మతత్త్వము గాదు.

తాత్పర్యము :— ఏతత్త్వమును మననముచేయుటకు వీలులేదో, ఏతత్త్వము మనస్సునకు మననసామర్థ్యము గలిగించుచున్నదో, అతత్త్వమునే బ్రహ్మతత్త్వ మునుగా తెలిసికొనుము. భక్తు లుపాసించు ప్రతీకము బ్రహ్మతత్త్వము గాదు.

షష్ఠమంత్రము

య చ్చక్షుషా న పశ్యతి యేన చక్షూగ్ంషి పశ్యతి
త దేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం య దిద ముపాసతే

అర్థము :— యత్ = దేనిని, ఏతత్త్వమును, చక్షుషా = కంటిచేత, న పశ్యతి = చూడలేడో, యేన = ఏతత్త్వముచేత ప్రేరింపబడి, చక్షూంషి = నేత్రములను, పశ్యతి = చూచుచున్నాడో, త్వమ్ = నీవు, తదేవ = అతత్త్వమునే, బ్రహ్మ = బ్రహ్మతత్త్వమునుగా, విద్ధి = తెలిసికొనుము. యదిదమ్ = ఏయీప్రతీకమును, ఉపాసతే = ఉపాసించుచున్నారో, ఇదమ్ = ఈప్రతీకము, న = బ్రహ్మతత్త్వము కాదు.

తాత్పర్యము:- ఏతత్త్వమును కంటితో చూచుటకు వీలు లేదో, ఏతత్త్వముచే ప్రేరింపబడి కన్నులను చూడగలుగుచున్నాడో ఆతత్త్వమును బ్రహ్మతత్త్వమును గా తెలిసికొనుము. భక్తు లుపాసించు ప్రతీకము బ్రహ్మతత్త్వము కాదు.

సప్తమమంత్రము

య చ్ఛ్రోత్రేణ న శృణోతి యేన శ్రోత్ర మిదం శ్రుతమ్
త దేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం య దిద ముపాసతే

అర్థము :- యత్ = ఏతత్త్వమును, శ్రోత్రేణ = చెవిచేత, న శృణోతి = వినలేడో, యేన = దేని ప్రేరణచేత, ఇదం శ్రోత్రమ్ = ఈ చెవి, శ్రుతమ్ = వినుటకు సామర్థ్యముగల దగుచున్నదో, తదేవ = ఆతత్త్వమునే, త్వమ్ = నీవు, బ్రహ్మ = బ్రహ్మతత్త్వమునుగా, విద్ధి = తెలిసికొనుము. య దిదమ్ = ఏయీ ప్రతీకమును, ఉపాసతే = భక్తు లుపాసించుచున్నారో, ఇదమ్ = ఈప్రతీకము, న = బ్రహ్మ తత్త్వము కాదు.

తాత్పర్యము :- ఏతత్త్వము చెవిచేత వినుటకు వీలు లేదో, ఏతత్త్వప్రేరణ చేత చెవి వినగలుగుచున్నదో ఆతత్త్వమును బ్రహ్మతత్త్వమునుగా తెలిసి కొనుము. భక్తు లుపాసించు ప్రతీకము బ్రహ్మతత్త్వము గాదు.

అష్టమమంత్రము

య త్ప్రాణేన న ప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే
త దేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం య దిద ముపాసతే

అర్థము:- యత్ = ఏతత్త్వము, ప్రాణేన = ప్రాణవాయువుచేత, న ప్రాణితి = జీవించుటలేదో, యేన = ఏతత్త్వముచేత, ప్రాణః = ప్రాణవాయువు, ప్రణీయతే = నడుపబడుచున్నదో, త్వమ్ = నీవు, తదేవ = ఆతత్త్వమునే, బ్రహ్మ = బ్రహ్మతత్త్వ మునుగా, విద్ధి = తెలిసికొనుము. య దిదమ్ = ఏయీప్రతీకమును, ఉపాసతే = భక్తు లుపాసించుచున్నారో, ఇదమ్ = ఈప్రతీకము, న = బ్రహ్మతత్త్వము కాదు.

తాత్పర్యము:- ఏతత్త్వము ప్రాణవాయువుచేత జీవించుటలేదో, ఏతత్త్వము చేత ప్రాణవాయువు నడుపబడుచున్నదో, దానిని బ్రహ్మతత్త్వమునుగా తెలిసి కొనుము. భక్తు లుపాసించు ప్రతీకము బ్రహ్మతత్త్వము గాదు.

వివరణము

ప్రథమమంత్రమునం దేదేవుని ప్రేరణచే మనఃప్రాణవాక్చక్షుః శ్రోత్రములు స్వకృత్యనిర్వహణసమర్థము లగుచున్న వను శిష్యప్రశ్న

ప్రతిపాదింపబడినది. రెండవమంత్రమునందు సర్వేంద్రియప్రేరకుడు పరమేశ్వరుడే యనియును, నీయింద్రియసంబంధమును వదలి యుపాసకులు ప్రకృష్టదశను పొంది మరణరహితు లగుచున్నారనియును ప్రతిపాదింపబడినది. మూడవమంత్రమునం దీశ్వరతత్త్వజ్ఞానమున మనఆదులకు సామర్థ్యము లేదనియును, ఆయీశ్వరతత్త్వ మనుభూతజగత్తుకంటెను, అననుభూతజగత్తుకంటెను భిన్నముగా నున్నదనియును ప్రతిపాదింపబడినది. ఈవిషయమే నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది మంత్రములందు వివరింపబడుచున్నది.

నాలుగునుండి యెనిమిదివఱకును నైదుమంత్రములందును వాఙ్మనశ్చక్షుశ్శ్రోత్రములకు పరమేశ్వరతత్త్వజ్ఞానమున సామర్థ్యము లేదనియును, వాగాదులు పరమేశ్వరప్రేరణచేతనే స్వకృత్యనిర్వహణసమర్థము లగుచున్నవనియును ప్రతిపాదింపబడినది.

ఈయైదుమంత్రములందును 'త దేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం య దిద ముపాసతే' అనునది మకుటవాక్యముగా నున్నది. ఈ వాక్యమునందలి త దేవ బ్రహ్మ త్వం విద్ధి = నీ వాతత్త్వమునే బ్రహ్మతత్త్వమునుగా తెలిసికొనుము అనునది రెండవమంత్రమునందలి 'స ఉ' అను దానిచే ప్రతిపాదింపబడినవిషయమున కనువాదము.

ప్రతీకము

ఈమకుటవాక్యమునం దొకక్రొత్తవిషయము ప్రతిపాదింపబడుచున్నది. నేదం య దిద ముపాసతే = భక్తు లుపాసించునది బ్రహ్మతత్త్వము కాదని యీవాక్యమున కర్థము. ఈఘట్టమున భక్తు లుపాసించున దేది? అది బ్రహ్మతత్త్వము కాకపోవుటలో హేతు వేమి? అయిన వా రుపాసించవలసినది దేనిని? అను ప్రశ్న లుపస్థితము లగుచున్నవి.

1. ముముక్షు వుపాసించున దేది?

ప్రథమమున ముముక్షువు లనగా నెవరో, వారు దేని నుపాసించుచున్నారో, ఉపాసనాప్రయోజన మేమో వివరించినగాని యీ ప్రశ్నకు సమాధానము చక్కగా నవగతము కాదు.

మోక్తు మిచ్ఛవః ముముక్షవః = విడివడుటకు గోరినవారు ముముక్షువులు. దేనినుండి విడివడుటకు ? 'మృత్యో ర్ముక్షీయ' అను త్రియంబకమంత్రభాగము ముముక్షువు లనగా మృత్యువునుండి విడివడ గోరినవా రని ప్రతిపాదించుచున్నది.

స విశ్వకృ ద్విశ్వవి దాత్మయోని
ర్జ్ఞః కాలకారో గుణీ సర్వవిద్యః
ప్రధానక్షేత్రజ్ఞపతి ర్గుణేశః
సంసారబంధస్థితిమోక్షహేతుః

అను శ్వేతాశ్వతరమంత్రము సంసరణబంధమునుండి విడిపించువాడు పరమేశ్వరుడని ప్రతిపాదించుచున్నది. సంసరణ మనగా జనన మరణములు. జనన మనగా జీవునకు శరీరసంబంధము. మరణ మనగా ప్రాణత్యాగము. శరీరసంబంధ మనగా స్థూలసూక్ష్మరూపశరీరద్వయ సంబంధము. మరణ మనగా స్థూలశరీరత్యాగము.

ఈ రెండును – స్థూలసూక్ష్మములు – ప్రథమమున నొకేపర్యాయము ప్రాప్తించుచున్నవి. కాని జన్మాంతమున నీ రెండును నొకే పర్యాయము విడుటలేదు. ప్రతిజన్మాంతమునందును స్థూలశరీరము మాత్రము విడివడుచున్నది. కాని సూక్ష్మము జీవుని వెంటనంటియే యుండును. ఈ విషయము 'ప్రాణ ముత్క్రామంతం సర్వే ప్రాణా హ్యనూత్క్రామంతి' అను వాక్యముచే తెలియుచున్నది. కారణము జన్మద్వయమధ్యమున నుత్తరలోకములందు కర్మానుభవమునకై భూత సూక్ష్మపరిష్వంగ మావశ్యక మగుటయే. ఇయ్యది యుపాసనాప్రీతుడైన పరమేశ్వరునియనుగ్రహమువలనగాని వదలదు. కావున ముముక్షు వనగా సూక్ష్మశరీరమునుండి విడివడగోరినవా డని తేలుచున్నది.

స్థూలశరీరముమాత్రము ప్రతిజన్మయందును ప్రారబ్ధభోగావసానమున నవశముగ దానియంతట నదియే విడిపోవుచున్నది. సూక్ష్మశరీరముమాత్ర ముత్తరలోకకర్మానుభవమునకై వెంటనంటియే యుండును. దీనిని వదలుటకై

ఈశం తం జ్ఞాత్వా అమృతా స్తే భవంతి

ఈశ్వరోపాసనము గావింపవలయును. అయిన నీయుపాసన మేవిధముగ గావింపవలయును ?

క్షరం ప్రధాన మమృతాక్షరగ్ం హరః
క్షరాత్మానా వీశతే దేవ ఏకః
త స్యాభిధ్యానా ద్యోజనా త్తత్త్వభావా
ద్భూయ శ్చాంతే విశ్వమాయానివృత్తిః

జీవజగత్తులను శాసించువా డీశ్వరు డనియును, ఆయీశ్వరుని ధ్యానించుటవలనను, శరీరమున ధరించుటవలనను, యీశ్వరుడగుటవలనను విశ్వమాయానివృత్తి యగునని శ్వేతాశ్వతరము ప్రతిపాదించుచున్నది. విశ్వమాయానివృత్తి యనగా కృత్స్నజగత్సంబంధనివృత్తి. అనగా సర్వప్రపంచసంబంధము తొలగిపోవుట యని యర్థము. అధిష్ఠానమగు శరీరసంబంధమును, అనుభవసాధనమగు శరీరభిన్నజగత్తుయొక్క సంబంధమునను విషయము విశ్వశబ్దముచే సూచింపబడుచున్నది. 'మాయాం తు ప్రకృతిం వింద్యాత్' అను శ్వేతాశ్వతరవాక్యమువలన మాయాశబ్దమునకు ప్రకృతి=జగత్తని యర్థము.

యోజనశబ్దార్థము

ఈరెండువిధములైన జగత్సంబంధములు వదలవలయునన్న నీశ్వరుని యోజనధ్యానతత్త్వభావము లావశ్యకములు. ఇక యోజనధ్యానతత్త్వభావము లనగా నేమియో గాంతము. యోజన మనగా పరమే

శ్వరసంబంధము కలిగించుకొనుట. ఇయ్యది రెండురకములు — స్థూలశరీరముతో, సూక్ష్మశరీరముతో. సూక్ష్మశరీర మనగా త్వగాదిపంచజ్ఞానేంద్రియ, వాగాదిపంచకర్మేంద్రియ, మనస్సులు. ఇందు మనస్సు ప్రధానమైనదిగాన సూక్ష్మశరీరముతో సంబంధ మనగా మనస్సుతో సంబంధ మని యర్థము. అనగా మననముచేయుట. ఈ మననము చేయుట యీమంత్రమునందు ధ్యానశబ్దముచేత ప్రతిపాదింపబడినది. ఇక స్థూలశరీరసంబంధవిషయము గాంతము. స్థూలశరీరము భౌతికము. చేతనుడగు పరమేశ్వరునకు భౌతికమగు స్థూలశరీరముతో సంబంధము కలిగించుట యెట్లు? ఇయ్యది మహాజటిలమగు సమస్య.

ముముక్షుతకు పూర్వము ముముక్షువునకు జగత్సంబంధమేగాని యన్యము లేదు. పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేద మాయాత్ =లోకములు కర్మవ్యాప్తములని నిర్ణయించికొని యనగా జననమరణాపాదకములని యెంచి నిర్విణ్ణుడైనాడు. తద్విజ్ఞానార్థం స గురు మేవాభిగచ్ఛేత్ =కర్తవ్యవిషయపరిజ్ఞానమునకై గురువు నభిగమించినాడు. ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్ = గురువు బ్రహ్మోపాసనావిషయము నుపదేశించినాడు.

దహ్రం విపాపం పరవేశ్మభూతం
హృత్పుండరీకం విరజం విశుద్ధమ్
తత్రాపి దహ్రం గగనం విశోక
స్తస్మి న్యదంత స్త దుపాసితవ్యమ్

దహరపుండరీకాంతర్వర్తియగు పరమేశ్వరు నుపాసింపు మనినాడు. దహర మన నేమియో తెలియదు. దానిలో నేమున్నదియో, దాని నుపాసించుట యెట్లో తెలియదు. ఇదియే ప్రస్తుతసమస్య. 'ద్వే వావ బ్రహ్మణో రూపే మూర్తం చామూర్తం చ'=పరమేశ్వరునకు మూర్తమనియును, నమూర్త మనియును రెండురూపములున్నవి. పరమేశ్వరుని మూర్తరూపము జగత్తు. ఈవిషయము

శక్త్యాది చ పృథివ్యంతం జగ దేత చ్చరాచరమ్
విగ్రహం దేవదేవస్య పరమేశస్య శూలినః

అను శివపురాణవాక్యముచే ప్రతిపాదింపబడినది. ఇచట తనకొలబద్ధ నుపయోగించినాడు. వ్యక్తియొక్క యనుగ్రహమును గోరి యాతని యనుగ్రహమును పొందుట లోకపరిపాటి. జీవుడు, శరీర మనుసమష్టికే వ్యక్తి యని వ్యవహారము. అనుగ్రహింపవలసినది జీవుడు. కాని సేవించునది యాతనిశరీరమును. అట్లే పరమేశ్వరుని శరీరమగు జగత్తు నారాధించిన పరమేశ్వరానుగ్రహము గలుగునను నిర్ణయమునకు వచ్చినాడు. అయిన జగదారాధన గావించుట యెట్లు? వ్యక్తి నారాధించుటలో యావద్వ్యక్తి నారాధించుటలేదు. పాదపూజమాత్రము గావించుట గమనించినాడు. అట్లే జగద్భాగమగు నొకవిగ్రహము నారాధించుట కారంభించినాడు. ఈవిగ్రహమునకే ప్రతీక మని వేదాంతవ్యవహారము. ఈవిమర్శవలన భక్తు లుపాసించునది ప్రతీక మనగా జగత్తని తేలుచున్నది. అనగా జగద్భాగమగు విగ్రహము.

2. అది బ్రహ్మతత్త్వము కాకపోవుటలో హేతు వేమి?

అనుగ్రహము జీవునికి సంబంధించినది. అనుగ్రహింపవలసిన జీవుడు శరీరము కా దనుట యనుభవసిద్ధమగువిషయము. జీవయుక్త మగు శరీరమును పూజింతుముగాని జీవాపేతమగు శరీరమును పూజింపముగదా? జీవుడు శరీరము కానట్లు విగ్రహము అనగా జగత్తు పరమేశ్వరుడు గాడు. తా నపునరావృత్తముగ సాయుజ్యము నందవలసినది పరమేశ్వరునియందు. మఱియు నాపరమేశ్వరుడు తనయందలి యనుగ్రహముచే

అంగుష్ఠమాత్రః పురుషోఽంతరాత్మా
సదా జనానాం హృదయే సన్నివిష్టః

తన కధిష్ఠానమైన యీశరీరమునందే, తానున్న హృదయమునందే

అంగుష్ఠమాత్రుడై యున్నాడు. కావున త దుపాసితవ్యమ్ = దాని నుపాసించుట కారంభించినాడు. ఈవిమర్శచే ప్రతీకము పరమేశ్వరుడు కా దనియును, తదారాధనము హార్దబ్రహ్మోపాసనమునకు సోపానము మాత్రమే యనియును, కర్తవ్యము హార్దబ్రహ్మోపాసన మనియును తేలుచున్నది.

ఓమ్

కేనోపనిషత్తు

ద్వితీయఖండము - ప్రథమమంత్రము

యది మన్యసే సువే దేతి దభ్ర మే వాపి
నూనం త్వం వేత్థ బ్రహ్మణో రూపమ్
య దస్య త్వం య దస్యచ దేవే ష్వథ ను
మీమాంస్య మేవ తే మన్యే విదితమ్

అర్థము :- అహమ్ = నేను, సువేద = బ్రహ్మయొక్క రూపమును చక్కగా తెలిసికొనుచున్నాను, ఇతి = అని, త్వమ్ = నీవు, మన్యసే యది = తలంచితివేని, అస్య = ఈబ్రహ్మయొక్క, యత్ = ఏరూపము, త్వమ్ = నీవు, అసి = అగుచున్నావో అస్య = ఈబ్రహ్మయొక్క, యత్ = ఏరూపము, దేవేషు = దేవతలయందు, అస్తి = ఉన్నదో, తత్ = ఆ, బ్రహ్మణః = బ్రహ్మయొక్క, రూపమ్ = రూపమును, త్వమ్ = నీవు, నూనమ్ = నిశ్చయముగా, దభ్ర మేవాపి = అల్పముగానే, వేత్థ = తెలిసికొను చున్నావు. అథ ను = పిమ్మట, తే = నీయొక్క, విదితమ్ = తెలిసికొననదానిని, మీమాంస్య మేవ = విచారింపదగినదానినిగానే, మన్యే = తలంచుచున్నాను.

తాత్పర్యము :- పరమేశ్వరతత్త్వమును చక్కగా నేను తెలిసికొను చున్నా నని తలంచుచుంటివేని నీవు తెలిసికొనినది చాల స్వల్పము. నీరూపమును, దేవతలరూపమును చూచి నీవు తెలిసికొనినది యావద్బ్రహ్మరూపము గాదు. కావున యావద్బ్రహ్మరూపమును చక్కగా విచారించి తెలిసికొనవలెను.

వివరణము

పూర్వఖండమునందు జీవునకు జీవనహేతువులై బహిఃప్రపంచ సంబంధమున సాధనములైన ప్రాణవాఙ్మనశ్చక్షుఃశ్రోత్రములు సర్వ జగచ్ఛాసకుడగు పరమేశ్వర ప్రేరణచేతనే స్వకృత్యనిర్వాహణసమర్థము లగుచున్న వనియును, ముముక్షువు లుపాసించు ప్రతీకము బ్రహ్మ తత్త్వము గా దనియును నిరూపింపబడినవి. ఈయధ్యాయమున బ్రహ్మ స్వరూపవిషయము వివరింపబడుచున్నది.

సువేద :- బాగుగా తెలిసికొనుచున్నా నని యర్థము.

సు అనునుపసర్గకు సుష్ఠు = బాగుగా, సమగ్రముగా నని యర్థము. సువేద=బ్రహ్మయొక్క రూపమును సమగ్రముగా తెలిసి కొనుచున్నా నని యర్థము. ఇక తెలిసికొనుటలో సామగ్ర్య మేమో విచారింతము. విదధాతువు సకర్మకము. తెలిసికొనుట దేనిని? సాధ నము లేవి? సాధనములు త్వగాదిపంచజ్ఞానేంద్రియములు. ఈసాధన ములతో శబ్దస్పర్శరూపరసగంధము లను విషయములను తెలిసికొను చున్నాడు. తనకును, తనయింద్రియములకును నధిష్ఠానము శరీరము. పరిశోధించి శరీరవిషయము సమగ్రముగా తెలిసికొనినాడు. శరీరము తనది. తత్పోషణమునకు కావలసిన పరికరములు తా ననుభవించు చున్నవి తన వనుకొనినాడు. విచారింపగా తనవి కానివి, తనయను భవమునకు రానివి యనంతముగ నున్న వనియును, నయ్యవియును వీనివంటివే యనియును తెలిసికొనినాడు. కాని తనయిచ్ఛకు వ్యతిరేక ముగ తనవిషయములో జరుగుచున్నపరిస్థితిని గాంచినాడు. తనవారు మరణించుటచే తానును నవశముగ మరణింపక తప్పదను నిశ్చయము నకు వచ్చినాడు. శరీరముండియు, పరికరము లుండియు ననుభవించుట కవకాశము లేనిపరిస్థితిని గమనించినాడు. ఉన్నంతవరకు నేదియోవిధ ముగ ననుభవించి మరణింత మనుకొనినాడు. ఇయ్యదియే యాతడు సమగ్రముగా తెలిసికొనిన విషయము.

ఇక నాతనిసమగ్రపరిజ్ఞాన మసమగ్రమని మంత్రమునందు ప్రతిపాదింపబడుచున్నది. తా నెవరు? తా ననగా నేమి? తన కీప్రపంచముతో సంబంధ మెట్లు గలిగినది? తానై కలిగించికొనినాడా? తనకన్న భిన్నముగానున్న యీసర్వాంగసుందరమగు శరీరము నెవరు నిర్మించినారు? తనకు తెలియకపూర్వమే తన కధిష్ఠానమగు నీశరీరమును నిర్మించిన దెవరు? తలిదండ్రు లందమన్న వారును తనవంటివారేగదా? ఇట్టివిచిత్ర నిర్మాణము అల్పులును, నల్పజ్ఞులునగువారివలన నగునా? అయిన నానిర్మాత యెవరు? ఆత డెట్టివాడు? ఆతనినివాస మెచట? ఆతనికిని, తనకునుగల సంబంధ మేమి? ఏయుద్దేశముతో తన కీశరీర మిచ్చినాడు? ఆతనియుద్దేశము నెరవేరుట యెట్లు? తదుద్దేశపూర్తి తనవలన నగునా? ఈపనిలో నాతడు సాయపడునా? ఆతనిసాయము నపేక్షించిన తా నేమి గావింపవలెను?

ఎంతగంభీరమగు, జటిలమగు సమస్య! ఈసమస్యను విడదీయుటలో నాజ్ఞాన మెంత? నాసామర్థ్య మెంత? ఇదియంతయును పరికించిన నొకమహాశక్తి మంతుని శాసనమునకు లోబడి యీసమస్తమును జరుగుచున్నదని తేలుచున్నది. ఒక్కపర్యాయ మాతనిదర్శన మైన బాగుండును? నాయల్పజ్ఞతను వివరించి యాసర్వజ్ఞునివలన నేనును సర్వజ్ఞుడ నగుట కవకాశ ముండునుగదా?

ఇం దేవిషయమునకును నెంతగ నాలోచించియు పరిష్కార మార్గము గనుగొనలేని నేను ఎంతగ విజ్ఞుబీగితిని! ఈవిషయమున నాజ్ఞానము దభ్రమే వాపి=చాల కొద్ది దనుటలో సందేహము లేదు.

ద్వితీయ మంత్రము

నాఽహం మన్యే సువే దేతి నో న వే దేతి వేద చ
యో న స్త ద్వేద త ద్వేద నో న వే దేతి వేద చ

అర్థము :- అహమ్ = నేను, సువేదేతి = బాగుగా తెలిసికొనుచున్నాను అని, న మన్యే = తలంచను. న వేదేతి = ఎఱుంగ ననియును, నో వేద చ = ఎఱుంగను. నః = మాలో, యః = ఎవడు, తత్ = ఆబ్రహ్మతత్త్వమును, వేద = తెలిసికొనుచున్నాడో, సః = అతడు, తత్ = ఆతత్త్వమును, వేద = తెలిసికొనుచున్నాడు. న వేదేతి = ఎఱుంగ నని, నో వేద = ఎఱుంగను.

తాత్పర్యము :- నాకు బాగుగా తెలియునని తలంచను, నాకు తెలియదనువిషయముగూడ తెలియదు. మాలో తెలిసినవానికిమాత్రమే తెలియును. ఇప్పటికిని నాకేమియును తెలియ దనువిషయముగూడ తెలియదు.

వివరణము

పూర్వమంత్రమునందు ముముక్షువునకు తెలిసినది చాల స్వల్పమని ప్రతిపాదింపబడినది. ఈమంత్రమునందు ముముక్షువునకు తెలిసినది చాల స్వల్పమనియును, తెలియదను విషయముగూడ నాతనికి తెలియ దనియును, తెలిసినవారు చాల నరుదుగా నుందు రనియును ప్రతిపాదింపబడుచున్నది.

తృతీయమంత్రము

యస్యామతం తస్య మతం మతం యస్య న వేద సః
అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాత మవిజానతామ్

అర్థము :- అవిజ్ఞాతమ్ = తెలిసికొనబడనిదానిని బ్రహ్మతత్త్వమును, విజానతామ్ = తెలిసికొనుచున్నట్టియు, విజ్ఞాతమ్ = తెలిసికొనబడిన జగత్తును, అవిజానతామ్ = తెలిసికొననట్టివారిలో, యస్య = ఎవనికి, అమతమ్ = తెలియనిది కలదను భావము కలదో, తస్య = అతనికి, మతమ్ = తెలియును. యస్య = ఎవనికి, మతమ్ = తెలియునో, సః = అతడు, న వేద = ఎఱుంగడు.

తాత్పర్యము :- తెలియబడని బ్రహ్మతత్త్వమును తెలిసికొనగోరుచు, తెలిసిన జగత్తును మరచుచున్నవారిలో నెవనికి తెలియబడని తత్త్వము కల దను భావము కలదో ఆతనికి కొంతవరకు తెలియును. ఎవనికి తెలియునను గర్వము గలదో వానికేమాత్రమును తెలియదు.

వివరణము

పూర్వమంత్రమునందు ముముక్షువునకు తెలిసినది చాల స్వల్ప మనియును, తెలిసినవారు చాల నరుదుగ నుందు రనియును, ఇప్పటికిని తనకు తెలియ దనువిషయముగూడ తెలియ దనియును ప్రతిపాదింప బడినది. ఈమంత్రమునందు తెలియబడని బ్రహ్మతత్త్వమును తెలిసికొనగోరుచు, తెలిసిన జగత్తును విడువగోరుచున్నవారిలో నెవనికి తెలియబడని తత్త్వము కలదనుభావము కలదో ఆతనికి కొంతవరకు తెలియు ననియును, నెవనికి తెలిసినదే సమస్తము ననుభావము కలదో వాని కేమియును తెలియ దనియును నిరూపింపబడినది.

అవిజ్ఞాతం విజానతామ్ - తెలియబడని బ్రహ్మతత్త్వమును తెలిసికొనగోరువా రని యర్థము.

ముముక్షువు సాయుజ్యము నందవలసినది హార్దబ్రహ్మయందు. ఈవిషయము సమగ్రముగా తెలిసిఁగాని — హార్దబ్రహ్మయన నేమో, తా నెచట నున్నాడో, ఎటుల సాయుజ్యము నందవలయునో, సాయుజ్యము నందుట కేమి గావింపవలయునో — తనయాశయము నెరవేరదు. ఇయ్యది నెరవేరవలయునన్న విజ్ఞాత మవిజానతామ్ = బాగుగా తెలియబడిన, నిత్యానుభవములోనున్న, వ్యామోహాకరమైన జగత్సంబంధము విడువవలయును. లేనిచో నీజగత్సంబంధమున మున్గి తేలుచున్నచో తనయుద్దేశమున కడుగడుగునకు నాటంకములు గలుగుచునేయుండును. కావున క్రమక్రమముగ విజ్ఞాతజగత్సంబంధమును తగ్గించికొనుచు, నవిజ్ఞాతబ్రహ్మసంబంధమును వృద్ధిచేసికొనుచు చివరకు జగత్సంబంధమును పూర్తిగా వదలించికొని హార్దబ్రహ్మయం దపునరావృత్తముగ లీనమగుటకై యత్నింపవలయురు. ఇదియే యుపనిషదధ్యయనమునకు పరమప్రయోజనము.

చతుర్థమంత్రము

ప్రతిబోధవిదితం మత మమృతత్వం హి విందతే
ఆత్మనా విందతే వీర్యం విద్యయా విందతేఽమృతమ్

అర్థము :— ముముక్షుః = ముముక్షువు, ప్రతిబోధవిదితమ్ = ఉపదేశముచేత తెలిసికొనబడినదియును, మతమ్ = మననముచేయబడిన, అమృతత్వమ్ = మరణరాహిత్యమును, విందతే హి = పొందుచున్నాడు. ఆత్మనా = శరీరముచేత, వీర్యమ్ = తేజస్సును, విందతే = పొందుచున్నాడు. విద్యయా = ఉపాసనచేత, అమృతమ్ = శివుని, విందతే = పొందుచున్నాడు.

తాత్పర్యము :— ముముక్షువు గురూపదేశముచే విషయపరిజ్ఞానము కలిగి, కలిగిన జ్ఞానమును మననముచేయుచు మరణరహితస్థితిని పొందుచున్నాడు. శరీరముచే ననగా శారీరకకర్మలచే వీర్యమును అనగా కర్మాచరణపాటవమును, ఉపాసనచే శివుని పొందుచున్నాడు.

వివరణము

పూర్వమంత్రమునందు తెలియనివిషయమును తెలిసికొనుచు, తెలిసినదానివిలువను నిర్ణయించికొనుచు బ్రహ్మాత్మత్వము కల దను భావము నేమరక తెలిసిన జగత్తును సాధనముగా వినియోగించుకొనుచు సాయుజ్యమునకై యత్నింపవలయునని నిరూపింపబడినది. ఈమంత్రమునం దాప్రయత్నమున గురూపదేశమననము లావశ్యకము లనియును, శారీరకకర్మల నాచరించుచు పాటవమును గాపాడుకొనుచు శివు నుపాసింపవలయునని ప్రతిపాదింపబడుచున్నది.

గురూపదేశావశ్యకత

ప్రతిబోధవిదితమ్ — గురూపదేశముచే తెలిసికొనబడిన యని యర్థము.

ప్రతిబోధ మనగా నుపదేశము. మానవజీవితమున నామరణ ముపదేశావశ్యకత యున్నది. శైశవమున తలిదండ్రులనుండి అమ్మ

అక్క అను తొక్కు పలుకులు నేర్చుకొనుట, బాల్యమున నక్షరాభ్యాసము, తదుపరి గురుకులవాసము-సంహితాధ్యయనము, పిమ్మట నమృతత్వమునకై ఉపనిషదధ్యయనము ఈప్రకరణమున ప్రతిబోధ మనగా గురుముఖతః ఉపనిషత్ప్రతిపాదితార్థోపదేశము. వివక్షింపబడినది. అయ్యది లేక సరియైన జ్ఞానము కలుగుట యసంభవము. ఈవిషయము ముండకమున 'తద్విజ్ఞానార్థం స గురు మే వాభిగచ్ఛేత్' అనుమంత్రముచే ప్రతిపాదింపబడినది.

గురూపదేశము లేనిది యెన్నిజన్మలకైనను అమృతత్వప్రాప్తి విషయకపరిజ్ఞానము కలుగుట యసంభవము. కారణము ఏజన్మయందైనను ముముక్షుతాపర్యంత మావశ్యకమైన జ్ఞానము కలుగుట కవకాశ మున్నది. కాని ముముక్షుప్రాప్యవస్తుసంబంధిజ్ఞానముగాని, తత్ప్రాప్తిమార్గమునకు సంబంధించిన జ్ఞానముగాని కలుగుట కవకాశము లేదు.

మతమ్ — మననము చేయబడిన యని యర్థము.

మననము చేయుట యనగా జ్ఞాతవిషయమును మరువకుండుటకై యావృత్తి చేయుట. శ్రవణమనననిదిధ్యాసనములలో మననము రెండవది. ఇంటికి పునాది, గోడలు, కప్పువంటివి సాయుజ్యమునకు శ్రవణమనననిదిధ్యాసములు. పూర్ణాదిశబ్దభవము పునాది యనుశబ్దము. పూర్ణాది యనగా సమగ్రము, సమర్థము నగు నాది యని యర్థము. పునాది గట్టిగ నున్నగాని దానిమీద నిర్మించిన యిల్లు చాలకాలము వరకు నిలువదు. తరువాతివి గోడలు. పునాది గట్టిగ నుండి గోడలు గట్టిగ లేకున్నను నిల్లు కూలిపోవును. కప్పును నంతియే. ఈమూడును దృఢముగ నున్నంతవకే యిల్లు నివాసయోగ్యముగ నుండును.

శ్రవణము సక్రమముగ గావించిననే, సరియైన గురువునొద్ద గావించిననే చక్కని విషయపరిజ్ఞానము గలుగును. తాపీమేస్త్రీ సము

ష్ఠుడైననే పునాదినిర్మాణము సరియైనస్థితిలో నుండును. తరువా గావింపవలసినది మననము. ఇది యింటికి గోడలవంటిది. గోడలు కప్పు కాధారమైనట్లు నిదిధ్యాసనమున కిది యాధారమగుచున్నది. శ్రవణమువల తెలిసినవిషయము మననమువలన స్థిరత నందినగాని నిదిధ్యాసనము కవకాశ ముండదు. గట్టిపునాదిమీద గోడలును గట్టిగ నున్నగాని కప్పు నిలువదు. కావుననే ప్రతిబోధవిదితమైన విషయము అనగా గురూపదేశమువలన తెలిసికొనిన విషయము మననము = ఆవృత్తి చేయబడి గాని, అభ్యసింపబడినగాని నిదిధ్యాసనమున కాధారమై సాయుజ్యమున కుపయోగింపదు.

అమృతత్వమ్ — అమృతత్వ మనగా మరణరాహిత్య మని యర్థము.

ఈ విషయము పీఠికయందు వివరింపబడినదిగాన ప్రకృత మను సరింతము.

ఆత్మనా విందతే వీర్యమ్ — శరీరముచేత వీర్యమును పొందు చున్నాడని యర్థము.

ఆత్మా జీవే ధృతౌ దేహే స్వభావే పరమాత్మని

అను నమరకోశవాక్యమువలన ఆత్మ యనగా శరీరమని యర్థము. జీవుడు శరీరవిశిష్టుడయియే కర్తృత్వవిశిష్టు డగుచున్నాడు. వీర్య మనగా శక్తి. ఇయ్యది శరీరమును పోషించుకొనుటవలన నుత్పద్యమానమై పోషణ జరుగుచున్నంతవరకును స్థిరత్వము నందుచు స్వకృత్యనిర్వహణ సమర్థమునుగా జేయుచుండును. ఈశక్తికే ఓజ స్సని ఆయుర్వేదవ్యవహారము. ఇయ్యది శరీరపోషణమునకును, విహితకర్మాచరణమునకును, జీవితపరమప్రయోజనమగు సాయుజ్యప్రాప్తియందును నత్యంతప్రధానమైనది. కావుననే 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్' అనినారు శిష్టులు. మరియును నుపనిషత్తులలో విద్య యనగా నుపాసనతోపాటు శరీరమునకు ప్రధానస్థాన మిచ్చుట కిదియే కారణము.

ఇంకొకవిశేషము — జీవునకు శరీరసంబంధము కలిగించుటలో పరమేశ్వరునియుద్దేశము జీవుడు సాయుజ్యము నందుటయే. ఇందు కయియే సర్వాంగసుందరమగు మానవజన్మ మిచ్చినాడు. అందును వివేకయుతమగు జన్మ మిచ్చినాడు. వివేకయుతమగు నీజన్మమును సాధనముగా గొని తరింపక శరీరమును దుర్వినియోగము గావించి సంసార సముద్రమున మున్గితేలుచు దుఃఖముల ననుభవించుచో నయ్యది జీవాపచారముమాత్రమే యగును. వివేకము నుపయోగించికొని భోగలంపటుడు గాక మితభోగియై జన్మసార్థక్యము నందుటకై యత్నించుట వివేకమురొక్క పరమప్రయోజనము. కావున మానవుడు ధర్మసాధనమైన శరీరమును జాగ్రత్తగ పోషించికొనుచు వీర్యయుతమునుగా జేసికొని శరీరప్రాప్తిపరమప్రయోజనమగు సాయుజ్యము నందుట ప్రధానధర్మము.

విద్యయా విందతేఽమృతమ్ — ఉపాసనచేత నమృతు ననగా శివుని పొందుచున్నాడని వాక్యార్థము.

విద్య యనగా నుపాసన. విద జ్ఞానే యనుధాతువునుండి నిష్పన్నమైన విద్యాశబ్దమునకు జ్ఞాన మని సామాన్యార్థము. కాని వేదాంతములయం దుపాసన మని యర్థము. ఛాగపశున్యాయము ననుసరించి సామాన్యవాచియగు జ్ఞానశబ్దమును విశేషవాచియగు నుపాసనయం దన్వయించుట శిష్టసంప్రదాయము. ఉపాసన మనగా శివ సమీపమున నుండుట యని యర్థము. బాహ్య మనియును, నాంతర మనియును నుపాసనము రెండు విధములు. బాహ్యోపాసన మనగా నీశ్వరుని మూర్తరూపమగు లింగము నారాధించుట. ఆంతరోపాసన మనగా హార్దబ్రహ్మరూపముననున్న యీశ్వరుని ధ్యానించుట. బాహ్యోపాసన మాంతరోపాసనమునకు సోపానమువంటిది. ముముక్షువునకు ప్రథమమున నాంతరోపాసమున సామర్థ్యముండుట యసంభవమని యెంచియే మొదట బాహ్యోపాసనము విధింపబడినది. ఈవిధముగ స్వార్థరహి

తుడై బాహ్యోపాసన గావించుచు క్రమముగ నాంతరోపాసనమున లబ్ధప్రవేశుడై, ముముక్షువు అమృతుడు=మరణరహితు డగుచున్నాడు. ఈవిషయము

'త్రియంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్
ఉర్వారుక మివ బంధనా న్మృత్యో ర్ముక్షీయ మాఽమృతాత్'
'దహ్రం విపాపం పరవేశ్మభూతం
హృత్పుండరీకం విరజం విశుద్ధమ్
తత్రాఽపి దహ్రం గగనం విశోక
స్తస్మి న్య దంత స్త దుపాసితవ్యమ్'

ఇత్యాద్యనంతశ్రుతులచే ప్రతిపాదింపబడుచున్నది.

అకర్తృత్వవాదనిరాసము

కాని యొకసంప్రదాయమువారు అకర్త్రాత్మప్రతిపత్తిరూపజ్ఞానముచేతనే కైవల్యము సిద్ధించునని ప్రతిపాదించుచున్నారు. ఇయ్యది యుపనిషత్సంప్రదాయవిరుద్ధము. కేవలజ్ఞానముచేతనే 'నాహం కర్తా'= నేను కర్తను గా ననుజ్ఞానముచేతనే కైవల్యము సిద్ధించుచో నుపాసనావిధాయకశ్రుతు లన్నియును వ్యర్థము కావలసివచ్చును. అయ్యది యిష్టాపత్తియే యన్న విచారింతము.

నాఽహం కర్తా=నేను కర్తను గాను అనుట యెందుకు? ఈవాక్యమునకు ప్రసక్తి యేమి? కర్తయైనవాడు కర్తను గా ననుకొనుట విరుద్ధము. కర్త గానివాడు కర్తను గా ననుకొనుట వ్యర్థము. రాజు గానివాడు రాజు గా ననుకొనుటలో నుద్దేశ మేమి? ఆత డేవిధముగను రాజు గాడు. కావున నియ్యది వ్యర్థప్రలాప మగును. రాజు గావలెనను సంకల్ప ముండి నేను రాజు గా ననుటలో కొంత యర్థ ముండవచ్చును. ఈసంకల్పము గలిగినప్పటినుండియు నాత డందుకై ప్రయ

త్నించిన రాజు గావచ్చును. కాకపోవచ్చును. కాని యత్నించుటలో దోస మేమియును లేదు.

నా౽హం కర్తా అను వాక్యమునందలి అహంశబ్దమున కర్థ మేమి? అహమ్ అనునది తన నుద్దేశించి చెప్పునప్పు డుపయోగింపబడు సర్వనామము. వేదాంతములయందు జీవ, ఈశ్వర, జగత్తులను మూడే తత్త్వములు ప్రతిపాదింపబడినవి. అనుభవమునందును నీమూడేతత్త్వములు ప్రధానముగా గన్పడుచున్నవి. ఇందు జగత్తు జడముగాన తద్విషయము విచారింప నక్కఱలేదు. ఇక జీవేశ్వరులవిషయము గాంతము.

ప్రథమమున జీవవిషయము గాంతము. జీవునకు కేవలస్థితిలో ననగా శరీరసంబంధము కలుగుటకుపూర్వము కర్తృత్వము లేదు. కావున జ్ఞాతృత్వమును లేదు. జ్ఞాతృత్వరూపకర్తృత్వము లేదుగాన నాస్థితిలో నా౽హం కర్తా యనుటయే సంభవింపదు. ఇక నీశ్వరవిషయము గాంతము. 'తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్' ఇత్యాదిశ్రుతులు పరమేశ్వరునకు స్రష్టృత్వరూపకర్తృత్వమును ప్రతిపాదించుచున్నవి.

ఇచట నింకొకవిషయము ప్రధానముగా గమనింపవలయును. జీవుడు భౌతికశరీరవిశిష్టుడైనట్లు పరమేశ్వరుడును జగచ్ఛరీరవిశిష్టుడే. ఈవిషయము

శక్త్యాది చ పృథివ్యంతం జగదేతచ్చరాచరమ్
విగ్రహం దేవదేవస్య పరమేశస్య శూలినః

అను శివపురాణవాక్యముచే ప్రతిపాదింపబడుచున్నది. మరియును శరీరస్థానీయమైన జగత్తునకు సృష్టిస్థితిసంహారములు గావించుచు కర్తృత్వవిశిష్టుడగుచున్నాడు. కాని యింతియే విశేషము. జీవుడు కర్తృత్వాపాదకశరీరవిశిష్టుడై పుణ్యాపాపరూపకర్మల నాచరించి తత్ఫలము ననుభవించుచున్నాడు. కాని పరమేశ్వరుడు సృష్ట్యాదికర్మల గావించుచును ఫలభోక్త గాడు. ఈవిషయము

ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయో రేకః పిప్పలగ్ం స్వా ద్వ
త్త్యనశ్న న్నన్యోఽభిచాకశీతి

అను ముండకమంత్రముచే ప్రతిపాదింపబడుచున్నది. కావున జీవేశ్వరులకు కర్తృత్వరూపధర్మము సమానమైనను ఫలాదనమున తేడా యున్నదని తెలుచున్నది. ఈవిమర్శచే నీశ్వరునివిషయమున నాఽహం కర్తా యనువాక్యమునకు ప్రసక్తియే లేదని తేలుచున్నది.

జీవుడు శరీరవిశిష్టుడై కర్త యగుచున్నాడు. శరీరసాహిత్యమున్నంతవరకును కర్తృత్వమును, తత్ప్రయుక్తమైన కర్మఫలాదనమును తప్పవు. కర్తృత్వాపాదనమున శరీరము సాధన మగుచున్నది. కాని యొకవిశేష మున్నది. శరీరరూపాధిష్ఠానమున నున్నను కర్మకరణసాధనమగు శరీరమును వినియోగించికొని కర్మల నాచరింపకున్న కర్తృత్వమును, తత్ప్రయుక్తమైన ఫలాదనమును నుండవు

శరీరరూపాధిష్ఠానమున నుండియును కర్మల నాచరింపకుండ నుండుటకు వీ లున్నదా? ఇయ్యదియే ముముక్షువుయొక్క పరమాశయము. శరీర ముండగనే కర్తృత్వబాధమునుండి విడివడుస్థితికి — నాఽహం కర్తా — యనుస్థితికి రావలయునని యాతని సంకల్పము. ఇక నీస్థితికి వచ్చుటకు వీ లున్నదేమో గాంతము. యావచ్ఛరీరములో జీవునకు కర్తృత్వమును గలిగించుటలో నత్యంతసన్నిహితమైనది మనస్సు. మనోద్వారా చక్షురాదీంద్రియములద్వారా బహిఃప్రపంచసంబంధము గలుగుచున్నది. అంతటితో కర్తృత్వ మేర్పడుచున్నది. కావున కర్తృత్వాపాదనమున మూలకందమైన మనస్సుతో సంబంధమును గలిగించుకొనుటనుండి విరమించికొనిన జీవుడకర్త యగుటలో సందియము లేదు.

కాని యిది యెంత తేలికగ సాధ్యపడునా? ఫలాపేక్ష యున్నంత వఱకును కర్తృత్వము తప్పదు. ఫలాపేక్షను వీడిన కర్మాచరణముతో సంబంధము వదలును. స్వర్గాదులయందు భోగాపేక్ష లేదుగాన జ్యోతిష్టోమాదులు గావింపకపోవచ్చును. కాని శరీరపోషణము తప్పనిసరి యగుటచే తత్ప్రయుక్తమైన కర్మలైనను చేయక తప్పదుగదా? దాని వలన పుణ్యాపాపసంబంధమును, తద్ద్వారా తదనుభవమును తప్పవుగదా యన్న విచారింతము.

శరీరమునం దాస్థయున్న తత్పోషణమునకై కర్మాచరణమును, తద్ద్వారా పుణ్యాపాపసంబంధమును, తత్ఫలానుభవమును తప్పవు. వాస్తవమే. కాని తదాస్థ లేనిచో నవియేవియును బంధింపవు. కాని జీవునకు శరీరమునం దాస్థ తొలగిపోవుటచే తత్ప్రయుక్తమైన బంధము తొలగవచ్చును. కాని శరీర మున్నదిగదా? జీవున కాస్థ లేకపోవుటచే పోషణవిషయము నాతడు చూడడు. శరీరము జడముగాన పోషణకర్తృత్వము దానియం దనుపపన్న మన్న విచారింతము. వాస్తవమే. ప్రారబ్ధభోగావసానమునగాని జీవునకు స్థూలశరీరసంబంధము వదలదు. అంతవఱకును శరీరపోషణము జరుగుచునే యుండవలయును. ఒకసారి త్రిప్పబడిన కులాలచక్రము కులాలుడు త్రిప్పుట నాపినంతనే యాగక భ్రమణమున నుపయోగింపబడిన శక్తి ననుసరించి తిరుగుచు చివర కాగిపోవును. అట్లే యభ్యాసాతిశయమువలన శరీరమును పోషింపబడుచుండును. చివరకు ప్రారబ్ధభోగావసానమున పండిన యాకు రాలిపోవునట్లు రాలిపోవును. గృహాగమనోత్సుకుడైన వ్యక్తి గృహాగమనమును సంకల్పించి పాదక్షేపము నారంభించి ప్రయాణమై దారిలో కార్యాంతరాసక్తుడైనను పాదము లాతని నింటికి గొనిపోవుట యనుభవమున నున్నవిషయమే.

ఈవిమర్శచే కర్తృత్వవిశిష్టుడగు ముముక్షువు సర్వవిధకర్తృత్వాపగమమునగాని సాయుజ్యార్హత లభింపదని యెంచి యకర్తృత్వసాధనకై ఇంద్రియద్వారా బహిఃప్రపంచసంబంధమును వదలించుకొను

టకై యత్నించును. పరమేశ్వరానుగ్రహము లేనిదే యీసంకల్పము నెరవేరదని యెంచియే ఉపాసన నారంభించి సర్వమును నీశ్వరార్పణ బుద్ధితో నాచరించుట కారంభించినాడు. ఈశ్వరానుగ్రహమునకై యత్నించుచున్నాడుగాన నాత డేయకార్యమును జేయడు. చేసినకర్మల కైనను ఫలము శివానుగ్రహముమాత్రమే యగుటచే నయ్యది బంధకము కాదు. కర్మలు ఫలానుభవాపాదకములైననే కర్తృత్వాపాదకములగును. కావున నీస్థితియందు ముముక్షువు నాఽహం కర్తా యనుట కర్హు డగును. కాని అకర్తాత్మప్రతిపత్తి = నేను కర్తను గాను అను జ్ఞానమాత్రముచే నాతని కొరగున దేమియును లేదు. కావున పరమేశ్వరు నుపాసించుచు తదనుగ్రహమున తరించుటకై యత్నించుట ముముక్షువుల ప్రధానకర్తవ్యము.

పంచమమంత్రము

ఇహ చే దవేదీ దథ సత్య మస్తి
న చే ది హావేదీ న్మహతీ వినష్టిః
భూతేషు భూతేషు విచిత్య ధీరాః
ప్రే త్యాస్మా ల్లోకా దమృతా భవంతి

అర్థము:- ఇహ = ఈలోకమునందు, ఈజన్మయందు, అవేదీత్ చేత్ = తెలిసికొనినయెడల, అథ = పిమ్మట, ఆవిధముగా తెలిసికొనినతరువాత, సత్యమ్ = పరమేశ్వరుడు, అస్తి = ఉన్నాడు. ఇహ = ఈలోకమునందు, ఈజన్మమునందు, నావేదీచ్చేత్ = తెలిసికొననియెడల, మహతీ = గొప్పదియగు, వినష్టిః = వినాశము, సంభవతి = సంభవించును. ధీరాః = ముముక్షువులు, భూతేషు = పృథివ్యాదిభూతములయందును, భూతేషు = ప్రాణులయందును, విచిత్య = తెలిసికొని, అస్మాత్ = ఈ, లోకాత్ = లోకమును విడిచి, ప్రేత్య = ప్రకృష్టదశను పొంది, అమృతాః = మరణరహితులు, భవంతి = అగుచున్నారు.

తాత్పర్యము:- ఈజన్మ యుండగనే చక్కగా వివేచించి చూచినచో పరమేశ్వరాస్తిత్వము గోచరించును. ఆవిధముగ గమనింపకున్న నాశము తప్పదు.

కావున ముముక్షువులగువారు భూతములవిషయమును, ప్రాణులవిషయమును చక్కగా వివేచించి తెలిసికొని యీలోకసంబధమును వీడి ప్రకృష్టదశను పొంది అమృతులు = మరణరహితు లగుచున్నారు.

వివరణము

ఇహ చే దవేదీత్ — ఈలోకమునం, దీజన్మయందు తెలిసికొనినయెడల నని యర్థము.

ఇహ అనునది ఇందు ననునర్థముగల యవ్యయము. ఇందు ననగా నీలోకమునందు, ఈజన్మయందు నని యర్థము. ఈలోకమునం దనగా భూలోకమునం దనియును, ఈజన్మయం దనగా మానవజన్మయం దనియును నర్థము. ఉపనిషత్తులు మానవుల నుద్దేశించి ప్రవర్తింపజేయబడినవిగావునను, మానవేతరజన్మలయం దుపనిషదధ్యయన మనుపపన్నముగావునను నీలోకమునం దీజన్మయం దనున దన్వర్థమే యగుచున్నది.

సత్య మస్తి — పరమేశ్వరు డున్నా డని యర్థము.

'ఋతగ్ం సత్యం పరం బ్రహ్మ పురుషం కృష్ణపింగళమ్' అను శ్రుతివలన సత్యశబ్దము పరమేశ్వరవాచకము. అస్తీతి సత్ స దేవ సత్యమ్ అని సత్యశబ్దవ్యుత్పత్తి. సత్య మనగా మూడుకాలములందును నుండునది యని యర్థము.

యదా తమ స్తన్న దివా న రాత్రి
ర్న స న్న చాస చ్ఛివ ఏవ కేవలః
త దక్షరం త త్సవితు ర్వరేణియం
ప్రజ్ఞా చ తస్మా త్ప్రసృతా పురాణీ

అను శ్వేతాశ్వతరశ్రుతివలన శివు డొకరుడే మహాప్రళయకాలమునందు విరాజిల్లుచున్నాడని తెలియుచున్నది.

స విశ్వకృ ద్విశ్వవి దాత్మయోని
ర్జ్ఞః కాలకారో గుణీ సర్వవిద్యః

అను శ్వేతాశ్వతరశ్రుతి సృష్టికర్త శివుడని ప్రతిపాదించు చున్నది. సృష్టిప్రళయములకు మధ్య స్థితి. కావున పరమేశ్వరుడు భూతభవిష్యద్వర్తమానకాలములం దుండువాడని తేలుటచే సత్యశబ్ద మాతనియం దన్వర్థమే యగుచున్నది.మఱియును'బ్రహ్మావిష్ణురుద్రేంద్రా స్తే సంప్రసూయంతే సర్వాణి చేంద్రియాణి సహభూతైః' అను శ్రుతి బ్రహ్మావిష్ణ్వాదిదేవతలు సృష్ట్యంతర్భూతులని. ప్రతిపాదించుచున్నది. కావున సత్యశబ్దము శివైకాంతికమని తేలుచున్నది. మఱియును జగత్తు కాలత్రయవర్తమానమైనను పరిణామ్యముగావునను స్థూలసూక్ష్మస్థితు లను పొందుటచేతను నేకరూపతయావర్తమానుడగు పరమేశ్వరుని యందే సత్యశబ్దము సార్థక్యము నందుచున్నది.

అవేదీత్ చేత్ — తెలిసికొనినయెడల, ఏ మని? తనయల్పత్వ మును, అశక్తత్వమును, పారతంత్ర్యమును, కించిద్జ్ఞత్వమును తెలిసి కొనినయెడల మహత్తును, సర్వశక్తిమత్తును, సర్వతంత్రస్వతంత్రమును, సర్వజ్ఞమునగు నొకతత్త్వ మున్నదని తెలియును.

న చే దిహావేదీ న్మహతీ వినష్టిః — పరమేశ్వరు డున్నాడని తెలిసికొననియెడల నాశము తప్పదని యర్థము.

సర్వజ్ఞత్వాదిగుణయుక్తుడగు పరమేశ్వరునియస్తిత్వమును గమ నించి యాతడే తన కీశరీరమును, తత్పోషణమునకు కావలసిన పదార్థ జాతము ననుగ్రహించినా డనియును, తేన త్యక్తేన భుంజీథాః మా గృధః కస్యస్వి ద్ధనమ్ = తనయర్హత ననుసరించి యనుగ్రహింపబడిన దానితో తృప్తి నంది పరధనముల కాశింపక 'కుర్వ న్నే వేహ కర్మాణి జిజీవిషే చ్ఛతం సమాః' యావజ్జీవము విహితకర్మల నాచరించుచున్న

'న కర్మ లిప్యతే నరే' కర్మలు బంధకములుకావని తెలిసికొనిన మహాభ్యుదయమును, కానిచో మహానాశమును తప్పవు.

భూతేషు భూతేషు విచిత్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవంతి – పంచభూతములయొక్కయు, ప్రాణులయొక్కయు ధర్మములను గమనించి యీలోకసంబంధమును వదలి ప్రకృష్టదశను పొంది ధీరు లమృతు లగుదురని యర్థము.

ఈవాక్యము ప్రథమఖండము – ద్వితీయమంత్రవ్యాఖ్యానమున వివరింపబడుటచే ప్రకృత మనుసరింతము.

ఓమ్

కేనోపనిషత్తు

తృతీయఖండము – ప్రథమమంత్రము

ఓమ్ బ్రహ్మ హ దేవేభ్యో విజిగ్యే, తస్య హ బ్రహ్మణో విజయే దేవా అమహీయంత, త ఐక్షంతాస్మాక మేవాయం విజయోఽస్మాక మేవాయం మహిమేతి.

అర్థము:- బ్రహ్మహ = పూర్వగ్రంథమునందు సర్వజగత్ప్రేరకుడుగా, శాసకుడుగా ప్రతిపాదింపబడిన పరమేశ్వరుడు, దేవేభ్యః = దేవతలకొఱకు, విజిగ్యే = రాక్షసులను జయించెను. తస్య = ఆ, బ్రహ్మణః = పరమేశ్వరునియొక్క, విజయే = విజయమునందు, దేవాః = ఇంద్రాదిదేవతలు, అమహీయంత = మహిమాన్వితులైరి. తే = ఆదేవతలు, అయమ్ = ఈ, విజయః = విజయము, అస్మాక మేవ = మాకు సంబంధించినదే, అయమ్ = ఈ, మహిమా = గొప్పదనము, అస్మాక మేవ = మాకు సంబంధించినదే, ఇతి = అని, ఐక్షంత = తలంచిరి.

తాత్పర్యము:- సర్వజగచ్ఛాసకుడగు పరమేశ్వరుననుగ్రహమువలన దేవాసురయుద్ధమునందు దేవతలు జయించిరి. కాని సర్వానుగ్రాహకుడగు పరమేశ్వరుని మరచి యీవిజయము తమసామర్థ్యమువలననే, తమమహిమవలననే సంభవించిన దని విఱ్ఱవీగిరి.

వివరణము

ప్రథమఖండమునందు సర్వజగత్ప్రేరకుడును, తద్ద్వారా సర్వ జగచ్ఛాసకుడును పరమేశ్వరు డనియును, ఇంద్రియసంబంధమును వద లించికొని ధీరులు మరణరహితులు=అమృతు లగుదు రనియును, పర మేశ్వరతత్త్వము సర్వేంద్రియాతీత మనియును ప్రతిపాదింపబడినది. ద్వితీయఖండమున గురూపదేశముద్వారా విషయపరిజ్ఞానము నంది మననము చేయుచు, శరీరమును భోగసాధనముగా గాక ఉపాసనాసాధ నముగా వినియోగించికొనుచు సంసరణబంధమునుండి విడివడవచ్చు ననియును, ధీరు లీజన్మయందే పరమేశ్వరోపాసకులై యమృతు లగు చున్నా రనియును ప్రతిపాదింపబడినది. మూడవఖండమునందు సర్వ జగచ్ఛాసకుడగు పరమేశ్వరుని యనుగ్రహమువలననే సర్వకార్యములు నెరవేరుచున్న వనువిషయము సోదాహరణముగా నిరూపింపబడు చున్నది.

ఒకప్పుడు దేవాసురయుద్ధమందు పరమేశ్వరానుగ్రహమువలన దేవతలు జయించిరి. కాని యావిషయము మఱచి యీాజయము తమ సామర్థ్యమువలననే, తమమహిమవలననే సంభవించినదని విఱ్ఱవీగి వారు విజయోత్సవము చేసికొనుచుండిరి.

బ్రహ్మ హ దేవేభ్యో విజిగ్యే — పరమేశ్వరుడు దేవతలకొఱకు జయించె నని యర్థము.

యుద్ధము జరుగుచున్నది దేవాసురులకు. ఈ యుద్ధమున జయిం చినది పరమేశ్వరుడు. పరమేశ్వరోపాసన గావించి తదనుగ్రహము పొందుటవలన దేవతలు రాక్షసులను జయించగలిగి రని తాత్పర్యము. శివానుగ్రహము లేని దేకార్యమును నెరవేర దని ఫలితార్థము. ఈ విషయము జుష్ట స్తత స్తే నాఽమృతత్వ మేతి' అను శ్రుతిచే ప్రతి పాదింపబడుచున్నది. ఆముష్మికమున నమృతత్వమునకువలెనే ఐహిక

మున సర్వాభ్యుదయములకును పరమేశ్వరానుగ్రహమే కారణ మనుట సర్వశాస్త్రసమ్మతమగు సిద్ధాంతము.

ఈసందర్భమున నొకవ్యాఖ్యాత పూర్వగ్రంథమున నుత్తమాధికారులకు నిర్గుణబ్రహ్మోపాసనము ప్రతిపాదింపబడిన దనియును, నిక మందాధికారులకు సగుణబ్రహ్మోపాసనము ప్రతిపాదింపబడు చున్న దనియును వ్యాఖ్యానించినాడు. ఇయ్యది యెంతవఱకు విమర్శసహమో గాంతము.

నిర్గుణ సగుణ శబ్దార్థము

ప్రథమమున నుపాసనము నిర్గుణబ్రహ్మోపాసన మనియును, సగుణబ్రహ్మోపాసన మనియును రెండువిధము లనువిషయమును గాంతము. ఈరెండు సమాసములందును నిర్గుణసగుణశబ్దములు బ్రహ్మశబ్దమునకు విశేషణములు. ఈవిశేషణములు బ్రహ్మతత్త్వమునకు నిర్గుణసగుణస్థితులు రెండు కలవని ప్రతిపాదించుచున్నవి. ఈస్థితు లుత్తమమందాధికారులకొఱ కేర్పడినవా? లేక బ్రహ్మతత్త్వమున కీరెండు స్థితులు వాస్తవముగ నున్నవా? బ్రహ్మశబ్దమున కర్థ మేమి?

బృహ బృహి వృద్ధౌ అను ధాతువునుండి బృహతి, బృంహయతి యను వ్యుత్పత్తిచే నిష్పన్నమైన బ్రహ్మశబ్దమునకు విస్తరించునది, విస్తరింపజేయునది యని యర్థము. తాను విస్తరించునది, జగత్తును విస్తరింపజేయునది యని వివరణము.

జగత్తు పరిణామ్యముగాన దానిని విస్తరింపజేయుటలో ననుపపత్తి లేకపోవచ్చును. కాని తాను విస్తరించుటలో వికారప్రసక్తి లేదా యన్న విచారింతము. బ్రహ్మతత్త్వస్వరూపనిర్వచనము గావించిన గాని యీవిషయము చక్కగా నవగతము గాదు. బ్రహ్మతత్త్వమున రెండుభాగము లున్నవి చేతనభాగము, జడభాగము నని. ఈచేతన జడభాగద్వయసమష్టి కే బ్రహ్మశబ్దవ్యవహారము.

బ్రహ్మై వేద మమృతం పురస్తా ద్బ్రహ్మ పశ్చా
ద్బ్రహ్మ దక్షిణత శ్చోత్తరేణ
అధ శ్చోర్ధ్వం చ ప్రసృతం
బ్రహ్మై వేదం విశ్వ మిదం వరిష్ఠమ్

అనుముండకమంత్రము విశ్వము నన్నివైపులను నావరించి బ్రహ్మ తత్త్వము వ్యాపించియున్నదని ప్రతిపాదించుచున్నది. శిశువు గర్భముచే నావరింపబడినటుల విశ్వము బ్రహ్మచే నావరింపబడియున్నది. అంతియే గాదు.

ఈశావాస్య మిదగ్ం సర్వం య త్కిం చ జగత్యాం జగత్

అనునీశావాస్యమంత్రము జగత్తు ఈశావాస్య మనగా జగత్తునం దీశ్వరుడు ప్రత్యణువునందును నంతర్యామిగా నున్నాడని ప్రతిపాదించుచున్నది.

స విశ్వకృత్ విశ్వవి దాత్మయోని
ర్జః కాలకారో గుణీ సర్వవిద్యః
ప్రధానక్షేత్రజ్ఞపతి ర్గుణేశః
సంసారమోక్షస్థితిబంధహేతుః

అను శ్వేతాశ్వతరమంత్రము ఆబ్రహ్మతత్త్వము విశ్వకర్తనియును, సర్వజ్ఞ మనియును, గుణి యనియును, జీవజగత్పతి యనియును, బంధమోక్షకారణ మనియును ప్రతిపాదించుచున్నది. విశ్వకర్తృత్వాదు లన్నియును గుణములే. బ్రహ్మతత్త్వ మేతద్విశిష్టమే యని మంత్రోపనిషత్తు ప్రతిపాదించుచున్నది.

యతో వా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి య
త్ప్రయం త్యభిసంవిశంతి త ద్విజిజ్ఞాసస్వ త ద్బ్రహ్మేతి

అనుశ్రుతి యేతత్త్వమునుండి యీభూతములు జన్మించుచున్నవో, యేతత్త్వము నాశ్రయించి జీవించుచున్నవో, అంతకాల

మున నేతత్త్వమునందు లయము నందుచున్నవో యాతత్త్వము నుపాసింపు మనియును, నయ్యదియే బ్రహ్మతత్త్వ మనియును ప్రతిపాదించుచున్నది. 'ఏష సర్వభూతాంతరాత్మా' అను ముండక మంత్రము పరమేశ్వరుడు (బ్రహ్మతత్త్వము) విశ్వము నన్నివైపుల నావరించియుండుటయేగాక విశ్వమున కంతర్యామిగా నున్నాడని ప్రతిపాదించుచున్నది.

సూర్యో యథా సర్వలోకస్య చక్షుః
న లిప్యతే చాక్షుషై ర్బాహ్యదోషైః
ఏక స్తథా సర్వభూతాంతరాత్మా
న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః

అనుకఠమంత్రము బ్రహ్మతత్త్వము సర్వభూతాంతరాత్మగా నుండియును సర్వలోకచక్షువగు సూర్యుడు చాక్షుషదోషముల కతీతుడుగా నున్నట్లు లోకదుఃఖమున కతీతముగా నున్నదని ప్రతిపాదించుచున్నది.

ఈ విమర్శచే బ్రహ్మతత్త్వము విశ్వము నన్నివైపుల నావరించియున్నదనియును, ఇంతేగాక విశ్వమునం దంతరాత్మగా నున్నదనియును, విశ్వమునకు సృష్టిస్థితిసంహారములు చేయుచున్నదనియును, నీవిధముగ విశ్వముతో నింత ఘనిష్ఠసంబంధ మున్నను తద్గతదోషముల కంటకుండ నున్నదనియును తెలియుచున్నది.

ఇప్పటివరకును బ్రహ్మజగత్తులసంబంధ ముపనిషత్సిద్ధాంతానుసారము సమగ్రముగా నిర్వచింపబడినది. ఇక బ్రహ్మతత్త్వముయొక్క సగుణనిర్గుణస్థితివిషయము గాంతము. సగుణ మనగా గుణములతో కూడుకొన్న దనియును, నిర్గుణ మనగా గుణరహిత మనియును వారి నిర్వచనము. కాని యిచట నొకవిషయమును ప్రధానముగా గమనించవలయును. నిర్గతాః గుణాః యస్మాత్తత్ నిర్గుణమ్ అని నిర్గుణశబ్దమునకు విగ్రహము. ఏతత్త్వమునుండి గుణములు పోయినవో

యాతత్త్వము నిర్గుణ మని యర్థము. కాని వారి సిద్ధాంతము ప్రకారము నిర్గుణ మనుటకంటె అగుణ మనుట యనుకూలముగా నుండును. అగుణ మనగా గుణములు సార్వకాలికముగా లేని దని యర్థము. నిర్గుణశబ్దమునకు పూర్వము గుణము లుండి తరువాత పోయిన దని యర్థము. కావున నాసంప్రదాయమున నిర్గుణశబ్దము సమన్వయింపదని తేలుచున్నది.

నిర్ అను సుపసర్గకు అభావార్థమునందును సమాస మున్నది. మక్షికాణా మభావః నిర్మక్షికమ్ అని విగ్రహము. మక్షికముల యొక్క యభావము లేకపోవుట యని యర్థము. అటులే గుణానా మభావః నిర్గుణమ్ అని సమాసము చెప్పవచ్చును. కాని యీ యర్థమున నిర్గుణశబ్దము బ్రహ్మశబ్దమునకు విశేషణము కాజాలదు.

ఉపనిషత్సంప్రదాయమునందు గుణశబ్దమునకు ధర్మము లని యర్థము. సృష్టికర్తృత్వాదులు బ్రహ్మధర్మములు. సృష్టికాలమున స్రష్టృత్వమును స్థితికాలమున పోషకత్వమును లయకాలమున సంహర్తృత్వమును బ్రహ్మధర్మములు. ఇయ్యవి యాయాకాలములందుమాత్రమే యుండు ధర్మములు. అన్నికాలములందును నుండునది జగద్వైశిష్ట్యము. బ్రహ్మతత్త్వము సృష్టికాలమునందును, స్థితికాలమునందును, లయకాలమునందును జగద్విశిష్టమే. సృష్టికాలమున నామరూపవిభాగార్హావస్థిత్యున్ముఖజగద్విశిష్టము. స్థితికాలమునందు విభక్త నామరూపజగద్విశిష్టము. లయకాలమునందు నామరూపవిభాగానర్హజగద్విశిష్టము. లయ మనగా నామరూపవిభాగానర్హస్థితిమాత్రమే కాని నాశము గాదు. కారణము స్వరూపనాశము పదార్థధర్మము గాకపోవుటయే. ఈవిషయము గీతలయందు

నాఽసతో విద్యతే భావో నాఽభావో విద్యతే సతః
ఉభయో రపి దృష్టోఽంత స్త్వనయో స్తత్త్వదర్శిభిః.

అను శ్లోకముచే ప్రతిపాదింపబడినది. కావున బ్రహ్మతత్త్వము సర్వ కాలములందును జగద్విశిష్టమనియే తేలుచున్నది. మఱియును వికార ప్రసక్తి పరిణామ్యమగు జగద్విషయమునసేగాని పరిణామయితయగు నీశ్వరునివిషయమున లేదనియును తేలుచున్నది.

త ఐక్షం తాస్మాక మే వాయం విజయోఽస్మాక మే వాయం మహిమేతి— ఈవిజయము మాదే, ఈమహిమ మాదే యని దేవ తలు తలంచి రని యర్థము.

శివానుగ్రహమువలననే తామీయుద్ధమున జయింపగలిగితి మనువిషయమును మరచి దేవతలు విఱ్ఱవీగి విజయోత్సవమును చేసి కొనుచుండిరి. గర్వ మధఃపతనమునకు హేతువు. కావున పరమేశ్వ రుడు వారు నిమిత్తమాత్రులను విషయము వారి కెఱుకపరుపదలచి యక్షరూపమున వారిసమీపమునకు వచ్చె ననువిషయ మనంతర మంత్రమునందు ప్రస్తావింపబడుచున్నది.

ద్వితీయమంత్రము

త ద్ధైషాం విజజ్ఞౌ తేభ్యో హ ప్రాదుర్బభూవ
త న్న వ్యజానంత కి మిదం యక్ష మితి

అర్థము :- ఏషామ్ = దేవతలయొక్క, తత్ = గర్వవిషయమును, విజజ్ఞౌ = పరమేశ్వరుడు తెలిసికొనెను. తేభ్యః = ఆదేవతలకొఱకు, ప్రాదుర్బభూవ = సాక్షాత్కరించెను. ఇదమ్ = ఈవచ్చిన, యక్షమ్ = యక్షరూపమున నున్నది, కిమ్ = ఎవరో, ఇతి = అని, న వ్యజానంత = (దేవతలు) తెలిసికొనలేకపోయిరి.

తాత్పర్యము :- సర్వాంతర్యామియును, సర్వజ్ఞుడునునగు పరమేశ్వరుడు వారి గర్వమును గమనించి యక్షరూపమున వారియెదుట సాక్షాత్కరించెను. కాని గర్వోన్మత్తులైన దేవత లావచ్చిన దెవరో తెలిసికొనలేకపోయిరి.

తృతీయమంత్రము

తేఽగ్ని మబ్రువన్ జాతవేద! ఏత ద్విజానీహి
కి మేత ద్యక్ష మితి,

తే = దేవతలు, జాతవేద! = ఓయగ్నీ!, ఏతత్ = ఈ, యక్షమ్ = యక్షుడు, కి మితి = ఎవరైనదియును, ఏతత్ = ఈవిషయమును, విజానీహీతి = తెలిసికొనుమని, అగ్నిమ్ = అగ్నినిగూర్చి, అబ్రువన్ = పలికిరి.

తాత్పర్యము;- అంత దేవత లగ్నిని గాంచి యోయీ! ఈయక్షునివిష యము కనుగొనిర మ్మని పలికిరి.

చతుర్థమంత్రము

త థేతి త దభ్యద్రవ త్త మభ్యవద త్కోఽసీతి
అగ్ని ర్వా అహ మస్మీ త్యబ్రవీ జ్జాతవేదా వా అహ మస్మీతి

అర్థము:- అగ్నిః = అగ్ని, తథేతి = అటులేయని (పలికి). తత్ = ఆయక్షుని గూర్చి, అభ్యద్రవత్ = పరువిడెను. యక్షమ్ = యక్షుడు, తమ్ = అగ్నినిగూర్చి, కోఽసీతి = ఎవడవని, అభ్యవదత్ = పలికెను. (అగ్నిః = అగ్ని), అహమ్ = నేను, అగ్ని ర్వా = అగ్నిని, సర్వవ్యాపకుడను, అస్మీతి = అగుచున్నానని యు, అహమ్ = నేను జాతవేదాః వా = వేదముల పుట్టుకస్థానమును, అస్మీతి = అగుచున్నా ననియు, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము:- అగ్నియును నటులే యని పలికి యాయక్షునియొద్ద కేగెను. యక్షుడు అగ్నిని నీ వెవరవని యడిగెను. అగ్ని నేను సర్వవ్యాపకుడను, వేదో త్పత్తిస్థానము నని పలికెను.

పంచమమంత్రము

తస్మిం స్త్వయి కిం వీర్య మి త్యపీదగ్ం
సర్వం దహేయం య దిదం పృథివ్యా మితి

అర్థము:- తస్మిన్ = అట్టిప్రసిద్ధుడవైన, త్వయి = నీయందు, కిమ్ = ఏమి, వీర్యమ్ = సామర్థ్యము, అ స్తీతి = ఉన్నదని, అవదత్ = పలికెను. సః = అగ్ని,

పృథివ్యామ్ = భూలోకమునందు, య దిదమ్ = ఏయీపదార్థజాతము, అస్తి = ఉన్నదో, ఇదమ్ = ఈ, సర్వ మపి = సమస్తమును, దహేయమ్ = దహించగలను, ఇతి = అని, అవదత్ = పలికెను.

తాత్పర్యము:- యక్షు డట్టినీసామర్థ్య మేమని యడిగెను, అగ్ని ప్రపంచమునందలి సర్వమును దహించగల నని పలికెను.

షష్ఠమంత్రము

తస్మై తృణం నిదధా వేత ద్దహేతి త
దుపప్రేయాయ సర్వజవేన త న్న శశాక
దగ్ధుం స తత ఏవ నివవృతే నైత
దశకం విజ్ఞాతుం య దేత ద్యక్ష మితి

అర్థము:- యక్షమ్ = యక్షుడు, ఏతత్ = దీనిని, దహేతి = దహింపుమని, తస్మై = ఆతనికొఱకు, తృణమ్ = గడ్డిపరకను, నిదధౌ = ఉంచెను. అగ్నిః = అగ్ని, తత్ = ఆగడ్డిపరకనుగూర్చి, సర్వజవేన = తన సర్వవేగముతో, ఉపప్రేయాయ = సమీపించెను, తత్ = దానిని, దగ్ధుమ్ = దహించుటకు, న శశాక = సమర్థుడు కాక పోయెను. సః = అగ్ని, తత ఏవ = అచటనుండి, నివవృతే = మరలిచనెను. ఏత ద్యక్షమ్ = ఈయక్షుడు, య దితి = ఎవరనువిషయము, విజ్ఞాతుమ్ = తెలిసికొనుటకు, నాశకమ్ = సమర్థుడను కానైతిని, ఇతి = అని, అవదత్ = పలికెను.

తాత్పర్యము:- యక్షుడు దీనిని దహింపుమని యగ్నిముం దొకగడ్డిపరక నుంచెను. అగ్నియును దానిని దహించుటకు తనసర్వశక్తిని వినియోగించెను. కాని దహింపజాలకపోయెను. అంత నగ్ని మరలిపోయి యాత డెవరో తెలిసికొనజాలకపోతినని వచించెను.

సప్తమమంత్రము

అథ వాయు మబ్రువన్ వాయా వేత
ద్విజానీహి కి మేత ద్యక్ష మితి

అర్థము:- అథ = పిమ్మట, వాయుమ్ = వాయువునుగూర్చి, వాయో! = ఓ వాయుదేవా! ఏతత్ = ఈ, యక్షమ్ = యక్షుడు, కిమితి = ఎవరైనదియును,

ఏతత్ = ఈవిషయమును, విజానీహి = తెలిసికొనుము, ఇతి = అని, అబ్రువన్ = పలికిరి.

తాత్పర్యము:- పిమ్మట దేవతలు వాయువును గాంచి యోయీ! ఈయక్షుని విషయము కనుగొని రమ్మని పలికిరి.

అష్టమమంత్రము

తథేతి త దభ్యద్రవ త్త మభ్యవద త్కోఽసీతి వాయు ర్వా అహ మస్మీ త్యబ్రవీ న్మాతరిశ్వా వా అహ మస్మీతి.

అర్థము:— వాయుః = వాయువు, తథేతి = అటులేయని, తత్ = ఆ యక్షునిగూర్చి, అభ్యద్రవత్ = పరువిడెను, యక్షమ్ = యక్షుడు, కోఽసీతి = ఎవడవని, తమ్ = వాయువునుగూర్చి, అభ్యవదత్ = పలికెను, అహమ్ = నేను, వాయుః వా = విసరెడివాడను, అస్మి = అగుచున్నాను, అహమ్ = నేను, మాతరిశ్వా వా = ఆకాశమునందు వృద్ధినొందువాడను, అస్మి = అగుచున్నాను, ఇతి = అని, వాయుః = వాయువు, అబ్రవీత్ = పలికెను,

తాత్పర్యము :— వాయు వటులే యని యక్షునియొద్దకు పరువిడెను. యక్షుడు వాయువును నీ వెవరవని యడిగెను. నేను వాయువు ననియును, మాతరిశ్వుడ ననియును సమాధాన మిచ్చెను.

నవమమంత్రము

తస్మిం స్త్వయి కిం వీర్య మి త్యపీదగ్ం సర్వ మాదదీయం య దిదం పృథివ్యామితి.

అర్థము :— తస్మిన్ = అట్టి, త్వయి = నీయందు, కిమ్ = ఏమి, వీర్యమ్ = సామర్థ్యము, అస్తి = కలదు, ఇతి = అని యక్షు డడిగెను. పృథివ్యామ్ = భూమియందు, య దిదమ్ = ఏయీపదార్థజాతము, అస్తి = కలదో, ఇదమ్ = ఈ, సర్వమపి = సమస్తమును, ఆదదీయమ్ = గ్రహింపగలను, ఇతి = అని వాయు వనెను.

తాత్పర్యము;— అట్టినీసామర్థ్య మేమని యక్షు డడుగ భూమియందలి సమస్తపదార్థములను గ్రహించగలనని వాయువు సమాధాన మిచ్చెను.

దశమమంత్రము

తస్మై తృణం నిదధా వేత దాదత్స్వేతి
త దుపప్రేయాయ సర్వజవేన త న్న శశా
కాదాతుం స తత ఏవ నివవృతే నైత
దశకం విజ్ఞాతుం య దేత ద్యక్ష మితి

అర్థము:- యక్షమ్ = యక్షుడు, ఏతత్ = దీనిని, ఆదత్స్వ = గ్రహింపుము, ఇతి = అని, తస్మై = వాయువునకు, తృణమ్ = గడ్డిపరకను, నిదధా = ఉంచెను. సః = ఆవాయువు, సర్వజవేన = తనసర్వవేగముతో, తత్ = ఆగడ్డిపరకను, ఉపప్రే యాయ = సమీపించెను. తత్ = ఆగడ్డిపరకను, ఆదాతుమ్ = గ్రహించుటకు, న శశాక = సమర్థుడు కాకపోయెను. తత ఏవ = అచటనుండి, నివవృతే = మరలి చనెను. ఏతత్ = ఈ, యక్షమ్ = యక్షుడు, య దితి = ఎవరైనదియు, విజ్ఞాతుమ్ = తెలిసికొనుటకు, నాశకమ్ = సమర్థుడను కాకపోతిని, ఇ త్యవదత్ = అని పలికెను.

తాత్పర్యము:- యక్షుడు దీనిని గ్రహింపుమని వాయువుముం దొకతృణము నుంచెను. వాయువు దానిని గ్రహించుటకు తనశక్తిని వినియోగించియు గ్రహిం పలేకపోయెను. అంత నాతడు మరలిచని యాత డెవరో తెలిసికొనజాలకపోతి నని వచించెను.

ఏకాదశమంత్రము

అ థేంద్ర మబ్రువన్ మఘవ న్నేత ద్విజానీహి కి మేత ద్యక్ష మితి
త థేతి త దభ్యద్రవ త్తస్మా త్తిరోదధే.

అర్థము :- అథ = పిమ్మట, దేవాః = దేవతలు, ఇంద్రమ్ = ఇంద్రునిగూర్చి, మఘవన్ = ఓయింద్రుడా !, ఏతద్యక్షమ్ = ఈయక్షుడు, కిమితి = ఎవరైనదియు, ఏతత్ = ఈవిషయమును, విజానీహి = తెలిసికొనుము, ఇతి = అని, అబ్రువన్ = పలికిరి, తథేతి = అటులేయని, ఇంద్రః = ఇంద్రుడు, తత్ = ఆయక్షునిగూర్చి, అభ్యద్రవత్ = పరువిడెను. తత్ = ఆయక్షుడు, తస్మాత్ = ఆయింద్రునినుండి, తిరోదధే = అంతర్థాన మొందెను.

తాత్పర్యము :— పిమ్మట దేవత లింద్రుని గాంచి యోయింద్రా! యక్షు డెవరో కనుగొమ్మని పలికిరి. ఇంద్రు డాయక్షుని సమీపింప నాత డంతర్ధాన మొందెను.

ద్వాదశమంత్రము

స తస్మిన్నే వాకాశే స్త్రియ మాజగామ బహుశోభమానా ముమాం హైమవతీం తాగ్ం హోవాచ కి మేత ద్యక్షమితి.

అర్థము :— సః = ఆయింద్రుడు, తస్మిన్ = ఆ, ఆకాశే ఏవ = ఆకాశమునందే, బహుశోభమానామ్ = మిక్కిలి ప్రకాశించుచున్నదియును, స్త్రియమ్ = స్త్రీయగు, హైమవతీమ్ = హిమవంతుని కుమార్తెయగు, ఉమామ్ = బ్రహ్మవిద్యారూపిణియగు పార్వతినిగూర్చి, ఆజగామ = వచ్చెను. ఏత ద్యక్షమ్ = ఈయక్షుడు, కిమితి = ఎవరని, తామ్ = ఆ పార్వతినిగూర్చి, ఉవాచ = పలికెను.

తాత్పర్యము:— అంత నాయింద్రు డాకాశమున బ్రహ్మవిద్యారూపిణియగు పార్వతిని గాంచి యాయక్షు డెవరని యడిగెను.

ఓమ్

కేనోపనిషత్తు

చతుర్థఖండము - ప్రథమమంత్రము

సా బ్రహ్మేతి హోవాచ బ్రహ్మణో వా ఏతద్విజయే మహీయధ్వ మితి తతో హైవ విదాంచకార బ్రహ్మేతి

అర్థము:- సా = ఆమె, బ్రహ్మేతి = బ్రహ్మ యనియును, బ్రహ్మణో వా = బ్రహ్మయొక్క, ఏతద్విజయే = ఈ విజయమునందు, మహీయధ్వ మితి = మహిమాన్వితు లైతిరనియును, ఉవాచ = చెప్పెను. ఇంద్రః = ఇంద్రుడు, తతో హ వా = ఆ పార్వతీదేవి వాక్యమువలన, బ్రహ్మేతి = బ్రహ్మయని, విదాంచకార = తెలిసికొనెను.

తాత్పర్యము:- పార్వతి యింద్రునితో నీ యక్షుడు పరమేశ్వరు డనియును, పరమేశ్వరుడే యీ విజయమునకు కారణ మనియును వచించెను. అంత నింద్రుడును నాయక్షరూపమున వచ్చినది పరమేశ్వరు డని తెలిసికొనెను.

ద్వితీయమంత్రము

తస్మా ద్వా ఏతే దేవా అతితరా మి వాన్యా న్దేవాన్ యదగ్ని ర్వాయు రింద్ర స్తే హ్యేన న్నేదిష్ఠం పస్పర్శు స్తే హ్యేన త్ప్రథమా విదాం చకార బ్రహ్మేతి

అర్థము :- యత్ = ఏకారణమువలన, అగ్నిః = అగ్నియును, వాయుః = వాయువును, ఇంద్రః = ఇంద్రుడునను, తేహి = ఆముగ్గురు, ఏనత్ = ఈయక్షుని, నేదిష్ఠమ్ = సమీపస్థునిగా = పస్పర్శుః = స్పృశించిరి. తేహి = ఆముగ్గురును, ఏనత్ = ఈయక్షుని, ప్రథమాః = మొదటివారుగా, బ్రహ్మేతి = బ్రహ్మయని, విదాంచకార = తెలిసికొనిరో, తస్మా ద్వా = ఆకారణమువలన, ఏతే = ఈ, దేవాః = అగ్నివాయ్వింద్రులు, అన్యాన్ = ఇతరులగు, దేవాన్ = దేవతలను, అతితరా మివ = అతిక్రమించినవారివలె నున్నారు.

తాత్పర్యము :- అగ్నివాయ్వింద్రులు మూవురును యక్షరూపమున నావిర్భవించిన పరమేశ్వరునివిషయము తెలిసికొనుటకై యాతని సమీపించుటచే నితరదేవతలకన్న నధికులైరి.

తృతీయమంత్రము

తస్మా ద్వా ఇంద్రోఽతితరా మి వాన్యాన్ దేవాన్ స హ్యేన న్నేదిష్ఠం పస్పర్శ స హ్యేన త్ప్రథమో విదాంచకార బ్రహ్మేతి

అర్థము - స హి = ఆయింద్రుడు, ఏనత్ = ఈయక్షుని, నేదిష్ఠమ్ = సమీపస్థునిగా, పస్పర్శ = స్పృశించెను. స హి = ఆతడు, ఏనత్ = ఈయక్షుని, ప్రథమః మొదటివాడై బ్రహ్మేతి = బ్రహ్మయని, విదాంచకార = తెలిసికొనెను. తస్మాత్ ఆకారణమువలన, ఇంద్రః = ఇంద్రుడు, అన్యాన్ = ఇతరులగు, దేవాన్ = దేవతలను, అతితరా మివ = అతిక్రమించినవానివలె నున్నాడు.

తాత్పర్యము :- అగ్నివాయ్వింద్రులు మూవురిలో నింద్రుడగ్నివాయువులకన్న నధికముగా పరమేశ్వరవిషయము తెలిసికొనుటచే వారికన్న నధికుడాయెను.

వివరణము

ఆఖ్యాయికయందు దేవరాక్షసయుద్ధమున దేవతలు విఱ్ఱవీగి శివానుగ్రహమువలన తా మీయుద్ధమున జయింపగలిగితిమను విషయమును మరచి విజయోత్సవమును గావించుకొనుచుండ గర్వము పతనహేతు వగుట పరమేశ్వరుడు దేవతలకు విషయపరిజ్ఞానము గలిగింపగోరి వారున్న ప్రదేశమునకు సమీపమున యక్షరూపమున సాక్షాత్కరించెను. ఆవచ్చిన దెవరో కనుగొనగోరి దేవత లగ్ని నాతని యొద్దకు బంపిరి. అగ్ని సమీపించినంత యక్షుడు నీ వెవరు? నీసామర్థ్య మేమని ప్రశ్నించెను. నే నీసర్వమును దహింపగలనని యగ్ని సమాధాన మిచ్చెను. అంత నాయక్షు డగ్నిముం దొకతృణము నుంచి దీనిని దహింపు మనెను. తనసామర్థ్యము నంతయు వినియోగించియు దానిని దహింపజాలక మరలి పోయి జరిగినవిషయమును జెప్పి తా నాయక్షు డెవరో తెలిసికొనజాలకపోతినని వచించెను. అంత దేవతలు వాయువును పంపిరి. వాయువును నాతృణమును కదలింపజాలక తిరిగి వచ్చి తనకును నావిషయము తెలియదని చెప్పెను. తరువాత దేవత లింద్రుని బంపిరి. కాని యక్షు డంతర్ధాన మొందెను. ఇంద్రుడు చేయునది లేక దెసలు పరికించుచుండ నాకాశమున హైమవతి ప్రత్యక్ష మయ్యెను.

ఇంద్రు డామెను యక్షవిషయమున ప్రశ్నింప నామె పరమేశ్వరుడే యక్షరూపమున సాక్షాత్కరించినా డనియును, నాతనియనుగ్రహమువలననే వారికి జయము లభించిన దనియును వచించి యంతర్ధాన మొందెను.

ఇయ్యది యాఖ్యాయికయొక్క సారాంశము. ఇక విషయవిమర్శ గావింతము. ఈయాఖ్యాయికయందు దేవతలకు గర్వభంగమై మఱల వారికి విషయపరిజ్ఞానము గలుగుట ప్రధానవిషయము. మఱియును నీ విషయము నాఖ్యాయికారూపమున వివరించుచు తద్ద్వారా పరమేశ్వ

రుని సర్వజగత్ప్రేరకత్వమును సిద్ధాంతీకరించుట కేనోపనిషత్తుయొక్క పరమాశయము.

ఉపనిషదారంభమునందు కేనేషితం పతతి ప్రేషితం మనః అను ప్రథమఖండప్రథమమంత్రముచే శిష్యప్రశ్నద్వారా సర్వేంద్రియప్రేరకత్వవిషయము ప్రస్తావింపబడి శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః అను గురువుయొక్క సమాధానముద్వారా సిద్ధాంతీకరింపబడినది ఈవిషయమే తృతీయఖండమున నాఖ్యాయికారూపమున ప్రపంచింపబడినది.

విజయోత్సవసమయమున యక్షు డావిర్భవించినంతనే దేవతలు తాము గావించుకొనుచున్న విజయోత్సవవిషయమునుగూడ మఱచి యక్షవిషయము కనుగొనుట కుద్యుక్తులైరి. కారణము యక్షరూపమున పరమేశ్వరదర్శన మగుటయే.

మొదట యక్షవిషయము తెలిసికొనుట కగ్నిని బంపిరి. అగ్ని యక్షునిచేత పరీక్షింపబడి వీతగర్వుడై మరలివచ్చినతరువాత వాయువును పంపుటయు, నాతడును నటులే వీతగర్వుడై మరలివచ్చుటయు జరిగినంతనే యింద్రుని బంపిరి. కాని యింద్రు డాప్రదేశమున కేగునప్పటికి యక్షు డంతర్ధాన మందెను. హైమవతి సాక్షాత్కరించి యక్షరూపమున వచ్చినది పరమేశ్వరు డని వచించెను.

అగ్నివాయ్వింద్రులు పరమేశ్వరునిసన్నిధి కేగుటచేతను, అగ్నివాయువులు యక్షునిచే పరీక్షింపబడి వీతగర్వు లగుటచేతను, యక్షు డంతర్ధానమొందినప్పటికిని హైమవతిని దర్శించి యామెవలన యక్షరూపమున వచ్చినది పరమేశ్వరు డని తెలిసికొనుటచేతను దేవతలందరిలో నగ్నివాయ్వింద్రులును, నీమువ్వురిలో నింద్రుడు నధికులుగా పరిగణింపబడిరి.

చతుర్థమంత్రము

త స్యైష ఆదేశో యదేత ద్విద్యుతో వ్యద్యుత దా3 ఇతీ న్న్యమీమిష దా3 ఇ త్యధిదైవతమ్

అర్థము:- యదేతత్ = ఏయీబ్రహ్మతత్త్వము, విద్యుతః ఆ = మెఱుపులవలె వ్యద్యుతత్ = ప్రకాశించెను ఇతి = అని, ఇత్ = మఱియును, న్యమీమిషత్ ఆ = కను మెఱగినదివలె నున్నది. ఇతి = అని. అధిదైవతమ్ = దేవతావిషయమై, ఏషః = ఇది, తస్య = ఆపరమేశ్వరునకు సంబంధించిన, ఆదేశః = ఉపదేశము.

తాత్పర్యము:- బ్రహ్మతత్త్వము మెఱుపులవలె ప్రకాశమానమైనదనియును మెఱుపువలె నంతలోనే నదృశ్య మగునదనియును ఇది దేవతావిషయకమైన యుపదేశము.

పంచమమంత్రము

అథా ధ్యాత్మం యదేత ద్గచ్ఛ తీవ చ మనో నేన చైత దుపస్మర త్యభీక్ష్ణం సంకల్పః

అర్థము:- అథ = పిమ్మట, అధ్యాత్మమ్ = ఆత్మవిషయకమైన యుపదేశము. మనః = మనస్సు, యదేతత్ = ఏయీబ్రహ్మతత్త్వమును, గచ్ఛతి ఇవ చ = పొందుచున్నదివలె నున్నదో, సంకల్పః = జీవుడు, అనేన = ఈమనస్సుచేత, ఏతత్ = ఈ బ్రహ్మతత్త్వమును, అభీక్ష్ణమ్ = ఎల్లప్పుడును, ఉపస్మరతి = దాదాపు స్మరించుచున్నాడు.

తాత్పర్యము ;- ఇక నధ్యాత్మోపదేశము గావింపబడుచున్నది. ఈబ్రహ్మతత్వమును మనస్సు పొందుచున్నదివలె నున్నది. మనస్సుచేత బ్రహ్మతత్వమును స్మరింపవలెనని జీవుని సంకల్పము.

వివరణము

గ్రంథారంభమున ప్రథమఖండప్రథమమంత్రమున నుపక్రమింపబడిన పరమేశ్వరునియొక్క సర్వజగత్ప్రేరకత్వరూప బ్రహ్మలింగము తృతీయఖండమున నాఖ్యాయికారూపమున సోదాహరణముగా ప్రపం

చింపబడినది. ఇక చతుర్థఖండమున ద్వితీయమంత్రమున నగ్నివాయ్వింద్రులు యక్షునివిషయము కనుగొనుట కాతనిసన్నిధి కేగుటచే దేవతామండలిలో శ్రేష్ఠులని ప్రతిపాదింపబడినది. తృతీయమంత్రమున నింద్రు డేగునప్పటికి యక్షు డంతర్ధానమందుటయు, నింద్రుడు నిర్విణ్ణుడై పరితపించుచుండ పార్వతీదేవి ప్రత్యక్షమై యక్షరూపమున వచ్చినది పరమేశ్వరుడని చెప్పుటచే నింద్రుడు సర్వశ్రేష్ఠుడైనవిషయము ప్రతిపాదింపబడినది. ఇక చతుర్థమంత్రమునం దధిదైవతవిషయమును, పంచమమంత్రమునం దధ్యాత్మవిషయమును ప్రతిపాదింపబడుచున్నది.

అధిదైవతమ్ — దైవతే అధిదైవతమ్ అని అధిదైవతశబ్దవిగ్రహము. అధిదైవత మనగా దేవతావిషయకమైన యని యర్థము.

అధిదైవతం ఏవ తస్య ఆదేశః — ఇది ఆపరమేశ్వరునికి సంబంధించిన దేవతావిషయకమైన యుపదేశము అని వాక్యార్థము.

'ద్వే వావ బ్రహ్మణో రూపే మూర్తం చ అమూర్తం చ' పరమేశ్వరునకు మూర్త మనియును, అమూర్త మనియును రెండు రూపము లున్నవని యీమంత్రము ప్రతిపాదించుచున్నది. పరమేశ్వరునిమూర్తరూపము జగత్తు. జీవునకు శరీర మధిష్ఠానమైనట్లు జగత్తు పరమేశ్వరుని కధిష్ఠానము. కాని యొకవిశేషము. జీవుడు శతధాకల్పితవాలాగ్రశతభాగతుల్యుడై శరీరైకదేశమగు హృదయైకదేశమున నున్నాడు. పరమేశ్వరుడు జగత్తునందలి ప్రత్యణువునందును నంతర్యామిగా నుండుటయే గాక జగత్తున కన్నిపార్శ్వములందును శిశువును గర్భ మావరించియున్నట్లావరించియున్నాడు. ఈవిషయము

వాయు ర్యథా సర్వభూతాంతరాత్మా
రూపం రూపం ప్రతిరూపో బభూవ
ఏక స్తథా సర్వభూతాంతరాత్మా
న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః

అను కఠమంత్రముచే సోదాహరణముగా ప్రతిపాదింపబడినది. ఇంకొక విషయము. జీవశరీరసమష్టికి పురుషశబ్దవ్యవహారమైనట్లు మూర్తామూర్తరూపద్వయసమష్టికే బ్రహ్మశబ్దవ్యవహారము. ఈవిషయము

శక్త్యాది చ పృథివ్యంతం జగ దేత చ్చరాచరమ్
విగ్రహం దేవదేవస్య పరమేశస్య శూలినః

అను శివపురాణవాయుసంహితావచనముచే ప్రతిపాదింపబడినది.

ముముక్షువు ప్రథమావస్థయందు సాయుజ్యాధిష్ఠానమగు హార్ద బ్రహ్మవిషయపరిజ్ఞానము లేకపోవుటచే పరమేశ్వరునిమూర్తరూపమగు జగత్తు నారాధించుట కారంభించి సమగ్రజగదారాధన మసంభవమని యెంచి పరమేశ్వరుని మూర్తరూపమగు లింగము నారాధించుచున్నాడు. లింగము జగద్భాగమగు పార్థివాంశము. దీనిని భౌతికములగు భస్మగంధాక్షతాదులచే నారాధించుచున్నాడు. ఇయ్యది పరమేశ్వర మూర్తరూపారాధన. ఇక నమూర్తరూపారాధనవిషయము గాంతము.

పరమేశ్వరుని యమూర్తరూపము సర్వేంద్రియాతీతము. ఈ విషయ మీయుపనిషత్తునందే

న తత్ర చక్షు ర్గచ్ఛతి న వా గ్గచ్ఛతి
నో మనో న విద్మో న విజానీమః

అను ప్రథమఖండ తృతీయమంత్రముచే ప్రతిపాదింపబడినది. ఈవిషయము నాలుగు ఐదు ఆరు ఏడు ఎనిమిది మంత్రములచే వివరింపబడినది. అయిన సర్వేంద్రియాతీతమును, మఱియును నేవిధముగను తెలిసికొనుటకు వీలులేని పరమేశ్వరుని యమూర్తరూపము నుపాసించు టెట్లు? స బాహ్యాభ్యంతరో హ్యజః—పరమేశ్వరుడు విశ్వమునకు బాహ్యాభ్యంతరములయం దున్నను తత్పరిజ్ఞానము ముముక్షువునకు శక్తికి మించిన విషయము. కావుననే ముముక్షువులయందలి యనుగ్రహముచే పరమేశ్వరుడు జీవాధిష్ఠానమైన శరీరమునందు హృదయమున నంగుష్ఠమాత్ర

పరిమాణరూపమున నున్నాడు. ఐనను ముముక్షు వీదహరాంతర్వర్తి నారాధించి యందు సాయుజ్యము నందుట దుష్కరము. కావుననే గురువు ప్రథమమున మూర్త్యారాధనము నుపదేశించినాడు. ఈయారా ధనము గావించుచుండ నాతనికి తాను గావించుచున్నది మూర్త్యారాధ నముగాని యమూర్త్యారాధనము గాదని తెలిసినది. అంత గురువును సమీపించి యాతనివలన

సత్య మేవ జయతే నానృతం
సత్యేన పంథా వితతో దేవయానః
యే నాక్రమంతి ఋషయో హ్యాప్త కామా
యత్ర త త్సత్యస్య పరమం నిధానమ్

హార్దబ్రహ్మవిషయము తెలిసికొని దేవయానమున పయనించి

యథోదకే శుద్ధే శుద్ధ మాసిక్తం తాదృ గేవ భవతి
ఏవం మునే ర్విజానత ఆత్మా భవతి గౌతమ!

శుద్ధోదకమున శుద్ధోదకము గలిసినట్లు హార్దబ్రహ్మయం దపునరావృ త్తముగ సాయుజ్యము నందును.

ఇక విషయవిమర్శ గావింతము. దేవతల విజయోత్సవసమయ మున వారిసమీపమునకు వచ్చిన యక్షుడు పరమేశ్వరుని మూర్తరూ పము. ఈయక్షుడే దేవతలు పంపిన యగ్నివాయువులను తృణపరీక్ష గావించి వారిగర్వమును తొలగించినవాడు. పరమేశ్వరుడు సనకాదు లకు దక్షిణామూర్తరూపమున తత్త్వోపదేశము గావించిన విషయము

చిత్రం వటతరో ర్మూలే వృద్ధాః శిష్యా గురు ర్యువా
గురో స్తు మౌనం వ్యాఖ్యానం శిష్యా స్తు చ్ఛిన్నసంశయాః

అను శ్లోకముచే ప్రతిపాదింపబడినది.

యక్షుడు దేవతలకు గర్వభంగము గావించి వెంటనే అదృశ్యు డైనాడు. మెఱుపు మెఱసి క్షణికమగు ప్రకాశము కల్పించి తద్ద్వారా

పదార్థజ్ఞానము గలిగించి వెంటనే యదృశ్య మైనట్లు యక్షుడును దేవతలయందలి యనుగ్రహముచే దర్శన మిచ్చి జ్ఞానావబోధకమైన గర్వమును తొలగించి వెంటనే మెఱుపువలె యంతర్ధాన మొందినాడు. ఈ విషయము మంత్రమునందలి విద్యుతో వ్యద్యుత దా ఇతీ న్యమీమిష దా అనువాక్యముచే ప్రతిపాదింపబడినది.

యక్షరూపమున గర్వభంగము గావించిన సర్వజగత్ప్రేరకుడు, సర్వజగచ్ఛాసకుడు పరమేశ్వరు డనువిషయము నుపదేశించుటచే నిది యధిదైవతోపదేశ మని వవ్యహరింపబడుచున్నది. అటులనే పారమేశ్వరమూర్తిరూపారాధనమును క్రమముగ దహరోపాసనమునకు మార్గదర్శి యగుటచే నియ్యదియును నధిదైవతోపదేశమే యగుచున్నది.

చతుర్థమంత్రమునం దధిదైవతోపదేశవిషయము వివరింపబడినది. ఈమంత్రమునం దధ్యాత్మోపదేశవిషయము వివరింపబడుచున్నది.

అధ్యాత్మమ్ :- ఆత్మని అధి అధ్యాత్మమ్ = ఆత్మయం దని యర్థము.

అతతి సర్వం సాతత్యేన గచ్ఛతీ త్యాత్మా=సర్వమును, ఎల్లప్పుడును పొందునది యని యాత్మశబ్దార్థము. ఈప్రకరణమున నాత్మ యనగా పరమేశ్వరు డని యర్థము. కావున నధ్యాత్మోపదేశ మనగా పరమేశ్వరవిషయమైన యుపదేశమని యర్థము.

ఏత తద్గచ్ఛ తీవ చ మనః :- మనస్సు దీనిని పొందుచున్నదివలె నున్న దని యర్థము.

ఈవాక్యమునందు ఇవ యనునవ్యయ మొకప్రత్యేకార్థమునందు ప్రయోగింపబడినది. గచ్ఛతి యనగా పొందుచున్న దని యర్థము. గచ్ఛతీవ పొందుచున్నదివలె నున్నది యనగా పొందుటలే దని యర్థము. కారణము మనస్సు చక్షురాదిద్వారా బహిఃప్రపంచసంబంధము కలి

గించుకొనుటలో సాధన మగుటయును, పరమేశ్వరతత్త్వము మనస్సున కందని దగుటయునే పరమేశ్వరతత్త్వము మనస్సున కందని దనువిషయము 'న తత్ర చక్షు ర్గచ్ఛతి న వా గ్గచ్ఛతి నో మనః' అను ప్రథమ ఖండతృతీయమంత్రముచే ప్రతిపాదింపబడినది. మనస్సు బహిఃప్రపంచ సాధన మనువిషయము 'మన సై వై తాన్ కామాన్ పశ్యన్ రమతే' అనుమంత్రముచే ప్రతిపాదింపబడినది.

అనేన చైత దుపస్మర త్యభీక్ష్ణం సంకల్పః - జీవు డీమనస్సుచేత నే యీబ్రహ్మతత్త్వమును చాదాపు స్మరించుచున్నా డని యర్థము.

సంకల్పః :- సమ్యక్ కల్పత ఇతి సంకల్పః = బాగుగాసంకల్పించు వా డని యర్థము.

ఈప్రకరణమున సంకల్పశబ్దమునకు జీవు డని యర్థము. జీవుడు శరీరమున నున్నంతవరకు శరీరపోషణాదికృత్యములకై సంకల్పించుచు, సంకల్పితకార్యసిద్ధికై మనోద్వారా చక్షురాదులను ప్రేరించి తద్ద్వారా బహిఃప్రపంచసంబంధము కలిగించుకొనుచున్నాడు. మనస్సును, చక్షు రాదులును బహిఃప్రపంచసంబంధమునమాత్రమే యుపయోగించు చున్నవి. ఇంతకన్న వానికి వేరు ప్రయోజన మేమియును లేదు. ఈ విమర్శచే మనస్సు బ్రహ్మజ్ఞానమున ననుపయుక్త మని తేలుచున్నది. కాని జీవుడు మనోద్వారా బ్రహ్మతత్త్వమును తెలిసికొనుటకు ప్రయత్నించుచున్నాడు. అనుపయోగియగు మనస్సు బ్రహ్మతత్త్వ పరిజ్ఞానమున సాధన మగుట యెట్లు? అనునది ప్రస్తుతప్రశ్న.

మనస్సు బ్రహ్మతత్త్వపరిజ్ఞానమున ననుపయోగియే యయినను జీవునకు సర్వజ్ఞానమునకును మూలకంద మనునది సందేహాతీతము. జీవునకు జ్ఞాతృత్వము సహజగుణమైనను జ్ఞానవ్యాపారము శరీరసంబంధ ముతోనే యారంభ మగుచున్నది. కేవలస్థితిలో ననగా శరీరసంబం

ధము కలుగక పూర్వము జ్ఞానవ్యాపారము లేదు. కారణము తద్వ్యాపారసాధనమైన మనస్సంబంధము లేకపోవుటయే.

జ్ఞానవ్యాపారము మనోద్వారా ఆరంభమైనతరువాతనే యాస్తికుడైనాడు. అనగా పరమేశ్వరుడున్నాడని భావింపగలిగినాడు. తద్విజ్ఞానార్థము గురువు నభిగమించి బ్రహ్మవిద్యావిషయ ముపదేశింపబడినాడు. మృత్యుమోక్షమును కోరి త్ర్యంబకారాధన మారంభించినాడు. లింగారాధనము గావించుచు 'నేదం య దిద ముపాసతే' ప్రతీకము బ్రహ్మ గాదని తెలిసికొని 'ప్రాణే ష్వంత ర్మనసో లింగ మాహుః' దహరాంతర్వర్తి లింగారాధన గావించుచు 'సత్యేన పంథా వితతో దేవయానః' దేవయానమార్గమున పయనించుట కారంభించి 'యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్' పరమేశ్వరుని చేరి 'యథోదకే శుద్ధే శుద్ధ మాసిక్తమ్' శుద్ధోదకమున శుద్ధోదకమువలె నపునరావృత్తముగ సాయుజ్యము నందినాడు.

ఈసమస్తమునకును ననగా ఆస్తికత్వమునుండి సాయుజ్యప్రాప్తి వఱకును – అధిష్ఠానమగు శరీరమును, సాధనమగు మనస్సును నత్యంతావశ్యకము లనునది పరమరాద్ధాంతము. కావుననే శరీర మాద్య ధర్మసాధన మని ప్రతిపాదింపబడినది. మఱియును నాత్మేంద్రియమనోయుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః అను వేదమంత్రము జీవేంద్రియమనస్సుష్టికే భోక్త యను వ్యవహారమని ప్రతిపాదించుచున్నది. ఇక మనోవిషయము గాంతము.

యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా
తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః

ఎవడు బ్రహ్మవిషయకపరిజ్ఞానము గలిగి యెల్లప్పుడును నధ్యాత్మయోగయుక్తమైన మనస్సుతో పరమేశ్వరు నుపాసించునో వాని కింద్రియము

లన్నియు సారథికి సదశ్వములవలె స్వాధీనములై యుండును. ఈవిధ ముగ నింద్రియముల నదుపులో నుంచికొని

యస్తు విజ్ఞానవాన్ భవతి సమనస్కః సదా శుచిః
స తు తత్పద మాప్నోతి యస్మా ద్భూయో న జాయతే

ఏయుపాసకుడు బ్రహ్మవిషయకపరిజ్ఞానము గలిగి యెల్లప్పుడును పరి శుద్ధుడై సమనస్కు డగునో యతడు పునరావృత్తిరహితమైన పదమును పొందును.

ఈకఠమంత్రములు ఇంద్రియజయమునకును, 'తత్పదప్రాప్తికిని' మనస్సంబంధావశ్యకతను సూచించుచున్నవి. కావున నాసాయుజ్యము మనస్సంబంధ మావశ్యక మని తేలుచున్నది.

ఇక విషయవిమర్శ గావింతము. మనస్సు లేనిది జ్ఞానవ్యాపారము లేదు. అదిలేనిది యుపాసనము లేదు. ఉపాసనము లేనిచో సాయుజ్యము లేదు. కావుననే కఠోపనిషత్తు ఇంద్రియజయమునకును, తత్పదప్రాప్తి కిని మనఆవశ్యకతను ప్రతిపాదించుచున్నది. ఇక మనశ్శబ్దార్థవిషయము గాంతము. మనశ్శబ్దమునకు జ్ఞానసాధనమైన భౌతికపరమాణు వర్థము. కాని యీప్రకరణమున మననము వివక్షింపబడినది. మనన మనగా జ్ఞాతవిషయము నావృత్తి చేయుట. 'అనేన చైత దుపస్మర త్యభీక్ష్ణం సంకల్పః' జీవుడు మననముచేత ఈబ్రహ్మతత్త్వమును ఎల్లప్పుడును స్మరించుచున్నాడు. ఈవిధముగ స్మరించుచు

అనంతే స్వర్గే లోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి

అనంతమును, సుఖకరమును, శ్రేష్ఠమును నగు హార్దబ్రహ్మలోకము నందు ప్రతిష్ఠ నందును. అనగా నపునరావృత్తముగ సాయుజ్యము నందును,

షష్ఠమంత్రము

తద్ధ తద్వనం నామ తద్వన మి త్యుపాసితవ్యమ్ స య ఏత దేవం
వే దాభిహైనం సర్వాణి భూతాని సంవాంఛంతి

అర్థము :- తత్ హ నామ = ఆబ్రహ్మతత్త్వమే, తత్ = ప్రసిద్ధమైన, వనమ్ = ఉపాస్యవస్తువు. తత్ = ఆబ్రహ్మతత్త్వము, వన మితి = ఉపాస్యవస్తువని, ఉపాసితవ్యమ్ = ఉపాసింపదగినది. సః యః = ఏవాడు, ఏతత్ = ఈబ్రహ్మతత్త్వమును, ఏవమ్ = ఈప్రకారముగా, వేద = ఉపాసించుచున్నాడో, ఏనమ్ = ఈయుపాసకుని, సర్వాణి = సమస్తములైన, భూతాని = భూతములు, అభిసంవాంఛంతి = కోరుచున్నవి.

తాత్పర్యము :- బ్రహ్మతత్త్వమే యుపాసింపదగినది. ఎవడు బ్రహ్మతత్త్వము నుపాసించుచున్నాడో వానిని సర్వభూతములును కోరుచున్నవి.

వివరణము

తద్ధ తద్వనం నామ – బ్రహ్మతత్త్వమే ప్రసిద్ధమైన యుపాస్య వస్తువని యర్థము.

వనమ్ – వన్యతే సంభజ్యతే అని వ్యుత్పత్తి. వన షణ సంభక్తౌ అను ధాతువునుండి నిష్పన్నమైన వనశబ్దమునకు ఉపాసింపబడిన దని యర్థము.

వాచాఽనభ్యుదితమ్ = వాక్కుచేత వర్ణింపనలవికానట్టియు, య న్మనసా న మనుతే = మనస్సుతో మననము చేయుటకు వీలు కానట్టియు, య చ్ఛ్రోత్రేణ నశృణోతి = చెవిచేత వినుటకు వీలు కానట్టియు, యత్ = ఏబ్రహ్మతత్త్వము కలదో, తత్ హ = ఆ బ్రహ్మతత్త్వమే, వనమ్ = ఉపాస్యవస్తువు. తత్ = అదియే వన మితి = ఉపాస్యవస్తు వని ఉపాసితవ్యమ్ = ఉపాసింపదగినది.

ఏవంవిధలక్షణవిశిష్టమైన వస్తువు నుపాసించుట యెట్లు? కావు ననే పరమానుగ్రాహకుడగు పరమేశ్వరుడు అంగుష్ఠమాత్రః పురుషో

మధ్య ఆత్మని తిష్ఠతి = జీవాధిష్ఠానమైన దహరమునందు అంగుష్ఠ మాత్రపరిమాణవిశిష్టుడై యధివసించియున్నాడు. ప్రథమావస్థయందు దహరోపాసనమును శక్తికి మించినవిషయమని యెంచియే పరమేశ్వరుడు బాహ్యారాధనోపయోగిలింగరూపమున నుపాసింపబడుచున్నాడు. బాహ్యారాధనము గావించుచు నేదం య దిద ముపాసతే=తా నారాధించుచున్న ప్రతీకము బ్రహ్మతత్త్వము గాదని యెంచి 'తస్మి న్యదంత స్త దుపాసితవ్యమ్' దహరాంతర్వర్తియగు అంగుష్ఠమాత్రుడగు పురుషు నుపాసించి 'యథోదకే శుద్ధే శుద్ధ మాసిక్తమ్' శుద్ధోదకమునందు శుద్ధోకమువలె లీనమై 'న స పున రావర్తతే' అపునరావృత్తస్థితి నందుచున్నాడు.

స య ఏత దేవం వే దాభిహైనం సర్వాణి భూతాని సంవాంఛంతి – ఈవిధముగ నుపాసించువానిని సర్వప్రాణులును కోరుచున్నారని యర్థము.

యదా సర్వే ప్రముచ్యంతే కామాః = సర్వసంకల్పత్యాగము గావించి సన్యాసయోగా ద్యతయః శుద్ధసత్త్వాః = కర్మఫలసన్యాసయోగము నవలంబించి చిత్తశుద్ధి గలిగి యే నాక్రమంతి ఋషయో హ్యాప్తకామాః = ఆప్తకాముడై దేవయానమార్గమున పయనించువానిని సర్వాణి భూతాని సంవాంఛతి = సర్వప్రాణులును కోరుదురు. దేవయానమార్గపరిజ్ఞానముగలవాడుగాన తత్పరిజ్ఞానము గలిగించుటలో సమర్థుడని యాతని నభిగమింతురని తాత్పర్యము.

సప్తమమంత్రము

ఉపనిషదం భో బ్రూ హీ త్యుక్తా య ఉపనిష ద్బ్రాహ్మీం వావ త ఉపనిషద మబ్రూ మేతి

అర్థము:– భో=ఓయీ! ఉపనిషదమ్=ఉపనిషత్తును, బ్రూహి=ప్రవచింపుము, ఇతి=అని, (అపృచ్ఛః=అడిగితివి). యా=ఏ, ఉపనిషత్=ఉపనిష

త్తుకలదో, సా = అది, ఉక్తా = ప్రవచింపబడినది. తే = నీకు, బ్రాహ్మీం వా వ = బ్రహ్మసంబంధమైన, ఉపనిషదమ్ = ఉపనిషత్తును, అబ్రూమ = ప్రవచించితిమి, ఇతి = అని, గురుః = గురువు, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- శిష్యుడు గురువును బ్రహ్మవిషయకోపదేశము గావింపుమని యడుగ బ్రహ్మకు సంబంధించిన యుపనిషత్తు నుపదేశించితి మని గురువు పలికెను.

అష్టమమంత్రము

తస్యై తపో దమః కర్మేతి ప్రతిష్ఠా వేదాః
సర్వాంగాని సత్య మాయతనమ్

అర్థము:- తస్యై = ఆయుపనిషత్తుకొఱకు, తపః = సాంతపనచాంద్రాయణాదికమును, దమః = బహిరింద్రియనిగ్రహమును, కర్మ = విహితకర్మయును, ప్రతిష్ఠా = స్థితిహేతువు. వేదాః = ఋగాదివేదములును, సర్వాంగాని = కల్పాదిషడంగములును, సత్యమ్ = సత్యమైన, ఆయతనమ్ = స్థానము.

తాత్పర్యము:- బ్రహ్మసంబంధమైన యుపనిషత్తుకొఱకు కృచ్ఛ్రచాంద్రాయణాదికమును, బహిరింద్రియనిగ్రహమును, సంధ్యాదివిహితకర్మలును, ఋగాదిసంహితలయొక్కయు, శిక్షాదిషడంగములయొక్కయు నధ్యయనమును ముముక్షువుల కావశ్యకములగు విషయములు.

వివరణము

ఉపనిషత్ :— జీవేశ్వరజగద్విషయకసమగ్రజ్ఞానమును గలిగించి సాయుజ్యోపయోగియగు నుపాసనామార్గమును బోధించు గ్రంథమున కుపనిషత్తని పేరు.

బ్రాహ్మీం వావ త ఉపనిషదమ్ :- బ్రహ్మసంబంధమైన యుపనిషత్తని యర్థము.

బృహతి బృంహయ తీతి బ్రహ్మ :— తాను విస్తరించి జీవ జగత్తులను విస్తరింపజేయునది యని బ్రహ్మశబ్దమున కర్థము. బ్రహ్మ శబ్దముచేత జీవజగదీశ్వరులు వివక్షింపబడుచున్నారు. కావున బ్రాహ్మ శబ్దమునకు జీవజగదీశ్వరులకు సంబంధించిన దని యర్థము. ఈ విషయము

శక్తిః శివ శ్చ సచ్ఛబ్దప్రకృతిప్రత్యయోదితౌ
తౌ బ్రహ్మ సామరస్యేన సమస్తజగదాత్మకౌ

అను శివపురాణవాయుసంహితావచనముచే ప్రతిపాదింపబడుచున్నది. నామరూపవిభాగానర్హస్థితియందు జీవుడు శరీరసంబంధములేని స్థితిలో జడప్రాయుడుగా నుండుటచే జగదంతర్భావ మంగీకరింపబడినది. కావున శక్తిశబ్దముచే జీవజగత్తులు గ్రహింపబడుచున్నవి.

ప్రథమమంత్రమునందలి కేనశబ్దముచే పరమేశ్వరుడును, మన శ్శబ్దముచే శరీరమును, వదంతి అనుక్రియచే తత్కర్తయగు జీవుడును గ్రహింపబడుచున్నారు. శిష్య ప్రశ్న జీవేశ్వరజగద్విషయసంబంధి కావున గురు వావిషయమును వివరించి యుపసంహారమున 'బ్రాహ్మీం వావ త ఉపనిషద మబ్రూమ' అని విషయోపసంహారము గావించినాడు.

పూర్వమంత్రమునందు జీవేశ్వరజగద్విషయక సమగ్రజ్ఞానప్రతి పాదకమైన యుపనిషద్విషయము ప్రస్తావింపబడినది. ఈమంత్రమునందు తదంగములు ప్రతిపాదింపబడుచున్నవి.

తపోదమకర్మ వేదతదంగము లుపనిషదంగములుగా నిర్ణయింప బడినవి. కేవలాధ్యయనముచేత నుపనిషత్తులకు సార్థక్యము గలుగదు. కావున నధ్యేతలు తత్ప్రతిపాదితవిషయముల నాచరణయం దుంచినపుడే యుపనిషదధ్యయనమునకు సార్థక్యము గలుగును. కావున నుపనిష దంగము లనగా నధ్యేతయగు ముముక్షువున కాచరణాంగములని పర మార్థము.

‘తపః కృచ్ఛ్రాది కర్మ చ’ = కృచ్ఛ్రాదివ్రతములకు తపస్సని పేరు. ‘కృచ్ఛ్రం సాంతపనాదికమ్’=సాంతపనాదివ్రతములకు కృచ్ఛ్రమని పేరు. కృచ్ఛ్రాతికృచ్ఛ్రము, చాంద్రాయణము, తప్తకృచ్ఛ్రము త్రిరాత్రకృచ్ఛ్రము, పరాకకృచ్ఛ్రము, ప్రాజాపత్యకృచ్ఛ్రము, సాంతపనకృచ్ఛ్రము అని కృచ్ఛ్ర మేడువిధములుగా నున్నది.

1. కృచ్ఛ్రాతికృచ్ఛ్రము — ఇరువదియొక్కదినములు పాలు త్రాగి యుండుట.

2. చాంద్రాయణము— వ్రతారంభమగు బహుళపాడ్యమినాడు పదునాలుగు కబళములు భుజించి విదియ మొదలుకొని క్రమముగ దినమున కొక కబళమువంతున తగ్గించుకొనుచు వచ్చి యమవసనా డేమియును దినక యుపవసింపవలయును. శుక్ల పాడ్యమినా డొకకబళము భుజించి విదియ మొదలుకొని యొక్కొక్క కబళమువంతున నెక్కువగ భుజించుచు పూర్ణిమతో వ్రతము సమాప్తి నొందింపవలయును. ఈ విధముగ నొకనెల యాచరించుటకు చాంద్రాయణకృచ్ఛ్ర మని పేరు.

3. తప్తకృచ్ఛ్రము — మూడుదినములు వేడినీరును, మూడు దినములు వేడిపాలును, మూడుదినములు వేడినేయియును త్రాగి, మూడుదినము లేమియును త్రాగక, తినక యుపవసించుటకు తప్త కృచ్ఛ్ర మని పేరు.

4. త్రిరాత్రకృచ్ఛ్రము — మూడుదినము లుపవసించుట.

5. పరాకకృచ్ఛ్రము — ఇతరచింతలు లేక నియమాన్వితుడై పండ్రెండుదినము లుపవసించుట.

6. ప్రాజాపత్యకృచ్ఛ్రము — మూడుదినము లుదయము మాత్రముభుజించి, మూడుదినములు సాయంకాలము భుజించి, మూడు దినము లయాచితముగ లబ్ధమైనదానిని భుజించి, మూడుదినము లేమియును భుజింపక యుపవసించుటకు ప్రాజాపత్యకృచ్ఛ్ర మని పేరు.

7. సాంతపనకృచ్ఛ్రము — గోమూత్రము, గోమయము, గోక్షీరము, గోదధి, గోఘృతము, కుశోదకము ననువాసిని క్రమముగ నొక్కొక్కదినము భుజించి యేడవనా డేమియును దినక యుపవసించు టకు సాంతపనకృచ్ఛ్ర మని వ్యవహారము.

ఈవ్రతము లన్నియును శరీరము కర్మాచరణమునకును తద్ద్వారా సాయుజ్యప్రాప్తికిని ననుకూలముగా నుండుటకై యాచరింపవలసినవి.

దమః — దమ మనగా బహిరింద్రియనిగ్రహము.

త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు బహిరింద్రియములు. వీని నదుపులోనుంచినగాని శరీర మారోగ్యవంతమై కర్మాచరణమున కనుకూలముగా, సమర్థముగా నుండదు. ఈయింద్రియములు విషయానుభవమునకై యుద్దేశింపబడినవి. శబ్దస్పర్శరూపరసగంధములువిషయములు వీనిమితానుభవమున శరీర మారోగ్యవంతమును, నమితానుభవమున రోగభూయిష్ఠమును నగును. కావున దమమును నాచరణాంగముగా ప్రతిపాదింపబడినది.

కర్మ — సంధ్యావందనాదివిహితకర్మ యని యర్థము.

కర్మలు రెండువిధములు — శారీరకము లని, విహితము లని. ఈ రెంటియందును నీప్రకరణమున విహితకర్మలుమాత్రమే వివక్షింపబడినవి. సంధ్యావందనాదులు శరీరారోగ్యమున కుపయోగపడుచు తద్ద్వారా మానసికాభ్యున్నతికి తోడ్పడుచున్నవి. కావున విహితకర్మలును నాచరణాంగములుగా ప్రతిపాదింపబడినవి.

వేదాః, సర్వాంగాని — ఋగాదిచతుస్సంహితలును, కల్పాది షడంగములు నని యర్థము.

సంహితాంగాధ్యయనమునగాని సమగ్రపరిజ్ఞానము గలుగదు. కావున నేతదధ్యయనమును నావశ్యకాంగముగా ప్రతిపాదింపబడినది.

సంహితలు కర్మకాండబహుళములు. ఋగ్వేదమునందు కర్మకాండకు సంబంధించిన విషయము లధికముగను, ఉపాసనాకాండకు సంబంధించిన విషయములు తక్కువగను నున్నవి. యజుర్వేదమునందు కర్మోపాసనా కాండలకు సంబంధించిన విషయములు దాదాపు సమానముగ నున్నవి. సామవేదము పరమేశ్వరస్తోత్రబహుళము. అథర్వణవేదమునందు కర్మో పాసనాకాండలకు సంబంధించిన విషయములు చాల తక్కువగ నున్నవి. లోకవ్యవహారమునకు సంబంధించిన విషయము లధికముగ నున్నవి.

'అష్టవర్షం బ్రాహ్మణ ముపనీయీత త మధ్యాపయీత' అను శ్రుతి బ్రాహ్మణబాలున కెనిమిదవయేట నుపనయనము గావించి వేదా ధ్యయనము చేయింపవలయు నని శాసించుచున్నది. సంహితాధ్యయన ముతోబాటుగ సంగాధ్యయనమును గావింపవలయును.

శిక్షా వ్యాకరణం ఛందో నిరుక్తం జ్యోతిషం తథా
కల్ప శ్చేతి షడంగాని వేద స్యాహు ర్మనీషిణః

శిక్షావ్యాకరణఛందోనిరుక్తజ్యోతిషకల్పములనునారును వేదాంగములు ఇందు శిక్ష వర్ణస్వరములకును, వ్యాకరణము శబ్దముల సాధుత్వా సాధుత్వములకును, ఛంద స్సనుష్టుబాదివృత్తములకును, నిరుక్తము పదార్థ వాక్యార్థనిర్ణయమునకును, జ్యోతిషము వాస్తుముహూర్తము లకును, కల్పము యాగవిధానములకును సంబంధించినవి.

ఈవిధముగ బ్రహ్మచర్యాశ్రమకర్మల నాచరించుచు సంహితాం గాధ్యయనము గావించుచుండ

అక్షయ్యగ్ం హ వై చాతుర్మాస్యయాజినః
సుకృతం భవతి

చాతుర్మాస్యయాగము గావించిన నక్షయ్యమగు సుకృతము గలుగు ననియును

త ద్యథేహ కర్మచితో లోకః క్షీయతే
ఏవ మే వాముత్ర పుణ్యచితో లోకః క్షీయతే

కర్మచితలోకములవలె పుణ్యచితలోకములును నశించుననుపరస్పరవిరుద్ధవాక్యములను గాంచుటచే సంశయము గలిగినది. మఱియును

స త్వ మగ్నిం స్వర్గ్య మధ్యేషి మృత్యో!
ప్రబ్రూహి త్వం శ్రద్దధానాయ మహ్యమ్
స్వర్గలోకా అమృతత్వం భజంత
ఏత ద్ద్వితీయేన వృణే వరేణ

అనుశ్రుతి స్వర్గ్యాగ్నిచయనమువలన నమృతత్వము లభించునని ప్రతిపాదించుచున్నది.

త్రియంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్
ఉర్వారుక మివ బంధనా న్మృత్యో ర్ముక్షీయ మామృతాత్

అనుశ్రుతి త్రియంబకయజనమువలన నమృతత్వము ప్రాప్తించునని బోధించుచున్నది. ఈవిధముగ పరస్పరవిరుద్ధముగనున్న వాక్యములను గాంచి సంశయాపనోదనమునకై గురువు నభిగమించినాడు. ఇంతియే గాదు.

పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో
నిర్వేద మాయా న్నా స్త్యకృతః కృతేన
తద్విజ్ఞానార్థం స గురు మే వాభిగచ్ఛే
త్సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్

లోకములు కర్మఫలవ్యాప్తము లనియు, నాకారణమువలన క్షయిష్ణువు లనియును, నకృతమగు సాయుజ్యము కర్మసాధ్యము గాదనియును నిర్ణయించికొని తద్విజ్ఞానార్థమ్=ఆవిషయమునకు సంబంధించిన విశేషజ్ఞానముకొఱకు సమిత్పాణియై శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడును నగు గురువు నభిగమించి 'ఉపనిషదం భో బ్రూహి' = ఉపనిషత్తు నుపదే

శింపు మని ప్రార్థించినాడు. గురువును 'బ్రాహ్మీం వావ త ఉపనిషద మబ్రూమ'=నీకు బ్రహ్మకు సంబంధించిన యుపనిషత్తు నుపదేశించితి మని సమాధానము చెప్పినాడు. ఈవిషయమే సప్తమమంత్రమునందు ప్రతిపాదింపబడినది.

నవమమంత్రము

యో వా ఏతా మేవం వే దాపహత్య పాప్మాన మనంతే
స్వర్గే లోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి

అర్థము:- యః వా = ఏముముక్షువు, ఏతామ్ = ఈయుపనిషత్తును, ఏవమ్ = ఈప్రకారము, వేద = తెలిసికొనుచున్నాడో, సః = ఆతడు, పాప్మానమ్ = పాపమును, అపహత్య = విడిచి, అనంతే = అంతములేనిదియును, జ్యేయే = మిక్కిలి శ్రేష్ఠమైనదియును, స్వర్గే = సుఖకరమైన, లోకే = బ్రహ్మలోకమునందు, ప్రతితిష్ఠతి = ఉండును, ప్రతితిష్ఠతి = ఉండును.

తాత్పర్యము:- ఈయుపనిషత్తును గురుముఖతః అధ్యయనముచేసి తత్ప్రతిపాదితవిషయములను మననము చేయు ముముక్షువు కర్మబంధమును వీడి బ్రహ్మలోకమునందు శాశ్వతస్థితి నందును.

వివరణము

ఈమంత్రమే యుపనిషత్తునందలి యంతిమమంత్రము. ద్వితీయ ఖండమునందలి

ఇహ చే దవేదీ దథ సత్య మస్తి
న చే ది హావేదీ న్మహతీ వినష్టిః
భూతేషు భూతేషు విచిత్య ధీరాః
ప్రేత్యాస్మా ల్లోకా దమృతా భవంతి

అను నుపసంహారమంత్రమునందు అమృతీభవనము ఫలముగా ప్రతిపాదింపబడినది. ఈమంత్రమునందు అమృతీభవనానంతరస్థితి వర్ణింపబడుచున్నది.

ఏతా మేవం వేద :- ఈయుపనిషత్తు నీవిధముగా తెలిసికొను చున్నా డని యర్థము.

ఏవమ్=ఈప్రకారముగా నని యర్థము. అనగా గురూపదిష్ట మార్గమున నని యర్థము. గురూపదేశము లేనిది విషయజ్ఞానము గలుగుట యసంభవము. ఈవిషయము ఛాందోగ్యమున సోదాహరణముగా చక్కగా ప్రతిపాదింపబడినది.

> యథా సోమ్య! పురుషం గంధారేభ్యోభినద్ధాక్ష మానీయ తం తతోఽతిజనే విసృజే త్స యథా తత్ర ప్రాఙ్వోద ఙ్వాధరా ఙ్వా ప్రధ్మాయీా తాభినద్ధాక్ష ఆనీతోఽభినద్ధాక్షో విసృష్టః. తస్య యథాభినహనం ప్రముచ్య ప్రబ్రూయా దేతాం దిశం గంధారా ఏతాం దిశం వ్రజేతి స గ్రామా ద్గ్రామం పృచ్ఛన్ పండితో మేథావీ గంధారా నే వోపసంపద్యే త్తైవ మే వేహాచార్యవా న్పురుషో వేద

గంధారదేశవాసియగు నొకనిని దొంగలు కన్నులకు గంతలు గట్టి తీసికొనివచ్చి యొకనిర్జనారణ్యమునందు విడిచి వెళ్ళిరి. అంత నాతడు కన్నులకు గంతలు కట్టి తీసికొనివచ్చి గంతలతోనే విడిచివెళ్ళినారనుచు నన్నిదిక్కులకు పరువిడుచు నరచుచుండెను. అంతలో నాదారిన బోవు దయామయుఁ డొక డాతనికట్లు విప్పి యీదిశగ గంధారమున్నది. గ్రామములందు దారి నడుగుచు నేగిన గంధారము చేరగలనని చెప్పెను. ఆవిధముగ నడుగుచు గ్రామమునుండి గ్రామము చేరుచు తనయింటికి చేరి సుఖించినట్లు ఆచార్యవంతుడగువాడు విషయపరిజ్ఞానముగలవా డగునని చెప్పెను.

కట్లు విప్పి గంధారదేశమునకు మార్గమును తెలియబరచకున్నచో గంధారవాసి స్వదేశమును చేరి సుఖించుట యసంభవము. అటులే కర్మవశమున పరమేశ్వరునకు దూరమై సంసరణచక్రమున

దగుల్కొని పరితపించుచున్న జీవునకు స్వవిషయమును, పరమేశ్వర విషయమును, పరమేశ్వరునినుండి దూరమైనవిషయమును, మఱల నాతని జేరి సుఖించుమార్గము నాచార్యుడు తెలియబర్చకున్న నీసంసార సముద్రమునందు మునకలు వేయుచున్న ముముక్షువునకు తరించుట కవకాశమే లేదు. కావుననే ముముక్షువున కాచార్యావశ్యకతయెంతేని గలదని తేలుచున్నది. వేద = తెలిసికొనుచున్నా డని యర్థము.

ఉపనిషత్సంప్రదాయమున జ్ఞానార్థకములగు ధాతువులు ఛాగపశున్యాయమున నుపాసనయందు సమన్వయింపబడినవి. కాని ప్రకృత ప్రకరణమున వేదనము మననమందు పర్యవసించుచున్నది. తెలిసికొనిన విషయమును మననము చేయుచున్నగాని వేదితవిషయమునకు స్థిరత యేర్పడదు.

ఏతా మేవం వేద – ఈయుపనిషత్తు నీవిధముగ మననము చేయుచున్నా డని యర్థము. కాని కేవలమననము ప్రయోజనకారి కాదు. ఉపనిషదధ్యయనపరమప్రయోజనము సాయుజ్య మనునది నిర్వివాదము. కేవలాధ్యయనమాత్రమున సాధింపదగిన దేదియును లేదు. అధ్యయనమువలన విషయపరిజ్ఞానమును, విషయపరిజ్ఞానము కలిగిన తరువాత తత్ప్రతిపాదితకర్మాచరణమును క్రమముగ నలవడినగాని యధ్యయనమునకు ప్రయోజన ముండదు. ఇంతియే గాదు. కేవల కర్మాచరణమాత్రమునను సాయుజ్యప్రాప్తి గాదు. కర్మలు సంసరణాపాదకములు. అనగా జననమరణపరంపరాపాదకములు. ఈవిషయము తెలిసికొని విరక్తుడై యీజన్మయందే సాయుజ్యమును సాధించుటకై యత్నింపవలయును. కావున నీవాక్యమునందలి వేద యనుక్రియకు కేవలవేదన మర్థము గాదనియును, వేదన ముపాసనయందు పర్యవసించిననే యధ్యయనము సార్థక మగుననియును తేలుచున్నది.

పాప్మాన మపహత్య:– పాపమును విడిచి యని యర్థము.

ఈమంత్రమునందలి పాప్మశబ్దము పుణ్యమున కుపలక్షకము. పాపమువలె పుణ్యమును ప్రతిబంధకమే ఈరెంటిసంబంధమును వదలించికొనినగాని యమృతత్వమున కవకాశము లేదు. పుణ్యపాపసంబంధమున్నంతవఱకును పునర్భవము తప్పదు. పాపానుభవమునకు నరకము స్థానమైనట్లు పుణ్యానుభవమునకు స్వర్గాదులు స్థానములు. పుణ్యపాపముల సమగ్రఫలము నేజన్మయందును సమగ్రముగ ననుభవించుట కవకాశము లేదు. ప్రతిజన్మాంతమునను ననుభూతపుణ్యపాపకర్మల ఫలము సంచితరూపమున నిలువయుండును. సంచితభాగము నాధారముగా గొనియే మఱల జన్మ సంభవించుచుండును. కావున పుణ్యపాపసంబంధమును వదలించికొనుట అపునర్భవదృష్ట్యా యత్యంతావశ్యక మగుచున్నది.

అయిన వీనిసంబంధము వదలించికొనుట యెట్లు ?

ఉపాసనారంగప్రవేశమైనతరువాత ముముక్షువు తత్ప్రయుక్త కర్మలుమాత్రమే యాచరించుచుండును. కాన తత్కాలమున నాతనికి పుణ్యపాపములతో సంబంధమే లేదు. కారణము స్వార్థపరత నశించుటయే. స్వార్థపరత్వ మున్నగాని కర్మలకు పుణ్యపాపప్రసక్తి యుండదు. ఉపాసనారంగప్రవేశమునకు పూర్వ మీజన్మమున గావింపబడిన కర్మలున్నవి. వానిఫలము ననుభవింపవలయును. సంచిత మున్నది. ఈరెంటి సంబంధము వదలినగాని మృత్యుమోక్షపూర్వకాపునర్భవమున కవకాశము లేదు, ఇవి యున్నంతవఱకును వీని ననుసరించి పునర్భవమును, తత్పూర్వము మృత్యువును తప్పవు. మృత్యుమోక్షపూర్వకాపునర్భవము కావలయునన్న ముందు వీనిసంబంధము వదలించుకొనవలయును.

సంచితప్రారబ్ధాగామివివరణము

ఈసందర్భమున నొకవిషయము ప్రధానముగా గమనింపవలయును ప్రస్తుతప్రకరణమున కర్మవిషయమును చక్కగా వివరించినగాని

విషయము సుబోధము గాదు. కర్మ సంచిత ప్రారబ్ధాగామిభేదములచే త్రివిధము. సంచిత మనగా కూడబెట్టినది. ప్రారబ్ధ మనగా నారంభింప బడినది. ఆగామి యనగా రాబోవునది.

సంచితము

కర్మ యనగా చేయబడినది యని యర్థము. ఎవరిచేత? జడము లందు కర్తృత్వ మనుపపన్నముగాన చేతనులచేత నని సమాధానము చేతను లనగా నెవరు? ఉపనిషత్సిద్ధాంతమున జీవేశ్వరు లిద్దరే చేతనులు. ఈయధికరణమున జీవులే ప్రకృతులు. కావున కర్తృత్వవిశిష్టులు జీవులనియే చెప్పవలయును. కేవలజీవుల కనగా శరీరవిశిష్టులుగాని జీవులకు కర్తృత్వము లేదు. కారణము సాధనమగు శరీరము లేకపోవుటయే 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్' అనువాక్య మీవిషయమునే ప్రతిపాదించుచున్నది. ఛేదనసాధనమగు పరశువు లేనిది ఛేదన మసంభవ మైనట్లు కర్మసాధనమగు శరీరము లేనిది జీవునకు కర్తృత్వము లేదు. కావున జీవులు శరీరము నధిష్ఠించి కర్మ లాచరించుచున్నారు. కాని యిచట నొకసందేహమునకు తా వున్నది. జీవుల కీశరీరరూపాధిష్ఠాన సంబంధ మెట్లు గలిగినది? ఈజన్మకు పూర్వజన్మ కారణ మనునది యనుభవసిద్ధమును, ప్రామాణికమును నయిన ప్రథమశరీరసంబంధ మెట్లు కలిగిన దను శంక మిగిలియేయున్నది. ప్రథమశరీరము పరమేశ్వరానుగ్రహలబ్ధ మనువిషయము ముండకోపనిషత్తునందు ద్వితీయ ముండక ప్రథమఖండమున నిర్ణయింపబడినది.

ప్రథమశరీరసృష్టి

ఏతస్మా జ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ
ఖం వాయు ర్జ్యోతి రాపః పృథివీ.విశ్వస్య ధారిణీ

ఈమంత్రము పరమేశ్వరుడు జీవులను, మనస్సును, త్వగాదిజ్ఞానేంద్రియ పంచకమును, వాగాదికర్మేంద్రియపంచకమును, పృథివ్యప్తేజోవాయ్వా

కాశములను సృజించినట్లు ప్రతిపాదించుచున్నది. తరువాత పంచమ మంత్రము

తస్మా దగ్నిః సమిధో యస్య సూర్యః
సోమా త్పర్జన్య ఓషధయః పృథివ్యామ్
పుమాన్ రేతః సించతి యోషితాయాం
బహ్వీః ప్రజాః పురుషా త్సంప్రసూతాః

పరమేశ్వరు డగ్నిసమిత్సూర్యచంద్రమేఘఓషధులను సృజించినా డనియును, పురుషుడు స్త్రీయందు రేతఃసేచనము చేయుటవలన మైథున సృష్టి యారంభమైన దనియును ప్రతిపాదించుచున్నది.

ఇచట నొకవిషయము ప్రధానముగా గమనింపవలయును. ద్వితీయమంత్రమున మనఃసర్వేంద్రియసృష్టి ప్రతిపాదింపబడినది. ఐదవ మంత్రమున పుమాన్, స్త్రీశబ్దములు ప్రయోగింపబడినవి. కేవలజీవునియందుగాని, కేవలశరీరమునందుగాని యీశబ్దములకు ప్రయోగము లేదు. జీవయుక్తమగు స్థూలసూక్ష్మశరీరములకే స్త్రీపురుషశబ్దవ్యవహారము వాడుకలో నున్నది. జీవాపేతమగు శరీరమునకు శవ మను వ్యవహార మున్నది. పుంస్త్రీవ్యవహారము స్థూలసూక్ష్మశరీరసమష్టిప్రయుక్త మైనది. కేవలజీవున కీవ్యవహారము లేదు. కావున పరమేశ్వరుడే మనఇంద్రియములతో బాటు స్థూలశరీరమునుగూడ సృష్టించి 'తత్సృష్ట్వా త దేవానుప్రావిశత్' జీవునితో బాటుగ శరీరమున ప్రవేశించెనని తేలుచున్నది.

ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః

జీవేంద్రియమనస్సమష్టికే భోక్త యను వ్యవహారమని కఠోపనిషత్తు ప్రతిపాదించుచున్నది. ఇప్పటినుండియే కర్మసాధనమగు స్థూలసూక్ష్మాత్మక శరీరము లభించుటచే కర్మ ఆరంభమగును. కావున ప్రథమశరీరము పరమేశ్వరసృష్టమును, పరమేశ్వరానుగ్రహలబ్ధము నని తేలుచున్నది.

కర్మలు రెండువిధములు — పుణ్యకర్మ లని, పాపకర్మ లని. పరోపకారకములు పుణ్యకర్మలని, పరాపకారకములు పాపకర్మలని వ్యవహారము. ఇయ్యది సాంఘికదృష్టి ననుసరించి వచ్చిన వ్యవహారము. మతదృష్ట్యా విహితకర్మలని యింకొక విభాగము గలదు. విహితకర్మ లాచరించిన పుణ్యము లేదు. కాని యాచరింపకున్న ప్రత్యవాయము తప్పదు. విహితకర్మలలోనివే నైమిత్తికములు. ఇవియును నాచరింపకున్న ప్రత్యవాయాపాదకములే. కామ్యము లాచరించిన పుణ్యము నుత్పాదించి తద్ద్వారా ఊర్ధ్వలోకప్రాపకము లగుచున్నవి. ఆచరింపకున్న నేవిధమగు ప్రత్యవాయమును లేదు.

పరమేశ్వరసృష్టి ననుసరించి 'శతమితి శతం దీర్ఘమాయుః' అను శ్రుతివలన మానవపరమాయుర్దాయము నూరుసంవత్సరములు. ఇందు బాల్యయౌవనకౌమారవార్ధకము లని నాలుగవస్థలు. ఆయురంతమున మరణము — జీవునకు శరీరవియోగము.

యథా చ మరణం ప్రాప్య ఆత్మా భవతి గౌతమ!
యోని మన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః
స్థాణు మన్యేనుసంయంతి యథాకర్మ యథాశ్రుతమ్

అను కఠమంత్రముల ననుసరించి మరణాంతమున యథాకర్మ = ప్రథమశరీరప్రాప్త్యనంతరమున నాచరింపబడిన కర్మ ననుసరించి మఱల చేతనజన్మయో, యచేతనజన్మయో సంభవించును. ఇయ్యది ద్వితీయ జన్మ. తరువాత జన్మపరంపర. ద్వితీయజన్మ ప్రభృతి యన్నియును కర్మోపాత్తములే.

సంచితము

ఇక సంచితవిషయము గాంతము. సంచిత మనగా కూడబెట్టిన దని యర్థము. ప్రథమజన్మ పరమేశ్వరానుగ్రహలబ్ధ మగుటచే తత్పూర్వము కర్మ లేదు. ప్రథమశరీర ప్రాప్తితరువాత కర్మారంభ మైనది.

మరణమువఱకు కర్మ లాచరించినాడు. నిర్ణీతకాలాంతమున మరణించినాడు. పుణ్యపాపాపాదకములు, ప్రత్యవాయజనకములగు కర్మ లాచరించినాడు. వీనిఫలము కొంతవఱ కాజన్మయందే యనుభవించినాడు. ఏజన్మయందలి కర్మఫల మాజన్మయందే యనుభవింపవలయునను నియమములేదు. మఱియును నాజన్మయందే యనుభవించుట కవకాశమును లేదు. ఇంతియేగాదు, కామ్యకర్మలగు జ్యోతిష్టోమాదులఫలము స్వర్గాదులయం దనుభవింపవలయును. ఈశరీరముతో లోకాంతరములయందు కర్మఫలము ననుభవించుట కవకాశము లేదు. కావున నీశరీరము నిచ్చటనే విడిచి లోకాంతరముల కేగవలయును. కర్మానుభవమునకై స్వర్గమున భోగశరీరమును, నరకమున యాతనాశరీరమును నొసంగబడును. ఆయాలోకములయం దాయాఫలము ననుభవించిన తరువాత

నాకస్య పృష్ఠే తే సుకృతేనుభూ
త్వేమం లోకం హీనతరం వా విశంతి

ఈలోకమునుగాని, యింతకన్న హీనతరమగులోకమునుగాని ప్రవేశించును. ఈమంత్రమునందలి సుకృతశబ్దము పాపమున కుపలక్షకము.

ప్రథమజన్మకృత యావత్కర్మఫలమును మరణానంతరమున స్వర్గనరకాదులయందు సమగ్రముగా ననుభవించుట కవకాశము లేదు. ఒకవేళ ననుభవించుట కవకాశమున్న మఱల జన్మ కవకాశమేయుండదు. యావత్కర్మఫలానుభవావకాశాభావము పరమేశ్వరనిర్ణయము. ఈ నిర్ణయము ననుసరించి కొంత నిలువయుండును. దీనికే సంచిత మని వ్యవహారము. ఈసంచితము కేవలపుణ్యమేయైన నందు కొంతకర్మ ననుసరించి భూరాదిలోకములందు

యోని మన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః
స్థాణు మన్యేనుసంయంతి యథాకర్మ యథాశ్రుతమ్

ఉత్తమజన్మను, పాపమే నిలువయున్న తదనుసారముగ హీనజన్మను, పాపమును నత్యంతాధికముగనున్న స్థాణ్వాదిజన్మను పొందును. స్థాణువులుగూడ జీవవిశిష్టము లనుట యార్యసంప్రదాయము.

ప్రారబ్ధము

ఇప్పటివఱకును సంచితవిషయము వివరించినాము. ఇక ప్రారబ్ధవిషయము గాంతము. ప్రారబ్ధ మనగా నారంభింపబడిన దని యర్థము. సంచితమునందలి కొంతకర్మ నాధారముగా జేసికొని యీజన్మయందలి శరీరము గైకొనబడిన దని వివరించినాము. కర్మోపాత్తమగు నీశరీరమునకే ప్రారబ్ధ మని పేరు, ఈవిషయము

మహతా పుణ్యపణ్యేన క్రీతేయం కాయనౌ స్త్వయా
యావ న్న భిద్యతే కాయ స్తావ త్పూజయ శంకరమ్

అను పురాణవచనముచే ప్రతిపాదింపబడినది. ఈప్రారబ్ధము పూర్వజన్మయందలి కర్మ ననుసరించి యుండును. పాపాధిక్యమున వచ్చిన జన్మమైనచో శరీర మంగవికలముగనో, రోగభూయిష్ఠముగనో యుండును. ఏవంవిధలోపభూయిష్ఠమగు శరీర మున్నంతవఱకును తత్ప్రయుక్తమైన బాధ లనుభవింపక తప్పదు.

ఆ గా మి

ఆగామి యనగా రాబోవునది యని యర్థము. ఆగామిశబ్దము సాపేక్షము. ఆగామి=రాబోవునది. ఎప్పటినుండి రాబోవునది? ఇది యొకజటిలమగు ప్రశ్న. కొంత యుపోద్ఘాతము చెప్పినగాని విషయము చక్కగా బోధపడదు. ఆగామి యనగా నొకసమయము హద్దుగా జేసికొని యప్పటినుండి రాబోవునది యని యర్థము. అయిన నాసమయ మేది?

సంచిత మనగా నిలువయున్నది. ప్రారబ్ధ మనగా నీజన్మతో నారంభింపబడినది. కావున నాగామి యారెంటిలోనను జేరదు. కావున నీజన్మయందలి కర్మకు సంబంధించినదియేయని చెప్పవలయును. ఈజన్మ యందు జన్మించినప్పటినుండి మరణించువఱకును ప్రాణి కర్మలు చేయు చునే యుండును. అయిన నీహద్దు ఎప్పటినుండి యేర్పడును?

న హి కశ్చిత్ క్షణ మపి జాతు తిష్ఠ త్యకర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః

ఎవడును, ఎప్పుడును, ఒకక్షణకాలమైనను నేకర్మయును చేయకుండ నుండలేడు. కారణము ప్రకృతికి బద్ధుడై యనగా శరీర మున్నంతవఱ కును నేదియో కర్మ చేయుచునేయుండవలసియుండుటయే. కాయిక వాచికకర్మల నాపవచ్చును. కాని మానసికకర్మ నాపుట కవకాశము లేదు. దీనినిగూడ నాపుట సంభవించిన కర్మసంబంధము పూర్తిగ తొలగిపోవును. కాని దీని నాపుట కవకాశము కలదా యనునది ప్రస్తుత ప్రశ్న.

మానసికకర్మ యనగా నేమో వివరించినగాని విషయము సుబో ధము గాదు. 'అన్నమయం హి సోమ్య మనః' అనుశ్రుతి ననుసరించి మనస్సు పార్థివపరిమాణు వని తెలియుచున్నది. కావున మనస్సు జడ మని చెప్పకతప్పదు. జడములకు కర్తృత్వము లేదుగాన మానసికకర్మ యనుట యనుపపన్నము. అయిన మానసికకర్మ యనగా నేమి? మన అవబోధనే అను ధాతువునుండి మన్యతే అనే నేతి మనః అను శబ్దము నిష్పన్నమైనది. ఈనిష్పత్తి ననుసరించి మనస్సు సాధనముమాత్రమే. సాధకుడగు జీవునకు సాధ్యమును సాధించుటలో మనస్సు సాధనము. మనశ్శబ్దమే మననము జీవునకు సంబంధించినదని తెలియజేయుచున్నది. కావున మానసికకర్మ యనగా జీవునకు సంబంధించిన సంకల్పరూపకర్మ యని తేలుచున్నది. ఈవిమర్శచే మానసికకర్మ నాపుట యనగా సంకల్ప

ముల నాపుటయని తేలుచున్నది. అయిన సంకల్పముల నాపుట సాధ్యమా యనునది ప్రస్తుత ప్రశ్న.

సంకల్పము లున్నంతవఱకును తత్పూర్తికై కర్మకరణము తప్పదు. కర్మ లాచరించుచున్నంతవఱకును పుణ్యాపాపసంబంధము తప్పదు. ఆ సంబంధ మున్నంతవఱకును నూర్ధ్వలోకగమనమును, జననమరణము లును తప్పవు. కావున సర్వమునకును సంకల్పము లాధారమని తేలు చున్నది. సంకల్పములు నశించిన కర్మలు లేవు. పుణ్యాపాపములు లేవు, ఊర్ధ్వలోకగమనము లేదు. మరణము లేదు, జననము లేదు.

శరీర మున్నంతవఱకును తత్పోషణ జరుగు చు నేయుండవలయును దానికై కర్మ తప్పదు. ప్రత్యవాయము గలుగకుండుటకై విహితకర్మ లును తప్పవు. విహితకర్మలను మానిన మానవచ్చునుగాని శారీరికకర్మలు మాత్రము తప్పవు. తత్ప్రయుక్తమైన పుణ్యాపాపసంబాధమును తప్పదు. అయిన శరీర ముండి తత్పోషణము జరుగుచు సంకల్పసంబంధము వద లించుకొనుట సాధ్యపడునా? ఇదియును నొక జటిలమగు సమస్యయే.

సంకల్పపూర్వకముగ నాచరించినను స్వార్థగంధ మున్నపుడే కర్మలకు పుణ్యాపాపసంబంధ ముండును. స్వార్థగంధరహితములైన ఔపా సానికకర్మలకు పుణ్యాపాపసంబంధము లేకపోవుటయేగాక యవి పరమేశ్వ రానుగ్రహోపాదకము లగును. ఇందుకు చండీశదక్షులే ప్రబలోదాహర ణము. స్వార్థగంధరహితుడై పరమేశ్వరోపాసన గావించుచు నుపా సనకు భంగము గావించిన తండ్రి పాదచ్ఛేదము గావించిన చండీశుడు శివానుగ్రహపాత్రుడైనాడు. దక్షుడో స్వార్థాంధుడై యనీశ్వరయా గము గావించి శివనిగ్రహమునకు గురియైనాడు. కావున నౌపాసనిక కర్మలు సంకల్పపూర్వకములైనను పునర్భవాపాదకములు గావని తేలు చున్నది.

ఇప్పటివఱకు నేమి సంభవించినది? సంకల్పబాహుళ్యము నశించి సాయుజ్యసంకల్ప మొకటిమాత్రము మిగిలినది.

యదా సర్వే ప్రముచ్యంతే కామా యేస్య హృది శ్రితాః
అథ మర్త్యోమృతో భవ త్యత్ర బ్రహ్మ సమశ్నుతే

కామ్యంతే ఇతికామాః = కామము లనగా సంకల్పములు. సర్వ సంకల్పనాశ మైనపుడు మర్త్యుడు అమృతు డగును. అనగా మరణింప నున్నవాడు మరణరహితు డగును. అత్ర = ఈజన్మయందే, ఈశరీరము నందే, దహరమునందే బ్రహ్మను పొందును. ఆపొందుటయు 'యథో దకే శుద్ధే శుద్ధ మాసి క్తమ్' శుద్ధోదకము శుద్ధోదకమును పొందునట్లు పొంది 'న స పున రావర్తతే న స పున రావర్తతే' తిరిగి యావృత్తిని పొందడు. 'ఇమం మానవం నాఽవర్తంతే' మఱల మానవాదిలోకము లందు జన్మింపడు.

సంకల్పపూర్వకముగ కర్మల నాచరించు జీవుడు సంకల్పరహితుడై అపునరావృత్తముగ హార్దబ్రహ్మయందు సాయుజ్యము నందినాడు. కాని శరీరమునుండి యుత్క్రమింపలేదు. ఇదివఱకు ప్రారబ్ధభోగాంత మున నుత్క్రమణము సంభవించుచుండెడిది. కాని ప్రారబ్ధ శేషమున్నది. అప్పటివఱకును శరీరము పోషింపబడుచుండవలసినదే. కాని సంకల్ప పూర్వకముగ పోషించుకొనుచున్న జీవుడు సంకల్పరహితుడై హార్ద బ్రహ్మయందు సాయుజ్యము నందినారు. అయిన శరీరపోషణ మెట్లు జరుగును?

డ్రైవరు ట్యాంకులో పెట్రోలు నింపి కారులో కూర్చుండి బ్రేకుమీద కా లుంచి చక్రము పట్టుకొని కారును స్టార్టు చేసినాడు. లోపల ప్రయాణికు లున్నారు. కారు నడుచుచున్నది. కాని దైవికముగ మనస్సు భ్రమించినది. ఆతనికి స్పృహలేకుండపోయినది. ఇతఃపూర్వము వలె నాతడు సంకల్పపూర్వకముగ కారును నడుపుటలేదు. కాని

యభ్యాసవశమున నన్నిపనులును జరిగిపోవుచున్నవి. బ్రేకును నొక్కుచు వేగము తగ్గించుచు హెచ్చించుచున్నాడు. ఎదుటనుండి వచ్చుచున్న కార్లను తప్పించుకొనుచున్నాడు. కాని యిందేదియును నాతడు సంకల్పపూర్వకముగ చేయుటలేదు. గమ్యస్థానమున కారు నాపినాడు. ప్రయాణికులు దిగి తమతమస్థానముల కేగినారు. కాని యాతడు కారునుండి దిగడు. కారుకు సంబంధించిన పనులుమాత్రము యథావిధిగ జరిగిపోయినవి. అయినను నాతడాభ్రమలోనే యున్నాడు. ఆతనిమనస్సాకవిషయమునందుమాత్రమే కేంద్రీకృతమై తద్భావములోనే నిమగ్నమై యుండుటచే కారునుండి దిగవలయునను సంకల్పముగాని, తదనుకూలప్రయత్నముగాని లేదు. ఈస్థితి యాతనిమనస్సాప్రయత్నమునుండి మరలినగాని మారదు.

ఇక ప్రకృతవిషయము మాలోచింతము. సంకల్పవిశిష్టుడై ప్రతికర్మయందును ప్రవృత్తిగలిగి తదనుగుణముగ కర్మల నొనర్చుచున్న జీవుడు మనస్సంబంధము వదల్చికొని సర్వకామవిముక్తుడై అమృతత్వమునంది హార్దబ్రహ్మయందు దపునరావృత్తముగ సాయుజ్యము నందినాడు. ఇతఃపూర్వ మాతడు సంకల్పానుగుణముగ మనస్సును ప్రేరించి తద్ద్వారా ఇంద్రియములను ప్రేరించి, బహిఃప్రపంచసంబంధము కలిగించుకొనుచు కర్మల నాచరించి తత్ఫలము ననుభవించుచుండెడివాడు. మఱియిప్పుడో

భిద్యతే హృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః
క్షీయంతే చాస్య కర్మాణి తస్మి న్దృష్టే పరావరే

హృదయగ్రంథిభేదన మైనది. అనగా మనస్సంబంధము వదలినది. నూటయొక్కనాడులు హృదయమునుండి బయలుదేరును. ఆ బయలుదేరుచోటునకే హృదయగ్రంథి యని పేరు. అదియే మనస్సునకు స్థానము. సంకల్పము గలిగినవెంటనే జీవుడు మనస్సు నచటనుండి సంకల్పానుగుణనాడియందు పంపి బహిఃప్రపంచసంబంధము గలిగించు

కొనుచుండును. యదా సర్వే ప్రముచ్యంతే కామా యేఽస్య హృది శ్రితాః – సర్వకామ(సంకల్ప)మోచన మైనది. కావున మనస్సంబంధము జీవునకు తొలగిపోయినది. అనగా హృదయగ్రంథిద్వారా మనస్సును ప్రేరించుట యాగిపోయినది. గ్రంథిభేదన మైనదనగా గ్రంథిసంబంధము తొలగిపోయినదని యర్థము. అయిన పోషకుడగు జీవుడు హార్దబ్రహ్మ యందు అపునరావృత్తముగ లీన మగుటచేతను, తత్కాలమందే శరీర త్యాగము గాకపోవుటచేతను శరీరపోషణము జరుగు టెట్లనుప్రశ్న మిగిలియున్నది డ్రైవరుమనస్సేకవిషయ కేంద్రీకృతమైనను పనులన్నియు సక్రమముగా నెరవేరినట్లు జీవుడు హార్దబ్రహ్మయందు లీనుడైనను శరీర కృత్యములు నెరవేరుచునేయుండును. ప్రారబ్ధభోగావసానమున శరీర త్యాగమైనపుడు శరీరమునందలి భూతములు పంచభూతములయందును హార్దాంతర్యామిబ్రహ్మయందు లీనుడైన జీవుడు మహాంతర్యామి యందును గలిసిపోవును.

జీవుడు హార్దబ్రహ్మయం దపునరావృత్తముగ సాయుజ్యము నందినాడు. కాని ప్రారబ్ధభోగావసానము గాలేదు. కావున శరీరత్యాగ మునకును, సాయుజ్యప్రాప్తికిని మధ్య కొంతకాల మున్నది. ఈకాలము నందును కర్మప్రసక్తి యున్నది. ఈకర్మలవిషయమునందును పుణ్యాపాప ప్రసక్తి యున్నది. ఈకర్మకే యాగామి యని యుపనిషత్సంప్రదాయ వ్యవహారము. అయిన నీకర్మలకు సంబంధించిన పుణ్యాపాపఫలము నెవ రనుభవింపవలయును? ఇవ్వవిసంకల్పపూర్వకముగ గావింపబడినకర్మలు గావు. కావున వీనియనుభవముతో జీవునకు సంబంధము లేదు. ఇక కర్మసాధనము శరీర మగుటచే భోక్తృత్వము శరీరమునకు సంబంధించి నదా యను విషయము గాంతము. శరీరము జడము. జడమగు శరీరము నందు భోక్తృత్వ మనుపపన్నము. అయిన నీకర్మలకు ఫలానుభవ ముతో సంబంధమే లేదా? ఇది యొకజటిలమగు సమస్య.

అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్

అనువాక్యము శుభాశుభకర్మలఫల మనుభవింపక తప్పదని ప్రతిపాదించు చున్నది. శరీరము జడముగాన శరీరమునందు భోక్తృత్వ మనుపపన్నము జీవు డపునరావృత్తముగ సాయుజ్యము నందినాడుగాన నాతనికనుభవ ముతో సంబంధము లేదు.

ప్రారబ్ధం భోగతో నశ్యే త్సంచితం జ్ఞానకర్మణా
ఆగామి భజ్యతే కర్మ తద్ద్వేషిప్రియవాదిభిః

అనుశ్లోకము ప్రారబ్ధ మనుభవమువలన నశించు ననియును, సంచిత ముపాసనవలన నశించు ననియును, నాగామి ద్వేషిప్రియవాదులచే పంచుకొనబడు ననియును ప్రతిపాదించుచున్నది. కాని యిది సంభవమా? ద్వేషి యనగా ద్వేషించినవాడు. ప్రియవాది యనగా స్తుతించినవాడు. ద్వేషించినవాడు పాపఫలమును, భూషించినవాడు పుణ్యఫలమును ననుభవించునని వాక్యార్థము. మంచిది. ఈపుణ్యాపాపము లెవరివి? వాక్యమునందలి యాగామిశబ్దముచే సంచితప్రారబ్ధము లెవరివో యాగామియును నాతనికి సంబంధించినదే యని తెలియుచున్నది. కావున సంచితము నుపాసనచే నశింపజేసికొనినవాని యాగామియే ద్వేషిప్రియవాదులచే ననుభవింపబడునని వాక్యార్థ మని యంగీకరింపక తప్పదు,

ఇచ్చట నొకవిషయము ప్రధానముగా గమనింపవలయును. నిందించుటవలన పాపము సంభవించుననునది లోకసిద్ధమగు విషయము. అయ్యది నిందించుటవలన సంభవించునదియే. కాని యెవరిని నిందించితిమో వారిదుష్కృత్యములకు సంబంధించిన పాపము నిందించినవారు పంచుకొనుట కవకాశ మున్నదా? ఇయ్యది కేవల మసంభవము. 'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్' అనువాక్య మెవరుగావించిన కర్మలఫలమును వారే యనుభవింపవలయునని ప్రతిపాదించుచున్నది. కావున ద్వేషిప్రియవాదులు వారినిందాస్తుతులకు సంబంధించిన ఫలమునే యనుభవింతురుగాని యితరుల పుణ్యాపాపఫలము పంచుకొనరని తేలుచున్నది.

అయిన 'ఆగామి భజ్యతే కర్మ' అనువాక్యముగతి యేమన్న విచారింతము. ఆగామి యనునది యున్న దానివిషయమున నాలోచింపవలసిన యావశ్యకత యున్నది. కాని సాయుజ్యమునందినవానివిషయమున నాగామికి ప్రసక్తియే లేదు. సాయుజ్యకామనతో నుపాసన గావించుచున్నకాలమున గావింపబడిన కర్మలకు ఫలానుభవముతో సంబంధము లేదు. ఈవిషయమున చండీశ్వరుడే ప్రబలోదాహరణము. ఉపాసనకు భంగము గలిగించినాడను కారణమువలన పితృపాదములు ఖండించియు శివానుగ్రహపాత్రుడైనాడు. కావున నుపాసనాకాలమున గావింపబడినకర్మలకు ఫలానుభవముతో సంబంధము లేదని తెలియుచున్నది. ఉపాసనాకాలమునందే సంకల్పపూర్వకముగ గావింపబడిన కర్మలకు ఫలానుభవముతో సంబంధము లేదని తెలియుచుండ సాయుజ్యము నందినతరువాత నాగామి యున్నదని సంభావించుటయే యనుపపన్నమని తెలియుచున్నది. ఈచర్చ నింతటితో విరమించి ప్రకృతమనుసరింతము.

అనంతే స్వర్గే లోకే జ్యేయే ప్రతితిష్ఠతి — అనంతమును, సుఖకరమును, శ్రేష్ఠమునునగు బ్రహ్మయందు ప్రతిష్ఠ నందు నని యర్థము.

అనంతే — అంతములేని యని యర్థము.

అంత మనగా చివర. అంతశబ్దము సాపేక్షము. ఆది నపేక్షించును. కావున ననంత మనగా ననాద్యనంతమని పర్యవసితార్థము.

అనాద్యనంతం మహతః పరం ధ్రువం
నిచాయ్య త న్మృత్యుముఖా త్ప్రముచ్యతే

అనుశ్రుతి బ్రహ్మతత్త్వ మనాద్యనంతమని ప్రతిపాదించుచున్నది.

స్వర్గే — సుపూర్వక అర్జ అర్జనే అనుధాతువునుండి సుఖమర్జ్యతే సుఖ మనుభూయత తేఽస్మి న్నితి స్వర్గః అనువ్యుత్పత్తి ననుసరించి నిష్పన్నమైన స్వర్గశబ్దమునకు సుఖము ననుభవించు స్థాన మని

యర్థము. స్వర్గశబ్దమునందలి సు అను నుపసర్గకు లెస్సగా నని యర్థము. సుఖము లెస్సగా ననుభవించుట యనగా నవిచ్ఛిన్నముగా ననుభవించుటయని యర్థము. హార్దబ్రహ్మసంబంధము గలిగినప్పటినుండి యనుభవింపబడు సుఖమునకు విచ్ఛిత్తి లే దని భావము.

ఉపాసనారంగప్రవేశమునకు పూర్వ మనుభవింపబడు సుఖములు వైషయికములు – అన్నియును క్షణికములు – తాత్కాలికములు. విషయానుభవజన్యమానసుఖము లనుభవాంతమున నశించును గాన నయ్యవి తాత్కాలికములు. కాని యుపాసనారంగమున ప్రవేశించినప్పటినుండి విషయజన్యసుఖసంబంధము వదలి పరమేశ్వరోపాసనానంద మారంభ మగును. ఈయానందమున కెట్టివిచ్ఛిత్తియును లేదని పరమార్థము.

లోకే :– లోకృ దర్శనే అనుధాతువునుండి లోక్యతే ఆలోక్యతే అనువ్యుత్పత్తి ననుసరించి నిష్పన్నమైన లోకశబ్దమునకు చూడబడునదని యర్థము.

ఈవాక్యమునందు లోకశబ్దమునకు అనంత స్వర్గ జ్యేయశబ్దములు విశేషణములుగా ప్రయోగింపబడినవి. అనంతమును, అవిచ్ఛిన్నసుఖానుభవస్థానమును, శ్రేష్ఠమునునగు లోక మని వాక్యార్థము. అయిన నట్టిలోక మేది? పదునాలుగులోకములును అనంతములు గావు. అవిచ్ఛిన్నసుఖానుభవస్థానములును గావు. విశ్వమే పరిచ్ఛిన్నము. అట్టిపరిచ్ఛిన్నవిశ్వాంతఃపాతిలోకములు అనంతములు గావని వేర చెప్పబని లేదు. ఈపదునాలుగులోకములును నావృత్తిమత్తులుగాన నయ్యవి యవిచ్ఛిన్నసుఖానుభవస్థానములు గావు. ఏతాదృశలక్షణవిశిష్టమైన దొకబ్రహ్మలోకమే. అయ్యదియే అనాద్యనంతమును, అఖండానందవిశిష్టమును. స్వయంప్రచురానందవిశిష్టుడు గనుకనే పరమేశ్వరుడు 'ఏష హ్యే వానందయాతి' ఇతరుల నానందింపజేయగలుగుచున్నాడు. మఱియును

కో హ్యే వాన్యా త్కః ప్రాణ్యా ద్య దేష
ఆకాశ ఆనందో న స్యాత్

బ్రహ్మానందము నాధారముగాగొనియే సర్వప్రాణులును జీవించగలుగుచున్నా రని యీశ్రుతి ప్రతిపాదించుచున్నది.

పరమేశ్వరుడు జీవులయందలి యనుగ్రహముచే హృదయమునందంగుష్ఠమాత్రపరిమాణవిశిష్టుడై యున్నాడు. ఈహార్దబ్రహ్మకే బ్రహ్మలోక మను వ్యవహారము. 'అహ రహ ర్గచ్ఛం త్యేతం బ్రహ్మలోకమ్' అనుశ్రుతి ప్రాణులు ప్రతిదినమును సుషుప్తికాలమున నీబ్రహ్మలోకమునందు విశ్రాంతి నొందుచున్నా రని ప్రతిపాదించుచున్నది. కావున నీ ప్రకరణమున ననంతస్వర్గజ్యేయత్వాదిలక్షణవిశిష్టమైనది హార్దబ్రహ్మలోక మని తెలుచున్నది.

ప్రతితిష్ఠతి, ప్రతితిష్ఠతి — ప్రతిష్ఠ నందును, ప్రతిష్ఠ నందు నని యర్థము.

ప్రతితిష్ఠతి, ప్రతితిష్ఠతి యనుద్విరుక్తి అపునరావృత్తినిసూచించుచున్నది. లోకే = హార్దబ్రహ్మలోకమునందు, ప్రతితిష్ఠతి, ప్రతితిష్ఠతి = ప్రతిష్ఠ నందును, ప్రతిష్ఠనందును అనగా ఆప్రతిష్ఠ శాశ్వతమైయందు ప్రతిష్ఠ నందినవాడు మఱల నటనుండి భూరాదిలోకములయందు జన్మకై తిరిగిరా డని యర్థము.

న స పున రావర్తతే న స పున రావర్తతే

ఈమంత్రము గ్రంథమునందలి చివరమంత్రము. ఈమంత్రమునందు ఫలోపసంహారము గావింపబడినది. ఉపనిషదధ్యాయమునకు పరమప్రయోజనము హార్దబ్రహ్మయం దపునరావృత్తముగ లీన మగుట. ఈవిషయము ఈక్రిందివాక్యముచే నిర్వచింపబడినది.

అనంతే స్వర్గే లోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి

ఇతి శమ్

ఓమ్

ఆప్యాయంతు మమాంగాని వాక్ ప్రాణ శ్చక్షుః శ్రోత్ర మథో బల మింద్రియాణి చ సర్వాణి సర్వం బ్రహ్మోపనిషదం మాహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరో దనిరాకరణ మ స్త్వనిరాకరణం మేస్తు తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మా స్తే మయి సంతు తే మయి సంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః